S TV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

**7036644111, 9490140565**

సంపుటి: 19 | సంచిక: 194 | ఎడిటర్ : విక్రం కుమార్ | శనివారం 23 మే 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |

## రిజర్వేషన్ల ఫలాలు అందరికీ అందేదెప్పుడు?

- ఒకే కుటుంబం పదేపదే కోటా అనుభవిస్తే ఎలా?
- ఐఏఎస్ పిల్లలకూ రిజర్వేషన్లు అవసరమా?
- క్రీమీలేయర్ మినహాయింపులపై సుప్రీంకోర్టు
- కేంద్ర ప్రభుత్వానికి న్యాయస్థానం నోటీసులు




4




4

## సీజేపీ ఎక్స్ ఖాతా నిలిపివేత

కాక్రోచ్ జనతా పార్టీ విదేశీ శక్తుల కుట్ర?

దర్యాప్తు చేస్తున్న ఇంటెలిజెన్స్ వర్గాలు

## ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ వ్యాపారం

- బీఆర్ఎస్ రాగానే ఫ్యూచర్ సిటీ రద్దు
- ఫార్మా సిటీని మళ్లీ పునరుద్ధరిస్తాం
- మాజీ మంత్రి హరీష్ రావు హెచ్చరిక

3



## నిమ్స్ రికార్డు

**2000 కిడ్నీ మార్పిడులు పూర్తి!**



- దేశంలోనే సరికొత్త మైలురాయిని అధిగమించిన ప్రభుత్వ ఆసుపత్రి
- ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు ఉచితంగా అత్యాధునిక సేవలు
- వైద్య బృందానికి మంత్రి అభినందనలు

దేశంలోనే 2 వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసి నిమ్స్ ఆసుపత్రి అరుదైన రికార్డు సృష్టించిందని సంస్థ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప శుక్రవారం ప్రకటించారు. యూరాలజీ, నెఫ్రాలజీ విభాగాల వైద్యుల అద్భుత పనితీరుతోనే ఈ మైలురాయిని అధిగమించామని కొనియాడారు.




2

## నిమ్స్ వైద్యులకు సీఎం రేవంత్ అభినందనలు!



- ఎండలు, వడగాల్పులపై సమీక్ష
- ఓఆర్ఎస్ పంపిణీకి ఆదేశం
- తీవ్రతను బట్టి స్థానికంగా సెలవులు ప్రకటించాలని సూచన!
- గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి కొరత లేకుండా చూడాలని స్పష్టం
- ప్రజలకు అవగాహన కల్పించాలి

5

## అగ్నిగుండంలా ఏపీ




# 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం!

**దేశ సగటును మించి 10.7 శాతంతో తెలంగాణ వృద్ధి**

రాబోయే కాలంలో తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే ప్రజా ప్రభుత్వ ముఖ్య సంకల్పమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఉద్ఘాటించారు. దేశ సగటును మించి రాష్ట్రం 10.7 శాతం వృద్ధి రేటుతో దూసుకుపోతోందని, మహిళా సాధికారత కోసం వడ్డీ లేని రుణాల పరిమితిని 10 లక్షల రూపాయలకు పెంచుతున్నట్లు ప్రకటించారు. ప్రజాభవన్‌లో శుక్రవారం జరిగిన 49వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సంక్షేమం, ఆర్థిక స్వావలంబన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మూసీ పునరుజ్జీవనానికి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

**సమయం న్యూస్, హైదరాబాద్:** రాబోయే కాలంలో తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే ప్రజా ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శుక్రవారం ప్రజాభవన్‌లో జరిగిన 49వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమం, ఆర్థిక స్వావలంబన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మహిళా సాధికారత, మూసీ పునరుజ్జీవనానికి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, ఉన్నతాధికారులు దాన కిశోర్, సందీప్ కుమార్ సుల్తానియా, గౌరవ్ ఉప్పల్, ఆర్బీఐ రీజనల్ డైరెక్టర్ చిన్మయ మోహన్, ఎస్బీఐ సీజీఎం నీలేష్ ద్వివేది పాల్గొన్నారు. ప్రస్తుతం దేశ సగటు వృద్ధి రేటు 8.2 శాతంగా ఉంటే, తెలంగాణ 10.7 శాతం వృద్ధి రేటుతో దూసుకుపోతోందని

మిగతా 2 లో

- మహిళా సంఘాల వడ్డీ లేని రుణాలు 10 లక్షలకు పెంపు
- పట్టణీకరణతో సేవల రంగానికి భారీ అవకాశాలు
- విద్యార్థుల రుణాలు.. భవిష్యత్ పెట్టుబడులు..
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

## డిప్యూటీ కలెక్టర్ వంశీమోహన్ అరెస్ట్

ఏసీబీ సోదాల్లో భారీగా ఆస్తుల గుర్తింపు



2

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యూఎల్‌సీ, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ వంశీ మోహన్‌ను అవినీతి నిరోధకశాఖ శుక్రవారం అరెస్ట్ చేసింది.




5

## రూ.3 వేల కోట్ల సోలార్ ప్రాజెక్టు ప్రారంభం

'మా బ్రాండ్ జాబ్ క్రియేషన్' అంటూ లోకేష్ వ్యాఖ్యలు

## రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్

- ఏపీలో నాలుగు స్థానాలకు ఎన్నికలు
- జూన్ 1న నోటిఫికేషన్ జారీ
- జూన్ 18న పోలింగ్, అదే రోజు ఫలితాలు
- దేశవ్యాప్తంగా 24 స్థానాలకు ఎన్నికల ప్రక్రియ
- పలువురు కీలక నేతల పదవీకాలం ముగింపు

5





3

## తెలంగాణ విద్యా రంగంలో సంచలనం

విద్యా కమిషన్ చైర్మన్ పదవికి ఆకునూరి మురళి రాజీనామా

- విద్యా కమిషన్ చైర్మన్ పదవికి ఆకునూరి మురళి రాజీనామా
- విద్యారంగంలో అనేక మార్పులు సూచిస్తూ నివేదిక



# కనీస వేతనాల పేరుతో కార్మికులను మోసం చేయొద్దు!

- గౌరవప్రదమైన జీవనం కల్పించడం ప్రభుత్వ బాధ్యత
- వివిధ విభాగాలకు 22 వేల నుండి 36 వేల వరకు ఇవ్వాలి
- కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ డిమాండ్

**హైదరాబాద్, మే 22 :** కనీస వేతనాల పేరిట కార్మికులను మోసం చేయొద్దని, వారికి గౌరవప్రదమైన జీవనం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని కేంద్ర కార్మిక శాఖ మాజీ మంత్రి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని కోరారు. గత 14 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న కనీస వేతనాల అంశాన్ని ప్రభుత్వం తూతూమంత్రంగా పరిష్కరించి కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. ప్రస్తుతం ప్రభుత్వం పెంచిన వేతనాలు గుడ్డిలో మెల్ల అన్నట్లుగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. విద్య, వైద్యం, ఇంటి అద్దెలు, రవాణా ఖర్చులు, నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం ప్రకటించిన వేతనాలు కార్మికుల జీవన అవసరాలకు సరిపోవడం లేదని దత్తాత్రేయ అన్నారు. ముఖ్యంగా హైదరాబాద్ వంటి నగరాల్లో జీవన వ్యయం రోజురోజుకు పెరుగుతున్న వేళ నైపుణ్యం లేని, పాక్షిక నైపుణ్యం ఉన్న, నైపుణ్యం కలిగిన, ఉన్నత నైపుణ్యం ఉన్న కార్మికులకు తగిన స్థాయిలో వేతనాలు నిర్ణయించాలన్నారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధి రేటు పెరుగుతున్నప్పుడు కార్మికుల ఆదాయం కూడా పెరగాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో సుమారు ఒక కోటి 20 లక్షల మంది కార్మికులు కనీస వేతనాల పెంపు కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. వేతనం అనేది వరం కాదని, అది కార్మికుడి హక్కని దత్తాత్రేయ స్పష్టం చేశారు. కార్మికుడి చెమటతోనే పరిశ్రమలు, నిర్మాణ రంగం, నగరాల అభివృద్ధి సాధ్యమవుతోందని పేర్కొన్నారు. అభివృద్ధి అంటే కేవలం భారీ భవనాలు, పెట్టుబడులు మాత్రమే కాదని, కార్మికుని కుటుంబం సమాజంలో గౌరవంగా జీవించే పరిస్థితి రావడమే నిజమైన అభివృద్ధి అని ఆయన అభిప్రాయపడ్డారు. నైపుణ్యం లేని కార్మికులకు కనీస వేతనంగా రూ. 22 వేలు, పాక్షిక నైపుణ్యం ఉన్న వారికి రూ. 27 వేలు ఇవ్వాలని దత్తాత్రేయ డిమాండ్ చేశారు. అలాగే నైపుణ్యం కలిగిన వారికి రూ. 31 వేలు, ఉన్నత నైపుణ్యం ఉన్న కార్మికులకు రూ. 36 వేల వరకు వేతనాలు నిర్ణయించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అసంఘటిత రంగ కార్మికుల హక్కులను ప్రభుత్వం కాపాడాలని, కార్మికుల సమస్యలను మానవీయ దృక్పథంతో పరిశీలించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం న్యాయమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

# డిప్యూటీ కలెక్టర్ అరెస్ట్

ఎసిబి సోదాల్లో భారీగా ఆస్తుల గుర్తింపు



**హైదరాబాద్, మే 22:** మేడ్చల్ మల్కాజిగిరి డిప్యూటీ కలెక్టర్ వంశీమోహన్‌ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. ఉదయం నుంచి ఆయన కార్యాలయం సహా మరో 11 ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. బంధువులు, స్నేహితులు, బినామీల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. వంశీమోహన్‌కు సంబంధించిన భారీ ఆస్తులను గుర్తించారు. తనిఖీల్లో రూ. 4.46 కోట్ల విలువైన 19 ఓపెన్ ప్లాట్లు, రూ. 1.12 కోట్ల విలువగల 3 ఇళ్లను వనస్థలిపురం, మణికొండ, మజీద్‌కొండ ప్రాంతాల్లో.. ఇబ్రహీంపట్నం పరిధిలోని నారపల్లి వద్ద 2 ఎకరాల్లో ఫాంహౌస్ ఉన్నట్లు గుర్తించారు. శేరిలింగంపల్లి, ఇతర ప్రాంతాల్లో ఆర్డీవోగా పనిచేసిన వంశీమోహన్.. భారీగా ప్రభుత్వ భూములను సొంతం చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అబ్దుల్లాపూర్‌మెట్, పిగ్లీపురంలో 8 ఎకరాలు ఆక్రమించినట్లు ఆరోపణలు ఎదుర్కొన్నారు. భూములను తన మామ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించి.. ఆ తర్వాత రియల్టర్‌కు ధారాదత్తం చేసినట్టు అధికారులు గుర్తించారు. ఓ రియల్టర్ నుంచి 10ప్లాట్లు గిఫ్ట్ డీడ్ చేయించుకున్నట్టు ఏసీబీ గుర్తించింది.

# అర్చక తండ్రీ కుమారుల ఆత్మహత్య

**జనగామ, మే 22:** జనగామ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. అర్చకులుగా పనిచేస్తున్న తండ్రీకుమారులు ఆత్మహత్య చేసుకున్నారు. గణపురం మండలం బండగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అర్చకులుగా విధులు నిర్వహించే వరయోరు లక్ష్మీనరసింహాచార్యులు, ఆయన కుమారుడు పవన్‌కుమార్ ఆచార్యులు బలవన్మరణానికి పాల్పడినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఆలయ కోనేరులో పడి మృతిచెందినట్లు చెప్పారు. లక్ష్మీనరసింహాచార్యుల భార్య శ్రీదేవి నెల క్రితం అనారోగ్యంతో చనిపోవడం, ఆర్థిక ఇబ్బందులు తదితర కారణాలతో తండ్రీకుమారులు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఎస్సై శ్రావణ్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# వడదెబ్బతో నలుగురు మృతి

**వరంగల్, మే 22:** తెలంగాణలో ఎండలు రోజురోజుకీ మరింత తీవ్రరూపం దాల్చుతున్నాయి. ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లా నిప్పులకొలిమిలా మారింది. భూపాలపల్లిలో వడదెబ్బతో ఒక్కరోజే నలుగురు మృతి చెందడం ఆందోళన కలిగిస్తోంది. రేగొండ మండలం భాగిర్తిపేటకు చెందిన యాకూబ్(45), మొగుళ్లపల్లి మండలం పోతుగల్లుకు చెందిన సక్కమ్మ(59), చిట్యాల మండలం చల్లగరిగేకు చెందిన పోషయ్య, కాటారం మండలం శంకరంపల్లికి చెందిన సమ్మక్క(65) వడదెబ్బ బారినపడి ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్రవ్యాప్తంగా గురువారం ఒక్కరోజే 22 మంది వడదెబ్బతో మృతి చెందినట్లు తెలుస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే తొమ్మిది మంది వడదెబ్బ బారినపడి మరణించడం ఆందోళన కలిగిస్తోంది. భానుడి భగభగలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మధ్యాహ్నం సమయంలో బయటకు రావడానికి కూడా ప్రజలు భయపడుతున్నారు. అత్యధిక ఉష్ణోగ్రతల కారణంగా వడదెబ్బ మరణాలు కూడా పెరుగుతున్నాయి. తీవ్రమైన ఎండలతో చిన్నపిల్లలు, వృద్ధులు, బయట పనులు చేసే కార్మికులు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారు. నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లొద్దని హెచ్చరిస్తున్నారు. ఎక్కువగా నీరు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు వంటి ద్రవాలు తీసుకోవాలని సూచిస్తున్నారు. అలాగే వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించడం అవసరమని ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు.

# 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం!

మొదటి పేజీ తరువాయి

డిప్యూటీ సీఎం వెల్లడించారు. దేశ సగటు తలసరి ఆదాయం రూ. 2.1 లక్షలు కాగా, తెలంగాణ తలసరి ఆదాయం రూ. 4.18 లక్షలతో అగ్రగామిగా ఉందన్నారు. రాష్ట్రంలో బ్యాంకుల డిపాజిట్లు రూ. 9.43 లక్షల కోట్లకు, అడ్వాన్సులు రూ. 12.34 లక్షల కోట్లకు చేరడం విశేషమన్నారు. క్రెడిట్-డిపాజిట్ నిష్పత్తి 130.78శాతంగా ఉందన్నారు. రూ. 1,65,297 కోట్లకి రూ. 1,68,401 కోట్ల వ్యవసాయ రుణాలు(101.88 శాతం) పంపిణీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రైతులకు, పాడి రైతులకు, మత్స్యకారులకు బ్యాంకులు అందిస్తున్న మద్దతును అభినందించారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం స్వయం సహాయక సంఘాల వడ్డీ లేని రుణాల పరిమితిని రూ. 5 లక్షల నుండి రూ. 10 లక్షలకు పెంచుతున్నట్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలోని మురికివాడల యువ మహిళా పారిశ్రామికవేత్తలపై ప్రత్యేక దృష్టి సారించి రుణాలివ్వాలన్నారు. విద్యార్థులకు ఇచ్చే విద్యా రుణాలు యువతపై పెట్టే భవిష్యత్ పెట్టుబడులని, బ్యాంకులు




సానుకూలంగా స్పందించాలని కోరారు. సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలతో పాటు మహిళా, దళిత, గిరిజన యువ పారిశ్రామికవేత్తలకు రుణాల పంపిణీ పెంచాలన్నారు. వేగంగా జరుగుతున్న పట్టణీకరణ వల్ల సేవలకు అధిక అవకాశాలు ఉంటాయన్నారు. సౌరశక్తి ప్రాజెక్టులు, రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు బ్యాంకులు చురుగ్గా రుణ సహాయం అందించాలని డిప్యూటీ సీఎం సూచించారు. బ్యాంకులు కేవలం ఆర్థిక లావాదేవీలకే పరిమితం కాకుండా రాష్ట్ర వ్యూహాత్మక అభివృద్ధి భాగస్వాములుగా మారాలన్నారు. మూసీ నది పునరుజ్జీవనం, సిటీ, రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణాలను వేగంగా పూర్తి చేస్తామన్నారు. రాష్ట్రంలో త్వరలోనే ఫార్మా, ఫ్యాబ్ సిటీ, స్టీల్, లెదర్, టెక్స్‌టైల్ రంగాలలో ఇండస్ట్రియల్ హబ్‌లు, క్లస్టర్లను తీసుకువచ్చి జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షిస్తామని వెల్లడించారు.

# నిమ్స్ అరుదైన రికార్డు

- 2000 కిడ్నీ మార్పిడులు పూర్తి!
- దేశంలోనే సరికొత్త మైలురాయి
- ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా అత్యాధునిక సేవలు



**హైదరాబాద్, మే 22:** దేశంలోనే 2 వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసిన తొలి ప్రభుత్వ ఆసుపత్రిగా నిమ్స్ అరుదైన మైలురాయిని చేరుకుంటూ సరికొత్త రికార్డు సృష్టించిందని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప శుక్రవారం ప్రకటించారు. యూరాలజీ, నెఫ్రాలజీ విభాగాల వైద్యులు, సిబ్బంది అద్భుతమైన పనితీరుతోనే ఈ ఘనత సాధ్యమైందన్నారు. 1989లో నిమ్స్‌లో తొలి కిడ్నీ మార్పిడి జరగ్గా.. ఇప్పుడు 2000వ మైలురాయిని విజయవంతంగా అందుకున్నట్లు తెలిపారు. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు సహకరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటివరకు 2000 మంది కిడ్నీ రోగులకు నూతన జీవితాన్ని ప్రసాదించిన నిమ్స్.. పేద, మధ్యతరగతి కుటుంబాలకు పెద్ద అండగా నిలిచింది. కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల్లో దాదాపు 95 శాతం మంది రోగులు ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా పూర్తిగా ఉచితంగా చికిత్స పొందారని బీరప్ప వెల్లడించారు. ఆపరేషన్‌తో పాటు అవయవ మార్పిడి అనంతరం జీవితాంతం అవసరమయ్యే మందులను కూడా ప్రభుత్వమే ఉచితంగా అందిస్తోందని పేర్కొన్నారు. యూరాలజీ విభాగం హెడ్ డాక్టర్ రాహుల్ రాజ్ నేతృత్వంలో ఈ ఘనత సాధ్యమైందని డైరెక్టర్ కొనియాడారు. క్లిష్టమైన బహుళ రక్తనాళాల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు, చిన్నారులలో ట్రాన్స్‌ప్లాంట్లు, రీ-ట్రాన్స్‌ప్లాంట్లు వంటి సవాలుతో కూడిన ఆపరేషన్లను తమ టీమ్ విజయవంతంగా నిర్వహించిందన్నారు. దక్షిణ భారతదేశంలో ప్రభుత్వ ఆసుపత్రిలో తొలి రోబోటిక్ కిడ్నీ మార్పిడి కూడా నిమ్స్‌లోనే జరగడం విశేషమన్నారు. నిమ్స్ వైద్య బృందం సాధించిన ఈ అరుదైన ఘనతపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో అత్యాధునిక వైద్యం అందించగల సామర్థ్యం తెలంగాణకు ఉందని నిమ్స్ నిరూపించిందన్నారు. పేదలకు ఉచితంగా ఖరీదైన సేవలు అందించేందుకు గాంధీ ఆసుపత్రిలో 6 మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లతో ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. సనత్‌నగర్ టిమ్స్ ఆసుపత్రిలోనూ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు, రాష్ట్రవ్యాప్తంగా ఆర్గాన్ రిట్రైవల్ సెంటర్లను అందుబాటులోకి తెస్తున్నట్లు మంత్రి వెల్లడించారు.

# నిమ్స్ వైద్యులకు సీఎం రేవంత్ అభినందనలు!

కిడ్నీ మార్పిడులతో దేశంలోనే అరుదైన రికార్డు

ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత శస్త్రచికిత్సలు




**హైదరాబాద్, మే 22:** దేశంలోనే రికార్డు స్థాయిలో రెండు వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించిన నిమ్స్ వైద్యుల బృందాన్ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందించారు. జాతీయ స్థాయిలో అరుదైన మైలురాయిని అందుకున్న నిమ్స్ వైద్య బృందం సేవలు ఎంతో ప్రశంసనీయమని కొనియాడారు. ఈ అరుదైన మైలురాయిని సాధించి కిడ్నీ బాధితులకు విశేష సేవలు అందించిన వైద్యులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) కిడ్నీ మార్పిడిలో దేశంలోనే అరుదైన రికార్డు నమోదు చేసింది. నిమ్స్ యూరాలజీ విభాగం ఇప్పటివరకు 2,000 కిడ్నీ మార్పిడులు పూర్తి చేసింది. ఈ అవయవ మార్పిడులలో దక్షిణ భారతదేశంలోనే నిమ్స్ మొదటి స్థానంలో నిలిచింది. దేశవ్యాప్తంగా చూసుకుంటే గుజరాత్‌లోని ఐకేడీఆర్‌సీ ప్రథమ స్థానంలో ఉండగా.. లూథియానా క్రిస్టియన్ కాలేజీ రెండో స్థానంలో, నిమ్స్ మూడో స్థానంలో నిలిచాయి. ఈ రెండు వేల మంది బాధితులలో 1,900 మంది, అంటే దాదాపు 95 శాతం మంది రాజీవ్ ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా కిడ్నీ మార్పిడి చేయించుకోవడం విశేషమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆసుపత్రి రికార్డుల ప్రకారం 2023 జనవరి నుంచి గడిచిన మూడు సంవత్సరాల నాలుగు నెలల కాలంలోనే రికార్డు స్థాయిలో 500 కిడ్నీ మార్పిడులు పూర్తి చేసి నిమ్స్ సరికొత్త చరిత్ర సృష్టించింది.

# డిజిటల్ రంగంలో తెలంగాణే రోల్ మోడల్!


- పౌర సేవలను ప్రజల ముంగిటకే చేర్చేలా రోడ్‌మ్యాప్
- ఆర్థిక వృద్ధికి సరికొత్త ఎకో సిస్టం నిర్మాణం
- ఫైనాన్స్ సమ్మిట్‌లో ఐటీ మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్, మే 22:** డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ప్రభుత్వ పౌర సేవలను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా ప్రజల ముంగిటకే చేర్చేలా ఒక ప్రత్యేక సమగ్ర రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ఆధ్వర్యంలో నోవాటెల్ హెచ్ఐసీసీలో నిర్వహించిన 'డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఫైనాన్స్ సమ్మిట్ 2026'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం గ్లోబల్ ఎకానమీ ఊహించని వేగంతో డిజిటల్ వైపు దూసుకుపోతోందని, సాంప్రదాయ పద్ధతుల స్థానంలో వ్యవస్థను రీ-డిఫైన్ చేసే సరికొత్త డిజిటల్ సమీకరణాలు తెరపైకి వచ్చాయని మంత్రి తెలిపారు. ఈ మార్పులను అందిపుచ్చుకునే దేశాలకే భవిష్యత్తు ఉంటుందని, ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలిచిందన్నారు. డిజిటల్ పేమెంట్స్ నుండి డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వరకు దేశం సాధిస్తున్న పరివర్తనకు తెలంగాణ ఒక గ్రోత్ ఇంజన్‌లా మారిందన్నారు. భావితరాల అవసరాలకు అనుగుణంగా నెక్స్ట్ జనరేషన్ ఇన్నోవేషన్స్, టాలెంట్, ఎకనామిక్ గ్రోత్... ఈ మూడింటినీ నడిపించేలా ఒక బలమైన ఎకోసిస్టంను అభివృద్ధి చేస్తున్నామని, 2047 నాటికి దేశ జీడీపీలో మన వాటాను 10 శాతానికి చేర్చడమే లక్ష్యమని వివరించారు. ఒకప్పుడు కేవలం సంప్రదాయ బుక్ కీపింగ్, అకౌంట్స్ ఆడిటింగ్‌కే పరిమితమైన సీఏలు... నేడు కార్పొరేట్ సంస్థలకు 'స్ట్రాటజిక్ బిజినెస్ అడ్వైజర్స్'గా రూపాంతరం చెందారని మంత్రి ప్రశంసించారు. ఏఐ, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ వంటి సరికొత్త సాంకేతికతల వల్ల ఫైనాన్స్ రంగంలో అపార అవకాశాలు వస్తున్నాయని, అదే సమయంలో సైబర్ మోసాలు, డీప్‌ఫేక్స్, సైబర్ అరెస్ట్, క్రిప్టో ఫ్రాడ్స్ వంటి సవాళ్లు కూడా పెరుగుతున్నఎన్నారు. ఇలాంటి తరుణంలో సీఏలు కేవలం ఫైనాన్షియల్ ఆడిటింగ్‌కే పరిమితం కాకుండా 'సైబర్ అష్యూరెన్స్'కూ ప్రాధాన్యమివ్వాల్సిన అవసరముందన్నారు. మారుతున్న ట్రెండ్స్‌కు అనుగుణంగా స్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్‌పై దృష్టి సారించాలని, ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఅండ్ఏజీ ఆనంద్ మోహన్ బజాజ్, సెర్ట్-ఇన్ జాయింట్ డైరెక్టర్ అభిషేక్ సోలంకి, ఇన్‌కమ్ ట్యాక్స్ ఇన్వెస్టిగేషన్ ప్రిన్సిపల్ డైరెక్టర్ రాజగోపాల్ శర్మ, సెబీ సీజీఎం సాహిల్ మాలిక్, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్పీ హర్షవర్ధన్, ఆర్బీఐ సీజీఎం శైలజా రాణి జంపాల, ఎన్ఎస్ఈ సీఐఎస్వో రాజేష్ థాపర్, డేటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సీఈవో వినాయక్ గాద్వే పాల్గొన్నారు.

# అగ్ని-1 బాలిస్టిక్ క్షిపణ పరీక్ష విజయవంతం

**చాందీపూర్,మే22 :** స్వల్పశ్రేణి లక్ష్యాలను ఛేదించే అగ్ని-1 బాలిస్టిక్ క్షిపణ పరీక్ష విజయవంతమైంది. ఒడిశా తీరంలోని చాందీపూర్‌లోనున్న ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి వ్యూహాత్మక దళాల కమాండ్ (ఎస్ఎఫ్‌సీ) ఆధ్వర్యంలో శుక్రవారంనాడు ఈ క్షిపణ పరీక్ష జరిగింది. ఉపరితలం నుంచి ఉపరితలం పైకి దాడి చేసే స్వల్పశ్రేణి బాలిస్టిక్ క్షిపణి పరీక్షను ఎస్ఎఫ్‌సీ విజయవంతంగా ప్రయోగించి నట్టు రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పరీక్షతో అన్ని కార్యాచరణ, సాంకేతిక పరిమితులను విజయవంతంగా ధ్రువీకరించినట్టు పేర్కొంది. గత ఏడాది జూలైలోనూ ఇదేతరహా పరీక్షను డీఆర్‌డీఓ విజయవంతంగా నిర్వహించింది. ఈ క్షిపణి 700 నుంచి 1,200 కిలోమీటర్ల లక్షాలను సునాయాసంగా ఛేదించగలదు. అణ్వాయుధాలను మోసుకెళ్లే శక్తివంతమైన క్షిపణిగా దీనిని డీఆర్‌డీఓ అభివృద్ధి చేసింది. కాగా, ఈనెల మే 8న అడ్వాన్స్ అగ్ని మిజైల్‌ను ఒడిస్సాలోని అబ్దుల్ కలాం ఐలాండ్ నుంచి ఇండియా విజయవంతంగా పరీక్ష చేసింది. మల్టిపుల్ ఇండిపెండెంట్లీ టా÷-గ్గ÷టెడ్ రీ-ఎంట్రీ వెహికల్ సిస్టమ్ (ఎంఐఆర్‌వీ)తో ఈ క్షిపణి పరీక్ష నిర్వహించారు. వేర్వేరు ప్రదేశాల్లో ఉన్న బహుళ లక్ష్యాలను ఈ క్షిపణి విజయవంతంగా ఛేదించింది. ఇండియాకు పెరుగుతున్న ముప్పు అవకాశాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవసరమైన సన్నద్ధతను ఎంఐఆర్‌వీ చాటిచెప్పిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ డీఆర్‌డీఓను ప్రశంసించారు.





# ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ వ్యాపారం

**బీఆర్ఎస్ రాగానే ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తాం**

**మాజీ మంత్రి హరీష్ రావు హెచ్చరిక**

**హైదరాబాద్, మే 22:** బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న మాజీ మంత్రి.. కాంగ్రెస్ సర్కార్ చేపడుతున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. ఫార్మా సిటీకి మాత్రమే కేంద్ర పర్యావరణశాఖ అనుమతి ఇచ్చిందని తెలిపారు. డీవియేషన్ ఉంటే రైతుల భూములు వెనక్కి ఇవ్వాలని చట్టంలో ఉందని వెల్లడించారు. ఫార్మా సిటీని కొనసాగిస్తామని ఓ వైపు కోర్టుకు చెబుతూ.. రేవంత్ ప్రభుత్వం జిమ్మిక్కు చేస్తోందని విమర్శించారు. ఫార్మా సిటీ వస్తే దానికి అనుబంధంగా కనీస సౌకర్యాలు ఎడ్యుకేషన్, హౌసింగ్ రావాలని ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. 75శాతం ఫార్మా సిటీ ఉండి... మిగతా 25శాతం మిగతావి ఉండాలని అన్నారు. కానీ..75శాతం మిగతా వ్యాపారం చేసి.. కేవలం 25శాతమే ఫార్మా వచ్చేలా చేస్తున్నారని విమర్శించారు. ఇది చట్ట ప్రకారం చెల్లదన్నారు. ఫ్యూచర్ సిటీ పేరుతో కాంగ్రెస్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని మాజీ మంత్రి ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని.. ఫార్మా సిటీని రీస్టోర్ చేస్తామని స్పష్టం చేశారు. 'ఇది నా మాట కాదు.. పార్లమెంట్ చట్టం. ఫార్మా సిటీ వస్తే లక్షలాది మందికి ఉద్యోగాలు వస్తాయని మేము ప్రారంభించాం. మన దగ్గర నుంచి ఒక్క ఫార్మా కంపెనీ బయటికి వెళ్లొద్దని చేశాం. ఇప్పటికే రెండున్నరేళ్లు గడిచిపోయింది. లాస్ట్ వన్ ఇయర్ ఎలక్షన్ ఉంటుంది. రేవంత్ సర్కార్ ఏమీ చేయలేదు. భూములు పంచి పెడితే బ్యాక్ ఎండ్ ఏదో లబ్ధి పొందాలని ప్లాన్ చేశారు. ఫార్మా సిటీ అభివృద్ధి చెందితే బీఆర్ఎస్‌కు పేరు వస్తుందని ఇలా చేశారు. ఉన్నది ఉన్నట్టుగా అక్కడ ఫార్మా సిటీనే వస్తుంది' అని హరీశ్ రావు స్పష్టం చేశారు.

# భూదోపిడీ మీద ఉన్న శ్రద్ధ.. రైతన్నలపై ఏదీ?

**భూ ఆక్రమణలపై ఎందుకు స్పందించడ లేదు**

**సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ కేటీఆర్**




**హైదరాబాద్, మే 22:** కాంగ్రెస్ ప్రభుత్వానికి భూముల దోపడీ మీద ఉన్న శ్రద్ధ దేశానికి అన్నంపెట్టే రైతులపై లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. మొన్నటికి మొన్న రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి భూ హారతి ద్వారా కేసముద్రంలో అసైన్డ్ పట్టాలు ఆక్రమించాడని ఆరోపించారు. శంషాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుచరులు 90 ఎకరాల సీలింగ్ భూమిని తహసీల్దార్, కలెక్టర్ స్థాయిలో ఉత్తర్వులు ఇచ్చి వేల కోట్ల భూమిని దోపిడీ ఎలా చేశారో ఏసీబీ దాడిలో దొరికారు. అయినా కూడా ఇలాంటి వాటిపై రేవంత్ రెడ్డి దృష్టి పెట్టడని విమర్శించారు. ధాన్యం కొనుగోళ్లు చేపట్టక రైతులు పిట్టల్లా రాలిపోతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం ధాన్యం కొనుగోళ్లపై చేపట్టిన సమీక్ష తీవ్ర నిరాశకు గురి చేసిందన్నారు. డబ్బు సంచుల మీద ఉన్న శ్రద్ధ ధాన్యం సంచుల సేకరణలో లేదని మండిపడ్డారు. తెలంగాణ వ్యాప్తంగా వడ్లు కొనక 45 రోజుల్లో 10 మంది చనిపోతే ఒక్కరు కూడా చనిపోలేదని సివిల్ సప్లైస్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సిగ్గు లేకుండా అబద్ధాలు ఆడుతున్నారు. మంత్రి సొంత జిల్లాలో మహ్మద్ నసీరుద్దీన్ అనే రైతుల ధాన్యం రాశిపైనే మృతి చెందాడన్నారు. జనగామ జిల్లా ఏనెబావిలో కాంటాలు పెట్టడంలేదని కాంగ్రెస్ కార్యకర్తలే ఆందోళన చేరన్నారు. ఇనేక సంఘటనలు జరిగాయన్నారు. ఓ కాంగ్రెస్ నాయకుడు మా పార్టీ నాయకుడికి ఫోన్ చేసి, ధాన్యం ప్రభుత్వం కొనుదు ఎందయ్యా, మాకు లేని పని పెట్టిండు మీ కేసీఆర్ అని చెప్తున్నాడు ఓ కాంగ్రెస్ నాయకుడు మా పార్టీ నాయకుడికి ఫోన్ చేసి ధాన్యం ప్రభుత్వం కొనుడు ఎందయ్యా, మాకు లేని పని పెట్టిండు మీ కేసీఆర్ అని చెప్తున్నాడు. రాష్ట్రంలో ఇప్పటివరకు 35? ధాన్యం కూడా కొనుగోలు చేయలేదన్నారు. కానీ రేవంత్ రెడ్డి, అతని మంత్రులు 80? కొనుగోలు చేశామని అబద్ధాలు చెప్తున్నారని మండిపడ్డారు. రైతుల ఇబ్బందుల మీద అవగాహన లేకుండా రేవంత్ రెడ్డి అడ్డగోలుగా మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఊరికైనా పోదాం.. ఎక్కడన్నా మీరు చెప్పినట్లు 80 శాతం పంట కొనుగోళ్లు చేశారని నిరూపిస్తే మేము ఏ శిక్షకైనా సిద్ధమని రేవంత్ రెడ్డికి కేటీఆర్ ఛాలెంజ్ విసిరారు. రేవంత్‌లో అగౌరవంగా మాట్లాడే భాష తనకు రాదన్నారు.

**పోక్సో కేసు నిందితుడిని దాచిపెట్టిందెవరు?**

పోక్సో కేసు విషయంలో బండి భగీరథ్‌ను కాపాడేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్రమంత్రి బండి సంజయ్ కుమ్మక్కయ్యారని కేటీఆర్ ఆరోపించారు. శనివారం జరిగే క్యాబినెట్ సమావేశంలో ఈ అంశమే ప్రధాన అజెండాగా ఉండాలి. ప్రభుత్వం ఎంత ధాన్యం కొనుగోలు చేసిందో శ్వేతపత్రం విడుదల చేయాలి. పోక్సో కేసులో నిందితుడిని 9 రోజులు దాచిపెట్టిందెవరో చెప్పాలి. సామాన్యుడైతే పోలీసులు ఊరుకుంటారా? నిందితుడిని నిందితుడిగానే చూడాలి" అని కేటీఆర్ అన్నారు.

# పంట రుణాలను విస్తరించాలి!

- ఆహార శుద్ధి, గిడ్డంగులు, డైరీ రంగానికి దీర్ఘకాలిక రుణాలు ఇవ్వాలి
- గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి బ్యాంకులు భాగస్వాములు కావాలి
- 49వ ఎస్ఎల్‌బీసీ సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్, మే 22:** తెలంగాణ రాష్ట్రంలో రైతులకు ఇచ్చే పంట రుణాలను కేవలం సాగుకే పరిమితం చేయకుండా, ఇతర వ్యవసాయ మౌలిక సదుపాయాల కల్పనకు విస్తరించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బ్యాంకు అధికారులకు సూచించారు. ప్రజాభవన్‌లో నిర్వహించిన 49వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) త్రైమాసిక సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి బ్యాంకులు మరింత చురుకైన పాత్ర పోషించాలన్నారు. రాష్ట్రంలో 2025-26 ఆర్థిక సంవత్సరాంతానికి మొత్తం డిపాజిట్లు రూ. 9.43 లక్షల కోట్లకు, అడ్వాన్సులు రూ. 12.33 లక్షల కోట్లకు చేరాయని మంత్రి తెలిపారు. సీడీ (క్రెడిట్-డిపాజిట్) నిష్పత్తి 130.78 శాతంగా నమోదై జాతీయ సగటును మించి ఉందన్నారు. ప్రధాన రంగ రుణాలు రూ. 4.09 లక్షల కోట్లు, వ్యవసాయ రుణాలు రూ. 1.87 లక్షల కోట్లకు చేరి 102 శాతం లక్ష్య సాధన నమోదు చేయడం అభినందనీయమన్నారు. పంట రుణాల పంపిణీ రూ. 75,486 కోట్లకు (84.34 శాతం) చేరిందని, మొత్తం వ్యవసాయ, అనుబంధ రంగాలు, మౌలిక వసతుల కింద రూ. 1,68,401 కోట్ల రుణాలు (101.88 శాతం) పంపిణీ జరిగిందని వివరించారు. కెనరా బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, టీజీకాబ్ వంటి బ్యాంకులు లక్ష్యాలను మించి రుణాలివ్వగా, మరికొన్ని బ్యాంకులు పనితీరు మెరుగుపరుచుకోవాలన్నారు. వ్యవసాయం ఇప్పుడు ఉద్యానవనం, ఆయిల్ పామ్, సమగ్ర వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, రక్షిత సాగు, పాడి, మత్స్య, యాంత్రీకరణ వైపు వేగంగా మారుతోందని, బ్యాంకులు కూడా దీర్ఘకాలిక పెట్టుబడి రుణాలు అందించాలని కోరారు. గత రెండేళ్లుగా వరి, మొక్కజొన్న ఉత్పత్తి రికార్డు స్థాయిలో పెరిగి నిల్వ సామర్థ్యంపై ఒత్తిడి పెరిగిందని, అందువల్ల వేర్ హౌస్ రిసీప్ట్ ఫైనాన్స్, ఈ-ఎన్‌డబ్ల్యూఆర్ ఫైనాన్స్ విస్తరించాలన్నారు. రాష్ట్రంలో కేవలం 6 శాతం భూమిలోనే ఉద్యాన పంటలు సాగవుతున్నా వ్యవసాయ స్థూల విలువలో వాటి వాటా 25 శాతంగా ఉందన్నారు. ఏటా రూ. 4,500 కోట్ల కూరగాయలను ఇతర రాష్ట్రాల నుండి దిగుమతి చేసుకుంటున్నందున కోల్డ్ చైన్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో భారీ అవకాశాలు ఉన్నాయన్నారు. ఆయిల్ పామ్ సాగు ఇప్పటికే 2.91 లక్షల ఎకరాలకు విస్తరించి 79 వేల మంది రైతులు సాగు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఒకే విడతలో రూ. 21 వేల కోట్ల రైతు రుణమాఫీ చేసిందని, దీనివల్ల బ్యాంకుల రికవరీలు మెరుగుపడి వ్యవసాయ ఎన్‌పీఏలు 5.23 శాతం నుండి 4.71 శాతానికి తగ్గాయన్నారు. టర్మ్ లోన్ల ఎన్‌పీఏలు కేవలం 2.62 శాతంగా ఉండటం రైతుల క్రమశిక్షణకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలోని వెయ్యి రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు (ఎఫ్‌పీఓలు) ఇన్‌పుట్ షాపులు, గిడ్డంగులు, డ్రోన్లు, ప్రాసెసింగ్ యూనిట్ల కోసం వర్కింగ్ క్యాపిటల్ అందించాలన్నారు. వ్యవసాయ యాంత్రీకరణకు 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ. 147.91 కోట్ల బడ్జెట్ కేటాయించామని, ఇది డీబీటీ విధానంలో అమలవుతుందన్నారు. సాగుభూమిలో 30 శాతం సాగు చేస్తున్న కౌలు రైతులకు సకాలంలో పంట రుణాలు అందించి ప్రైవేట్ అప్పుల బారిన పడకుండా చూడాలని కోరారు. ఈ సమావేశంలో నాబార్డ్ అధికారులు, సహకార బ్యాంకులు, వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

# తెలంగాణ విద్యా రంగంలో సంచలనం

- విద్యా కమిషన్ ఛైర్మన్ పదవికి ఆకునూరి మురళి రాజీనామా
- విద్యారంగంలో అనేక మార్పులు సూచిస్తూ నివేదిక
- అంతలోనే రాజీనామా చేయడంపై సర్వత్రా చర్చ



**హైదరాబాద్, మే 22:** తెలంగాణ విద్యా రంగంలో సంచలనం చోటుచేసుకుంది. రాష్ట్ర విద్యా కమిషన్ ఛైర్మన్, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి తన పదవికి రాజీనామా చేశారు. విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలనే లక్ష్యంతో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనను ఈ కీలక బాధ్యతల్లో నియమించింది. అయితే, తన పదవికి నాలుగు నెలల ముందుగానే రాజీనామా లేఖను ప్రభుత్వానికి సమర్పించడం రాష్ట్ర రాజకీయ, విద్యా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ విద్యా రంగంపై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించిన అనంతరం ఆకునూరి మురళి ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. విద్యా సంస్కరణల నివేదిక పూర్తి కావడంతో తన బాధ్యత ముగిసిందని పేర్కొంటూ, తన రాజీనామా లేఖను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమర్పించారు. విద్యా సంస్కరణల కోసం ఏర్పాటు చేసిన తొలి విద్యా కమిషన్ ఛైర్మనే ఇలా అర్ధాంతరంగా తప్పుకోవడంతో, రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వ విద్యా విధానాలు, నూతన విద్యా చట్టాల రూపకల్పన ఏ మలుపు తిరుగుతుందనేది ఆసక్తికరంగా మారింది.ఇంకా నాలుగు నెలల పదవీ కాలం మిగిలి ఉండగానే ఆయన ఈ పదవి నుంచి తప్పుకోవడం గమనార్హం. ఈ సందర్భంగా తనకు అవకాశం కల్పించిన తెలంగాణ ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలుపుతూ.. తన రాజీనామా విషయమై సీఎం కార్యదర్శికి కూడా ముందస్తు సమాచారం పంపారు. ఆకునూరి మురళి నేతృత్వంలోని విద్యా కమిషన్ ఇటీవల ప్రభుత్వానికి సమర్పించిన కొన్ని సిఫార్సులు తీవ్ర వివాదానికి దారితీశాయి. ముఖ్యంగా రాష్ట్రంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది వేతనాలు మార్కెట్ ప్రమాణాల కంటే చాలా ఎక్కువగా ఉన్నాయని, వాటిని సమీక్షించి 'హేతుబద్ధీకరించాలని' కమిషన్ చేసిన వ్యాఖ్యలపై ఉపాధ్యాయ సంఘాలు భగ్గుమన్నాయి. దీనికి తోడు ఇంటర్మీడియట్ బోర్డును రద్దు చేసి, ఇంటర్ విద్యను కూడా పాఠశాల విద్యలోనే విలీనం చేయాలనే ఆలోచనలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ సిఫార్సులపై ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలతో పాటు ఉపాధ్యాయ సంఘాలు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టాయి. ఏసీ రూమ్‌లలో కూర్చుని క్షేత్రస్థాయి పరిస్థితులు తెలియకుండా ఇలాంటి నివేదికలు ఇచ్చారంటూ ప్రతిపక్ష నేతలు కమిషన్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వ బడులను కార్పొరేట్ స్థాయికి ధీటుగా మార్చాలనే పట్టుదలతో ఉండే ఆకునూరి మురళి.. గతంలో ఏపీ విద్యాశాఖలోనూ కీలక బాధ్యతలు నిర్వహించారు. అయితే తెలంగాణ విద్యా కమిషన్ సిఫార్సుల చుట్టూ ముసిరిన రాజకీయ జగడం, ఉపాధ్యాయ లోకం నుంచి వచ్చిన తీవ్ర వ్యతిరేకత, అంతర్గత ఒత్తిళ్ల వల్లే ఆయన ఈ పదవి నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

# 6న మలేషియాలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

**ముఖ్య అతిథిగా హాజరు కానున్న కెటిఆర్: బ్రోచర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి**




**హైదరాబాద్, మే 22:** మలేషియా తెలంగాణ అసోసియేషన్, బీఆర్ఎస్ మలేషియా సంయుక్త ఆధ్వర్యంలో జూన్ 6 న కౌలాలంపూర్‌లో జరిగే తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే టీ రామారావు పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమ బ్రోచర్‌ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే జి .జగదీశ్ రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా కేసీఆర్ పేరును గుర్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ లేని లోటు రెండున్నర ఏండ్లుగా కనిపిస్తుందని వెల్లడించారు.కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయలేక పోతుందని, కేసీఆర్ ఇచ్చిన పథకాలనూ ఇవ్వలేక పోతుందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీని నమ్మి మోసపోయామని తెలంగాణ ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. అమెరికా దేశ చరిత్రలోనే కనివిని ఎరుగని రీతిలో గతంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు డల్లాస్‌లో జరిగాయని వివరించారు. దేశంలో బీజేపీ పాలనలో చిన్న పిల్లలకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న పిల్లలపై అఘాయిత్యాలు చేస్తున్న నిందితులను పట్టుకునే శక్తి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని ఆరోపించారు. ఖరీఫ్ సీజన్ త్వరలో ప్రారంభమవుతుందని, రైతులకు విత్తనాలు ,ఎరువులు ఇచ్చే పరిస్థితిలో ప్రభుత్వం లేదని అన్నారు. రేవంత్ రెడ్డి పాత గురువు, చీకటి గురువు చెప్పినట్లు రైతులను వ్యవసాయానికి దూరం చేస్తున్నారని మండిపడ్డారు. రైతాంగాన్ని ముంచి వ్యవసాయ సబ్సిడీలు దోచుకోవాలనే ఆలోచన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదని అన్నారు.ప్రపంచ వ్యాప్తంగా ఏం జరిగిన ట్వీట్ చేసే రాహుల్ గాంధీ తెలంగాణలో మైనర్ బాలిక ఘటన పై ఎందుకు ట్వీట్ చేయ లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీనే తెలంగాణ ప్రజలకు , మహిళలకు శ్రీరామ రక్ష అని అన్నారు .ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లు, బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సెల్ ప్రెసిడెంట్ మహేష్ బిగాల, మైటా ప్రెసిడెంట్ తిరుపతి,ఉమెన్స్ వింగ్ సుప్రియ, బీఆర్ఎస్ మలేసియా ప్రెసిడెంట్ చిట్టీ బాబు, శివ, రాష్ట్ర నాయకులు నరసింహ రెడ్డి, నంద్యాల దయాకర్ రెడ్డి, ధర్మేందర్ రెడ్డి, పడాల సతీష్, రవి యాదవ్ పాల్గొన్నారు.

# నేడు యాదగిరిగుట్టకు సీఎం రేవంత్

**వేద పాఠశాలకు భూమిపూజ**

**హైదరాబాద్, మే 22 :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం యాదగిరిగుట్టలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. వేద పాఠశాలకు భూమిపూజ, లక్ష్మీనరసింహస్వామి దర్శనం చేసుకోనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన షెడ్యూల్ విడుదలైంది. శనివారం ఉదయం 9 గంటలకు హైదరాబాద్ బేగంపేట నుంచి హెలికాప్టర్‌లో యాదగిరిగుట్టకు సీఎం రేవంత్ రెడ్డి బయలుదేరుతారు. అనంతరం 9:15 గంటలకు ప్రతిపాదిత వేద పాఠశాల స్థలానికి చేరుకుంటారు. 9:15 నుంచి 9:45 మధ్య వేద పాఠశాలకు భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం రేవంత్ పాల్గొంటారు. సరిగ్గా ఉదయం 9:37 గంటలకు ఎస్ఎల్ఎన్ఎస్డీ వేద పాఠశాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. 9:50కు వేద పాఠశాల స్థలం నుంచి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి బయలుదేరుతారు రేవంత్ రెడ్డి. 10 గంటలకు దేవాలయానికి చేరుకుంటారు. 10 నుంచి 10:30 వరకూ స్వామివారిని దర్శించుకుంటారు. 10:30కు ప్రెసిడెన్షియల్ సూట్‌కు బయలుదేరి 10:40కి అక్కడికి చేరుకుంటారు. దయం 10:40 నుంచి 11 గంటల వరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విశ్రాంతి తీసుకుంటారు. 11 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 11:10కి హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అనంతరం 11:15కు యాదగిరిగుట్ట నుంచి హైదరాబాద్‌కు తిరుగు పయనమవుతారు.

# ఫ్యూచర్ సిటీపై హరీష్‌రావు వ్యాఖ్యలు సరికాదు

**జర్నలిస్టులకు ఇళ్ళస్థలాల కేటాయింపును అడ్డుకుంటారా?**

**టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య**

**హైదరాబాద్, మే 22:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టబోతున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై మాజీ మంత్రి, బీఆర్ ఎస్ నేత హరీష్ రావు చేసిన వ్యాఖ్యలు సహేతుకమైనది కాదని, అభివృద్ధి విషయంలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య పేర్కొన్నారు. రాబోయే ప్రభుత్వం బీఆర్ ఎస్ అనీ, తాము అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని మాజీ మంత్రి హరీష్ రావు అనడం పట్ల ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, హరీష్ రావు వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు కేటాయించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రయత్నాన్ని తాము స్వాగతిస్తున్నామని, అయితే ఈ ప్రయత్నాన్ని అడ్డుకోవడం కోసమే హరీష్ రావు కుట్రపూరిత వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్టులకు గత పదేళ్ళలో టీఆర్ ఎస్, బీఆర్ ఎస్ ప్రభుత్వం చేయలేని పని కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్నారని మామిడి సోమయ్య అన్నారు. జర్నలిస్టులకు,సివిల్ సర్వీసెస్ అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫ్యూచర్ సిటీలో 500 ఎకరాల భూమి కేటాయిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించిన ప్రస్తుత సమయంలో మాజీ మంత్రి హరీష్ రావు ఈ విధమైన వ్యాఖ్యలు చేయడం పాత్రికేయుల్లో ఆవేదన,ఆందోళన వ్యక్తమవుతుందని ఆయన పేర్కొన్నారు. తమ రాజకీయ కక్షలు, స్వార్థ ప్రయోజనాల కోసం ప్రతిపక్ష నేతలు ప్రజల అభివృద్ధిని, సంక్షేమ కార్యక్రమాలను అడ్డుకోవడం సరైంది కాదని, జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు కేటాయించబోయే ఫ్యూచర్ సిటీకి అడ్డుపడడం బీఆర్ ఎస్ పార్టీ చేయబోయే పెద్ద తప్పిదమని అన్నారు. తొమ్మిదిన్నరేళ్ళు అధికారంలో ఉండి జర్నలిస్టులకు ఏమీ చేయని ప్రతిపక్ష బీఆర్ ఎస్ నాయకులు జర్నలిస్టుల సంక్షేమానికి అడ్డురావడం సరైంది కాదని అన్నారు.



# వ్యవసాయం ఈజీ.. ధాన్యం అమ్మడం కష్టం

## కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతల ఆవేదన

### లారీలు, గన్నీ సంచుల కొరతతో నిలిచిపోతున్న ధాన్యం

### అకాల వర్షాలతో రైతుల గుండెల్లో గుబులు

### పాలకుల నిర్లక్ష్యంపై పెరుగుతున్న ఆగ్రహం

**తెలుగు రాష్ట్రాల్లో మరోసారి రైతాంగం కష్టకాలాన్ని ఎదుర్కొంటోంది. పంట పండించడం వరకే రైతు బాధ్యత అన్నట్టుగా ప్రభుత్వాల వ్యవహారం కనిపిస్తోంది. ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని అమ్ముకునే దశలో రైతులు పడుతున్న ఇబ్బందులు చూస్తే వ్యవసాయం నిజంగా ఈజీనా..? లేక ధాన్యం అమ్ముకోవడమే పెద్ద యుద్ధమా..? అనే ప్రశ్న తలెత్తుతోంది. కొనుగోలు కేంద్రాల్లో రైతుల దుస్థితి రోజురోజుకీ దారుణంగా మారుతోంది. టీవీల్లో రైతుల గోసలు కనిపిస్తున్నా, పత్రికల్లో కథనాలు వెలువడుతున్నా పాలకుల్లో మాత్రం చలనం కనిపించడం లేదు.**

రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం రాశులు పేరుకుపోతున్నాయి. కాంటా వేయడానికి రోజులు పడుతోంది. కాంటా వేసిన ధాన్యం కూడా లారీల్లో ఎక్కడం లేదు. దీంతో రైతులే తమ ధాన్యానికి కాపలాదారులుగా మారుతున్నారు. రాత్రింబవళ్లు కేంద్రాల వద్దే మగ్గాల్సి వస్తోంది. వర్షాకాలం దగ్గరపడటంతో రైతుల ఆందోళన మరింత పెరిగింది. అకాల వర్షాలతో ఇప్పటికే పలుచోట్ల ధాన్యం తడిసి నష్టపోయింది. ఇంకా కేంద్రాల వద్ద పేరుకుపోయిన వడ్లు ఎప్పుడు తడుస్తాయోనన్న భయం రైతులను వెంటాడుతోంది.

ధాన్యం కొనుగోలు వ్యవస్థలో ప్రణాళికా లోపాలు బహిర్గతమవుతున్నాయి. లారీలు లేవు, గన్నీ సంచులు లేవు, హమాలీలు అందుబాటులో లేరు అనే కారణాలతో కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేక రైతులు ఎండలో, వానలో అవస్థలు పడుతున్నారు. ఉదయం రోడ్డుపై ధాన్యం ఆరబెట్టి, సాయంత్రం టార్పాలిన్లు కప్పి కాపలా కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పంటను పండించిన రైతు చివరికి రోడ్డు మీదే జీవించాల్సిన పరిస్థితి రావడం విచారకరం.

తాలు, తడిసిందన్న పేర్లతో కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. రైస్ మిల్లర్లు నాలుగైదు కిలోల వరకు తరుగు పేరిట కోతలు పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. మరోవైపు లారీ యజమానులు సంచికి అదనపు డబ్బులు వసూలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పీఏసీఎస్ కేంద్రాల్లో కూడా అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతు కష్టానికి సరైన గౌరవం దక్కాల్సిన చోట దోపిడీకి గురవుతున్న పరిస్థితి కనిపిస్తోంది.

ఈ సమస్య కొత్తది కాదు. ఎవరు అధికారంలో ఉన్నా రైతుల బాధలు మాత్రం మారడం లేదు. గత ప్రభుత్వాల హయాంలోనూ ఇలాంటి దృశ్యాలే కనిపించాయి. అప్పట్లో రైతుల పక్షాన మాట్లాడిన నాయకులు ఇప్పుడు అధికారంలో ఉన్నా పరిస్థితి ఎందుకు మారలేదన్న ప్రశ్న తలెత్తుతోంది. ప్రతిపక్షాలు కూడా కేవలం విమర్శలకే పరిమితమవుతున్నాయి తప్ప రైతుల సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో పోరాడుతున్న దాఖలాలు కనిపించడం లేదు. రైతు దేశానికి వెన్నెముక అని ప్రతి సభలో చెప్పే నాయకులు, అదే రైతు కొనుగోలు కేంద్రాల వద్ద పడుతున్న కష్టాలను ఎందుకు చూడటం లేదు? పంట పండించే వరకు రైతు అవసరం.. ఆ తర్వాత అతని బాధలు ఎవరికీ పట్టవా? అనే ఆవేదన అన్నదాతల్లో వ్యక్తమవుతోంది. రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నా అధికార యంత్రాంగం స్పందన మాత్రం నిర్లక్ష్యంగానే కనిపిస్తోంది. ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం ఉన్నతస్థాయి సమీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఫలితం కనిపించడం లేదు. జిల్లా కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు ప్రత్యక్షంగా కేంద్రాలను సందర్శించి సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉంది. తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి. లారీలు, గన్నీ సంచులు, హమాలీల కొరతను వెంటనే నివారించాలి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రెండు రోజుల్లోనే తరలించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

**రైతు కష్టానికి విలువ ఇవ్వని వ్యవస్థ ఎప్పటికీ బలంగా నిలవదు. పంట పండించే రైతు నిలబడితేనే దేశ ఆర్థిక వ్యవస్థ నిలబడుతుంది. రైతును ఓటు బ్యాంకుగా కాకుండా దేశ భవిష్యత్తుగా చూడాల్సిన సమయం ఇది. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి రైతుల కష్టాలకు ముగింపు పలకాలి.**

# రిజర్వేషన్ల ఫలాలు అందరికీ అందేదెప్పుడు?

- ఒకే కుటుంబం పదేపదే కోటా అనుభవిస్తే ఎలా?
- ఐఏఎస్ పిల్లలకూ రిజర్వేషన్లు అవసరమా?
- క్రీమీలేయర్ మినహాయింపులపై సుప్రీంకోర్టు
- కేంద్ర ప్రభుత్వానికి న్యాయస్థానం నోటీసులు




**న్యూఢిల్లీ, మే 22:** రిజర్వేషన్ల వ్యవస్థపై సుప్రీంకోర్టు చేసిన తాజా వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. రిజర్వేషన్ల ఫలాలు పదేపదే ఒకే కుటుంబాలకు పరిమితం కావడం వల్ల నిజంగా వెనుకబడిన వర్గాలకు అవకాశాలు అందకుండా పోతున్నాయని అత్యున్నత న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది. సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా ఇప్పటికే ఉన్నత స్థాయికి చేరుకున్న కుటుంబాలు కూడా తరతరాలుగా అదే రిజర్వేషన్ కోటాను వినియోగించుకోవడాన్ని ధర్మాసనం తీవ్రంగా ప్రశ్నించింది. వెనుకబడిన వర్గాల్లోని 'క్రీమీ లేయర్' పరిమితులు, రిజర్వేషన్ మినహాయింపులపై దాఖలైన పిటిషన్లను విచారిస్తున్న సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ నాగరత్న మాట్లాడుతూ.. "రిజర్వేషన్ల ద్వారా ఒక కుటుంబం ఇప్పటికే ఉన్నత స్థాయికి చేరుకున్నాక కూడా, వారి పిల్లలకు మళ్లీ అదే కోటా ఎందుకు అవసరం?" అని ప్రశ్నించారు. "తల్లిదండ్రులు ఇద్దరూ ఐఏఎస్ అధికారులు అయి, ప్రభుత్వ అత్యున్నత సేవల్లో స్థిరపడి ఉన్నప్పుడు, వారి పిల్లలను కూడా వెనుకబడిన వర్గంగా ఎలా పరిగణించాలి?" అని ధర్మాసనం ప్రశ్నించింది. ఒకే కుటుంబం తరతరాలుగా రిజర్వేషన్ల ప్రయోజనాలను అనుభవిస్తే, అదే వర్గంలోని అత్యంత పేద, అణగారిన వర్గాలకు అన్యాయం జరుగుతుందని కోర్టు అభిప్రాయపడింది. రిజర్వేషన్ల అసలు ఉద్దేశం సమాజంలో వెనుకబడిన వర్గాలకు అవకాశాలు కల్పించడమే గానీ, కొందరు కుటుంబాలకు శాశ్వత హక్కుగా మారడం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. "ఇలా కొనసాగితే దేశం ఎప్పటికీ రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి బయటపడలేదు" అని వ్యాఖ్యానించడం ప్రాధాన్యత సంతరించుకుంది. దేశంలో ప్రస్తుతం ఓబీసీలకు అమలవుతున్న 'క్రీమీ లేయర్' నిబంధనలను మరింత కఠినంగా, శాస్త్రీయంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని ధర్మాసనం సూచించింది. ప్రస్తుతం వార్షిక ఆదాయం రూ.8 లక్షలు దాటిన కుటుంబాలు, అలాగే ఐఏఎస్, ఐపీఎస్, ఉన్నత సైనికాధికారులు, రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారి పిల్లలను క్రీమీ లేయర్ కింద పరిగణిస్తూ రిజర్వేషన్ల నుంచి మినహాయిస్తున్నారు. అయితే ఈ నిబంధనలను సవాల్ చేస్తూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి, ఇతర సంబంధిత వర్గాలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను వాయిదా వేసింది. ఇప్పటికే మాజీ సీజేఐ బీఆర్ గవాయ్ కూడా ఇలాంటి అభిప్రాయాలనే వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల ప్రయోజనాలు నిజంగా అట్టడుగు వర్గాలకు చేరుతున్నాయా? లేక ఒకే వర్గంలోని కొందరికే పరిమితమవుతున్నాయా? అన్న అంశంపై దేశవ్యాప్తంగా మళ్లీ చర్చ మొదలైంది. రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు చేసిన ఈ వ్యాఖ్యలు భవిష్యత్తులో విధానపరమైన మార్పులకు దారితీసే అవకాశముందని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# నీట్ పేపర్ లీకేజీలో దర్యాప్తు ముమ్మరం

## లాతూర్‌కు చెందిన డాక్టర్ అరెస్ట్

**ముంబయి, మే 22:** లీకైన నీట్ గెస్ పేపర్‌ను కొనుగోలు చేసిన ఒక డాక్టర్‌ను సీబీఐ అదుపులోకి తీసుకున్నది. ఆయన ఆసుపత్రిలో ప్రత్యేక క్లాసులు నిర్వహించి నీట్ గెస్ పేపర్ లీక్ చేయడంపై ప్రశ్నిస్తున్నది. మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన పీడియాట్రిషియన్ డాక్టర్ మనోజ్ శిరూరేకు ఇప్పటికే అరెస్టయిన ఎన్టీఏ కమిటీలో సభ్యుడైన పూణెలికు చెందిన ప్రొఫెసర్ పీవీ కులకర్ణి, ఆర్‌సీసీ క్లాసెస్ డైరెక్టర్ శివరాజ్ మోటెగావ్‌కర్‌తో పరిచయం ఉన్నది. ఈ నేపథ్యంలో తన మేనల్లుడు, మేనకోడలు కోసం నీట్ గెస్ పేపర్‌ను ఆయన కొనుగోలు చేసినట్లు సీబీఐ దర్యాప్తులో తేలింది. దీంతో గురువారం లాతూర్‌లో డాక్టర్ మనోజ్‌ను సీబీఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. పూణెలిలోని తమ కార్యాలయానికి తరలించి ప్రశ్నిస్తున్నారు. ఆ తర్వాత ఢిల్లీకి తీసుకెళ్లి ఆయన అరెస్ట్‌ను ప్రకటించనున్నారు. కాగా, నీట్ పరీక్షకు కొన్ని రోజుల ముందు డాక్టర్ మనోజ్‌కు చెందిన లాతూర్‌లోని ఆసుపత్రిలో పీవీ కులకర్ణి ప్రత్యేక తరగతులు నిర్వహించినట్లు సీబీఐ తెలిపింది. ఆర్‌సీసీ క్లాసెస్ డైరెక్టర్ శివరాజ్ కుమారుడు కూడా ఈ క్లాస్‌లకు హాజరైనట్లు పేర్కొంది. ఈ ఆసుపత్రిలోనే నీట్ గెస్ పేర్ లీకైనట్లు సీబీఐ నిర్ధారించింది. ఈ నేపథ్యంలో శివరాజ్ కుమారుడు, డాక్టర్ మనోజ్ మేనకోడలు, మేనల్లుడిని కూడా సీబీఐ అధికారులు విడివిడిగా ప్రశ్నించారు. మరోవైపు నీట్ పరీక్షకు ముందు కుమార్తె కోసం లీకైన ప్రశ్నాపత్రాన్ని రూ. 5 లక్షలకు కొనుగోలు చేసినట్లు భావురావు కదమ్‌పై ఆరోపణలు



వచ్చాయి. ఈ నేపథ్యంలో నాందేడ్‌లోని ఆ నివాసంపై సీబీఐ రైడ్ చేసింది. సుమారు ఎనిమిది గంటల పాటు జరిగిన సోదాల్లో కీలక పత్రాలను సీబీఐ అధికారులు పరిశీలించారు. భావురావు కుటుంబ సభ్యులను కూడా ప్రశ్నించారు. తదుపరి విచారణ కోసం పుణెలోని తమ కార్యాలయానికి రావాలని భావురావు, ఆయన కుటుంబ సభ్యులను సీబీఐ ఆదేశించింది. అయితే మే 3న నీట్ ఎగ్జామ్‌ను నిర్వహించగా పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో మే 12న ఆ పరీక్షను ఎన్టీఏ రద్దు చేసింది. ఈ నేపథ్యంలో నీట్ పేపర్ లీక్‌లో పూణె, లాతూర్, నాందేడ్ వ్యక్తుల మధ్య సంబంధాలను సీబీఐ పరిశీలిస్తున్నది. నీట్ లీక్ పేపర్‌ను ఎంత మంది తల్లిదండ్రులు , ఎంతెంతకు కొనుగోలు చేశారు అన్నది దర్యాప్తు చేస్తున్నది.

# ఎవరెస్ట్‌పై విషాదం

## కిందకు వస్తుండగా ఇద్దరు భారతీయుల మృతి

**న్యూఢిల్లీ:** ఎవరెస్ట్ పర్వత శిఖరంపై విషాదం చోటుసేసుకుంది. పర్వతారోహణ ముగించుకుని కిందకు దిగివస్తుండగా ఇద్దరు భారతీయులు ప్రాణాలు కోల్పోయినట్టు నేపాల్ అధికారులు ప్రకటించారు. మృతులను అరుణ్‌కుమార్ తివారీ, సందీప్ అరేగా గుర్తించారు. ఎవరెస్ట్ శిఖరం దిగుతుండగా సందీప్ అరే తీవ్రంగా అలసిపోయారని, ఆయనను కాపాడేందుకు గైడ్స్ ప్రయత్నించినప్పటికీ ప్రాణాలను కాపాడలేకపోయారని ఎక్స్‌పెడిషన్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ నేపాల్ సెక్రటరీ జనరల్ రిషి భండారి తెలిపారు. గురువారం సాయంత్రం 5.30 గంటల సమయంలోనే మరో పర్వతారోకుడు అరుణ్ తివారీ కూడా ఎవరెస్ట్ నుంచి కిందకు దిగుతూ హిల్లరీ స్టెప్ వద్ద తీవ్రంగా అలసిపోవడంతో నలుగురు గైడ్స్ ఆయనకు సాయం చేసినప్పటికీ ఫలితం లేకపోయిందని చెప్పారు. క్యాంప్-2 వద్ద ఆయన కన్నుమూసినట్టు వివరించారు. ఎవరెస్ట్ శిఖరాన్ని గత బుధవారంనాడు విజయవంతంగా 274 మంది అధిరోహించారు. ఒకోరోజు అత్యధిక సంఖ్యలో ఎవరెస్ట్ అధిరోహించిన బృందంగా కూడా వీరు రికార్డు నెలకొల్పారు. ఇందులో సందీప్ అరే కూడా అన్నారు. అయితే పర్వతం నుంచి కిందకు దిగుతుండగా సందీప్ అరే మృతిచెందగా, గురవారంనాడు మరో బృందం ఎవరెస్ట్ శిఖరం చేరుకుంది. అందులో అరుణ్ తివారీ ఉన్నారు. పర్వతం దిగివస్తుండగా ఆయన మృతి చెందారు.

# సీజేపీ అధికారిక ఎక్స్ ఖాతా నిలిపివేత

## కాక్రోచ్ జనతా పార్టీ విదేశీ శక్తుల కుట్ర? : దర్యాప్తు చేస్తున్న ఇంటెలిజెన్స్ వర్గాలు




**ఢిల్లీ:** సోషల్ మీడియాను షేక్ చేస్తున్న 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) విదేశీ శక్తుల కుట్రంటూ భారత భద్రతా సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దేశంలో నిరుద్యోగ యువత అసంతృప్తిని ఆసరాగా చేసుకుని అశాంతిని సృష్టించేందుకు వ్యూహం పన్నారనే కోణంలో ఇంటెలిజెన్స్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. సోషల్ మీడియాలో అతి తక్కువ సమయంలో మిలియన్ల కొద్దీ ఫాలోవర్స్ రావడంపైనా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీని వెనుక విదేశీ శక్తుల ప్రమేయం ఉందేమోనని భావిస్తూ ఆరా తీస్తున్నారు. న్యాయవ్యవస్థపై ఆర్టీఐ యాక్టివిస్టుల తీరును తప్పుబడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. వారిని బొద్దింకలతో పోల్చుతూ సీజేఐ ఘాటుగా స్పందించారు. సీజేఐ సూర్యకాంత్ తీరుకు నిరసనగా సోషల్ మీడియాలో కాక్రోచ్ జనతా పార్టీ పేరుతో వ్యంగ్యాత్మక ఉద్యమం పుట్టుకొచ్చింది. కేవలం 5 రోజుల్లోనే సీజేపీ ఇన్‌స్టాగ్రామ్ పేజీని 1.5 కోట్ల ఫాలోవర్సు దాటేశారు. అధికార బీజేపీ ఫాలోయింగ్‌నీ సీజేపీ దాటేయడం చర్చనీయాంశమైంది. నిరుద్యోగం, నీట్ పేపర్ లీకేజీలు, ఆర్థిక ఇబ్బందులపై జెన్-జీ యువత డిజిటల్ ప్లాట్ ఫామ్స్ వేదికగా ఉద్యమానికి దిగారు. అయితే, ఒకే తరహా హ్యాష్‌ట్యాగ్‌లు, ఏఐ సాంగ్స్, సింక్రనైజ్డ్ పోస్టుల వెనుక డీప్ స్టేట్ ఐటీ సెల్స్ హస్తం ఉందని ఇంటెలిజెన్స్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ మేరకు భద్రతా కారణాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో భారతదేశంలో సీజేపీ అధికారిక ఎక్స్ ఖాతాను నిలిపివేశారు. అయితే, యువత వ్యంగ్య నిరసనను అణచివేయడానికి మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. అందుకే 'దేశ వ్యతిరేక' ముద్ర వేస్తూ అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని ప్రతిపక్ష నేతలు, విమర్శకులు మండిపడుతున్నారు.

# కేంద్రానికి ఆర్‌బీఐ శుభవార్త

## రూ.2.87 లక్షల కోట్లు డివిడెండ్ ప్రకటన

**ముంబయి, మే 22:** కేంద్ర ప్రభుత్వానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గుడ్‌న్యూస్ చెప్పింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.2.87 లక్షల కోట్లు డివిడెండ్ రూపంలో చెల్లించనున్నట్లు శుక్రవారం ప్రకటించింది. ఆర్‌బీఐ ఏటా మిగులు నిధులను కేంద్ర ప్రభుత్వానికి డివిడెండ్ రూపంలో చెల్లిస్తుంది. ప్రస్తుత భౌగోళిక రాజకీయ అనిశ్చిత పరిస్థితుల్లో ప్రభుత్వానికి ఈ మొత్తం ఊరట కల్పించే అంశం. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డు డైరెక్టర్లు నిర్వహించిన 623వ సమావేశంలో డివిడెండ్ చెల్లింపులపై నిర్ణయం తీసుకున్నారు. ఈ స్థాయిలో డివిడెండ్ చెల్లించడం ఇదే తొలిసారి. దేశీయ, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, భయాందోళనల ముప్పును సమీక్షించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్‌బీఐ ఓ ప్రకటనలో పేర్కొంది. దేశ, విదేశీ సెక్యూరిటీలపై వడ్డీ, సేవలపై రుసుములు, కమిషన్లు, విదేశీ మారకపు ద్రవ్యం లావాదేవీలపై లాభం, అనుబంధ సంస్థల నుంచి ప్రతిఫలం రూపేణ ఆర్‌బీఐకు ఆదాయం లభిస్తుంది. కరెన్సీ నోట్ల ముద్రణ, డిపాజిట్లు-రుణాలపై వడ్డీల చెల్లింపులు, సిబ్బంది జీతభత్యాలు-పింఛన్లు, కార్యాలయాల నిర్వహణ ఖర్చులు, ఆకస్మిక పరిస్థితులు- తరుగుదలకు కేటాయింపులు వంటి వ్యయాలు ఉంటాయి. ఈ ఆదాయ, వ్యయాల మధ్య తేడానే మిగులు నిధులుగా వ్యవహరిస్తారు. ఈ మిగులు నిధులను కేంద్రానికి ఏటా బదిలీ చేస్తుంది. ఆర్‌బీఐ, ప్రభుత్వ రంగ బ్యాంకుల డివిడెండ్ల రూపంలో ఖజానాకు రూ.3.16 లక్షల కోట్లు సమకూరుతాయని బడ్జెట్‌లో ప్రభుత్వం అంచనా వేసింది.





# డీలిమిటేషన్‌పై షర్మిల విమర్శలు

**దక్షిణాది ప్రాతినిధ్యం తగ్గకూడదని కాంగ్రెస్ డిమాండ్**

**నారా లోకేష్ వ్యాఖ్యలపై వైఎస్ షర్మిల స్పందన**

**సమాఖ్య సమతౌల్యాన్ని కాపాడాలని పిలుపు**

**అమరావతి, మే 22 :** లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై టీడీపీ నేత, మంత్రి నారా లోకేష్ లేనిపోని గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు చేశారు. జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసి మెరుగైన మానవాభివృద్ధి సూచికలు సాధించిన దక్షిణాది రాష్ట్రాలను రాజకీయంగా శిక్షించకూడదన్నదే కాంగ్రెస్ పార్టీ వైఖరి అని ఆమె స్పష్టం చేశారు. ఈ అంశంపై విడుదల చేసిన ప్రకటనలో షర్మిల మాట్లాడుతూ కేవలం లోక్‌సభ స్థానాల సంఖ్య పెంచడం ద్వారా దక్షిణాది రాష్ట్రాలకు రక్షణ లభించదన్నారు. పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల సాపేక్ష ప్రాతినిధ్యం, రాజకీయ ప్రభావం తగ్గకుండా చూడటమే అసలైన సవాల్ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత పి చిదంబరం ట్వీట్‌కు ప్రతిస్పందిస్తూ నారా లోకేష్ చేసిన వ్యాఖ్యలపై ఆమె స్పందించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 81 ప్రకారం 2026 తర్వాత జరిగే జనాభా గణన అనంతరం డీలిమిటేషన్ ప్రక్రియ తప్పనిసరిగా జరుగుతుందని షర్మిల తెలిపారు. ఆ పరిస్థితిలో అధిక జనాభా కలిగిన ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్య బలం తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దక్షిణాది రాష్ట్రాల గొంతుకను తగ్గించే ఎలాంటి పునర్విభజన ప్రక్రియనైనా కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ వ్యతిరేకిస్తోందన్నారు. కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఈ సమస్యకు సరైన ప్రత్యామ్నాయాలను అన్వేషించడంలో విఫలమైందని షర్మిల ఆరోపించారు. స్థానిక సంస్థలను బలోపేతం చేయడం, రాష్ట్రాలకు అధిక ఆర్థిక, పరిపాలనా అధికారాలు ఇవ్వడం, వికేంద్రీకరణను ప్రోత్సహించడం వంటి సూచనలను కేంద్రం పట్టించుకోలేదన్నారు. కేవలం లోక్‌సభ సీట్ల సంఖ్య పెంపునే పరిష్కారంగా చూపించడం సరైంది కాదని పేర్కొన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వ హయాంలో పార్లమెంటు సమావేశాల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని షర్మిల విమర్శించారు. ఇప్పటికే జాతీయ చర్చల్లో దక్షిణాది రాష్ట్రాల వాణిని అణచివేస్తున్నారని ఆరోపించారు. సమాఖ్య సమతౌల్యాన్ని, పార్లమెంటరీ పనితీరును కాపాడకుండా సభను విస్తరిస్తే ప్రజాస్వామ్య చర్చలు మరింత బలహీనపడతాయని వ్యాఖ్యానించారు. మరోవైపు నారా లోకేష్ మాట్లాడుతూ ఆర్టికల్ 81 ప్రకారం 2026 తర్వాత డీలిమిటేషన్ తప్పనిసరిగా జరుగుతుందని గుర్తు చేశారు. దక్షిణాది రాష్ట్రాలు పార్లమెంటులో ప్రాతినిధ్యాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ అసమతుల్యతను సరిచేయడానికే అన్ని రాష్ట్రాలకు దామాషా ప్రకారం సీట్లు పెంచే ప్రతిపాదనను ఎన్డీయే ప్రభుత్వం తీసుకువచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఈ ప్రక్రియను ఎందుకు వ్యతిరేకించిందో సమాధానం చెప్పాలని లోకేష్ ప్రశ్నించారు.

# రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ విడుదల

**ఏపీలో నాలుగు స్థానాలకు ఎన్నికలు**

**జూన్ 1న నోటిఫికేషన్ జారీ**

**జూన్ 18న పోలింగ్, అదే రోజు ఫలితాలు**

**దేశవ్యాప్తంగా 24 స్థానాలకు ఎన్నికల ప్రక్రియ**

**పలువురు కీలక నేతల పదవీకాలం ముగింపు**

న్యూఢిల్లీ, మే 22: రాజ్యసభ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసింది. జూన్--జూలై నెలల్లో ఖాళీ కానున్న రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాల్లో మొత్తం 24 స్థానాలకు ఎన్నికల ప్రక్రియ చేపట్టనుంది. ఆంధ్రప్రదేశ్‌లో నలుగురు రాజ్యసభ సభ్యుల పదవీకాలం ముగియనుండటంతో ఆయా స్థానాల భర్తీకి షెడ్యూల్ విడుదలైంది. జూన్ 1న ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయనుండగా, జూన్ 18న పోలింగ్ నిర్వహించి అదే రోజు ఫలితాలు వెల్లడించనున్నట్లు ఎన్నికల కమిషన్ తెలిపింది. ఆంధ్రప్రదేశ్ నుంచి అయోధ్య రామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, పరిమల్ నత్వానీ, సాన సతీష్ బాబుల పదవీకాలం మ-ుగియనుంది. ఇక గుజరాత్ నుంచి నాలుగు, జార్ఖండ్ నుంచి రెండు, మధ్యప్రదేశ్ నుంచి మూడు, మణిపూర్ నుంచి ఒకటి, కర్ణాటక నుంచి నాలుగు స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. కర్ణాటక నుంచి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవగౌడ పదవీకాలం ముగియనుండగా, మధ్యప్రదేశ్ నుంచి దిగ్విజయ్ సింగ్ పదవీకాలం కూడా ముగియనుంది.



# అగ్నిగుండంలా ఏపీ

- ఎండలు, వడగాల్పులపై ఉన్నతస్థాయి సమీక్ష..
- చలివేంద్రాలు, మజ్జిగ, ఓఆర్ఎస్ పంపిణీకి ఆదేశం..
- తీవ్రతను బట్టి స్థానికంగా సెలవులు ప్రకటించాలని సూచన!
- గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి కొరత లేకుండా చూడాలని స్పష్టం
- ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్లకు దిశానిర్దేశం



**అమరావతి, మే 22:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వడగాల్పుల తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ క్రమంలో ఎండల తీవ్రతను తట్టుకునేందుకు చేపట్టాల్సిన ముందస్తు, సన్నద్ధత చర్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతిలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. హీట్‌వేవ్ పరిస్థితులను ఎదుర్కొనేందుకు తక్షణమే రంగంలోకి దిగాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు ఎండల నుండి ఉపశమనం కలిగించేలా అవసరమైన అన్ని ప్రాంతాల్లో టెంట్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఈ కేంద్రాల ద్వారా ప్రజలకు చల్లని తాగునీరు, మజ్జిగతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను నిరంతరం అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎండల తీవ్రత అత్యధికంగా ఉన్న ప్రాంతాల్లో అక్కడి క్షేత్రస్థాయి పరిస్థితులను బట్టి స్థానికంగా సెలవులు ప్రకటించే విషయాన్ని కూడా పరిశీలించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాల్సిన పూర్తి బాధ్యత అధికారులపైనే ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం జిల్లా కలెక్టర్లు తక్షణమే మీడియా సమావేశాలు నిర్వహించి ప్రజలను చైతన్యపరచాలని నిర్దేశించారు. వేసవి తీవ్రత దృష్ట్యా ఏ ఒక్కరికీ ఇబ్బంది కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. అమరావతిలో జరిగిన ఈ అత్యవసర సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు విపత్తు నిర్వహణ, వైద్యారోగ్య, పురపాలక, పంచాయితీరాజ్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొని క్షేత్రస్థాయి పరిస్థితులను ముఖ్యమంత్రికి వివరించారు.

# 8 జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ!

- 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- పలుచోట్ల తీవ్రమైన వడగాలుల హెచ్చరిక

**అమరావతి, మే22 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని భానుడు భయపెడుతున్నాడు. రాబోయే రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరగనుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నెల 26 వరకు కోస్తాంధ్ర ప్రాంతానికి ప్రచండ ఎండల ముప్పు పొంచి ఉందని, మరో ఐదు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా అతి తీవ్రమైన వడగాలులు వీస్తాయని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. ముఖ్యంగా దక్షిణ కోస్తా జిల్లాల్లో అత్యధిక వేడి వాతావరణం నెలకొంటుందని స్పష్టం చేసింది. బాపట్లలో ఈ సీజన్ సాధారణ ఉష్ణోగ్రత కంటే ఏకంగా 7.4 డిగ్రీలు అధికంగా నమోదు కావడం అక్కడి వాతావరణ తీవ్రతకు అద్దం పడుతోంది. ఎండలు, వడగాలుల తీవ్రత దృష్ట్యా వాతావరణ శాఖ జిల్లాల వారీగా హెచ్చరికలు జారీ చేసింది. తీవ్రమైన ఉష్ణోగ్రతలు నమోదవుతున్న దక్షిణ కోస్తాలోని 8 జిల్లాలకు అత్యంత ప్రమాదకరమైన 'రెడ్ అలర్ట్' (=వస ాశ్రీవతీ) ప్రకటించింది. మరో 6 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, మూడు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఉత్తరాంధ్రాలోని శ్రీకాకుళం, విజయనగరం మినహా రాష్ట్రంలోని మిగిలిన అన్ని జిల్లాలకు విపత్తుల నిర్వహణ సంస్థ , ఐఎండీ అప్రమత్తత హెచ్చరికలు జారీ చేశాయి. ప్రజలు అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం వేళల్లో బయటకు రావద్దని అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత ఎలా ఉ ందంటే.. దాదాపు అన్ని జిల్లాల్లోనూ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల మార్కును దాటేశాయి. కేవలం పగటి పూట మాత్రమే కాకుండా, రాత్రి వేళల్లో కూడా ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్నాయి. దీనివల్ల 'వార్మ్ నైట్స్' సంఖ్య పెరుగుతోందని, రాత్రి పూట కూడా వేడి గాలులు, ఉక్కపోతతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఈ ప్రచండ వేడి నుంచి ఉపశమనం పొందడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కువగా ద్రవపదార్థాలు తాగాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

# రూ.3 వేల కోట్ల సోలార్ ప్రాజెక్టు ప్రారంభం

**'మా బ్రాండ్ జాబ్ క్రియేషన్' అంటూ లోకేష్ వ్యాఖ్య**

**11 నెలల్లో 600 మెగావాట్ల ప్రాజెక్టు పూర్తి**

**గ్రీన్ ఎనర్జీలో ఏపీ దేశానికి మార్గదర్శి**




**కడప, మే 22:** ఒక ప్రాజెక్టు ప్రారంభమవ్వడం అంటే కేవలం రిబ్బన్ కటింగ్ కాదని, అది దార్శనికత, నమ్మకం, వేగం, కార్యనిర్వహణల కలయిక అని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గం కొండాపురం మండలం టి.కొండూరు గ్రామంలో రూ.3,000 కోట్లతో నిర్మించిన సుఖ్ బీర్ ఆగ్రో ఎనర్జీ లిమిటెడ్ 600 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టును ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడిన లోకేష్ పరోక్ష రాజకీయ విమర్శలు కూడా చేశారు. "మా నాన్న ఉత్తరం రాశారు, మా తాత కల కన్నారు, నేను ఆత్మలతో మాట్లాడాను అంటే ఇప్పుడు నమ్మేవాళ్లు లేరు బ్రదర్. మా బ్రాండ్ జాబ్ క్రియేషన్ అయితే... మీ బ్రాండ్ గొడ్డలి" అంటూ లోకేష్ విమర్శలు గుప్పించారు. రికార్డు సమయంలో ఎస్‌ఏఈఎల్ ప్రాజెక్టు పూర్తి కావడం స్థానిక రైతులు, జమ్మలమడుగు యువత విజయం అని ప్రశంసించారు. "మీ సహకారం వల్లనే ఈ భారీ ప్రాజెక్టు కేవలం 11 నెలల్లో పూర్తయింది. ఇప్పుడు రాష్ట్రం మొత్తం జమ్మలమడుగు వైపు చూస్తోంది" అని అన్నారు. జమ్మలమడుగులో ఇప్పటికే మెగా సోలార్ పార్క్, అదానీ, చింతా గ్రీన్, జెన్‌కో-ఎన్టీపీసీ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని లోకేష్ తెలిపారు. ఇప్పుడు ఎస్‌ఏఈఎల్ ప్రాజెక్టు కూడా చేరడంతో ఈ ప్రాంతం గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మారుతోందన్నారు. కంపెనీలు తీసుకురావడం, ఉద్యోగాలు కల్పించడం "బ్రాండ్ సీబీఎన్" వల్లే సాధ్యమైందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట నిలబెట్టుకునే నాయకత్వమే పెట్టుబడిదారులను ఆకర్షిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడుల ఆకర్షణకు మూడు ప్రధాన కారణాలు ఉన్నాయని లోకేష్ వివరించారు. మొదటిది "బ్రాండ్ సీబీఎన్", రెండవది "స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్", మూడవది కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ మద్దతుతో నడుస్తున్న "డబుల్ ఇంజిన్ సర్కార్" అని చెప్పారు. రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ, సాఫ్ట్‌వేర్, డ్రోన్లు, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో 22 ప్రత్యేక గ్రోత్ క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఎస్‌ఏఈఎల్ సంస్థతో తన తొలి పరిచయాన్ని కూడా లోకేష్ గుర్తుచేసుకున్నారు. ఢిల్లీలో జరిగిన సమావేశంలో సంస్థ ప్రతినిధులను కలిశానని, పునరుత్పాదక ఇంధన రంగంపై వారికున్న దృష్టి తనను ఆకట్టుకుందని చెప్పారు. పంజాబ్ కేంద్రంగా ఉన్న కంపెనీ ఏపీలో విజయవంతం అవుతుందా అనే సందేహం మొదట కలిగినా, స్థానిక రైతులు, గ్రామస్థులతో మమేకమై పని చేయడం చూసి ఆ సందేహం తొలగిపోయిందన్నారు. రూ.3,000 కోట్ల పెట్టుబడితో 2,400 ఎకరాల్లో రెండు 300 మెగావాట్ల ప్రాజెక్టులను కేవలం 11 నెలల్లో పూర్తి చేసి ఎస్‌ఏఈఎల్ రికార్డు సృష్టించిందని లోకేష్ తెలిపారు. పంజాబ్, రాజస్థాన్‌లో తయారైన 12 లక్షలకుపైగా అత్యాధునిక సోలార్ మాడ్యూళ్లను ఇందులో వినియోగించినట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఏటా సుమారు 11 లక్షల టన్నుల కార్బన్ ఉద్గారాలను తగ్గించవచ్చని అంచనా వేశారు. ఈ ప్రాజెక్టుతో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను 25 ఏళ్ల ఒప్పందం ప్రకారం సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా జాతీయ గ్రిడ్‌కు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. "ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు క్లీన్ ఎనర్జీని వినియోగించడమే కాదు, దేశానికి ఎగుమతి చేసే స్థాయికి ఎదుగుతోంది. భారత హరిత ఇంధన విప్లవానికి ఏపీ నాయకత్వం వహించేందుకు సిద్ధంగా ఉంది" అని స్పష్టం చేశారు. ప్రాజెక్టు నిర్మాణ సమయంలోనే వెయ్యిమందికి పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభించిందని, వీరిలో 80 శాతం మంది స్థానికులేనని లోకేష్ వెల్లడించారు. 760 మంది రైతులకు దీర్ఘకాలిక లీజు ఒప్పందాల ద్వారా ప్రయోజనం కలిగిందన్నారు. వ్యవసాయ వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్రాజెక్టులను కూడా ఎస్‌ఏఈఎల్ చేపడుతోందని, దీని వల్ల రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని తెలిపారు. "ఎస్‌ఏఈఎల్‌కు ఎలాంటి మద్దతు కావాలన్నా నేను ఒక వాట్సాప్ కాల్ దూరంలోనే ఉ ంటాను" అని భరోసా ఇచ్చారు.

# హరిత ఆంధ్రప్రదేశ్ కోసం 2.5 కోట్ల విత్తన బంతులు

**మహా యజ్ఞంలా సీడ్ బాల్స్ తయారీ, పంపిణీకి సన్నాహాలు**

**డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**

**అమరావతి, మే 22 :** ఆంధ్రప్రదేశ్‌ను మరింత పచ్చగా, పర్యావరణ అనుకూల రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీ హరిత సమరానికి శ్రీకారం చుట్టింది. ఉ ప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో అటవీ శాఖ రాష్ట్రవ్యాప్తంగా 2.5 కోట్ల విత్తన బంతుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టనుంది. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణం, జీవ వైవిధ్య పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత అందించడమే ఈ మహత్తర కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం ప్రకటించింది. జూన్ నెలలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున విత్తన బంతుల తయారీ కార్యక్రమాలు నిర్వహించేందుకు అటవీ శాఖ ముమ్మర సన్నాహాలు చేస్తోంది. ఈ కార్యక్రమాన్ని కేవలం ప్రభుత్వ పరిమితుల్లో కాకుండా ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ప్రజాప్రతినిధులు, మహిళా పొదుపు సంఘాలు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ కార్యకర్తలు, గ్రామీణ ప్రజలు సహా అన్ని వర్గాల ప్రజలను ఇందులో భాగస్వామ్యం చేయనున్నారు. వర్షాకాలాన్ని పూర్తిగా వినియోగించుకునేలా జులై, ఆగస్టు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా ఈ విత్తన బంతులను చల్లే కార్యక్రమం చేపట్టనున్నారు. అడవులు, కొండ ప్రాంతాలు, ఖాళీ భూములు, పర్యావరణ పరిరక్షణ అవసరమైన ప్రాంతాల్లో వీటిని విస్తృతంగా ఉ పయోగించనున్నారు. దీనివల్ల పచ్చదనం పెరగడంతో పాటు భూసార పరిరక్షణ, వర్షపాతం సమతుల్యత, జీవ వైవిధ్య అభివృద్ధికి తోడ్పాటు లభిస్తుందని అధికారులు చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో మూడు ప్రత్యేక పద్ధతులను వినియోగించనున్నారు. విత్తన బంతులను నేరుగా చల్లడం, అత్యాధునిక డ్రోన్ సాంకేతికత ద్వారా విస్తారంగా పంపిణీ చేయడం, చేతులతో నాటడం వంటి విధానాలు అమలు చేయనున్నారు. ముఖ్యంగా చేరుకోలేని అటవీ ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా విత్తన బంతులను చల్లే ఏర్పాట్లు చేస్తున్నారు. ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ పర్యావరణ పరిరక్షణలో కొత్త మార్గాలను అనుసరిస్తున్నట్లు అటవీ శాఖ వెల్లడించింది. జీవ వైవిధ్యాన్ని పెంపొందించడం, పర్యావరణ స్థిరత్వాన్ని కాపాడడం, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడం ఈ హరిత సమర ప్రధాన లక్ష్యాలుగా ప్రభుత్వం పేర్కొంది.



పెరుగుతున్న ఉ ష్ణోగ్రతలు, అటవీ క్షీణత, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు పెద్ద ఎత్తున మొక్కల పెంపకం అత్యవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజల సహకారంతో ఆంధ్రప్రదేశ్‌ను మరింత పచ్చగా మార్చేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ సందర్భంగా మంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, "మనం చల్లే ప్రతి విత్తన బంతి మన భవిష్యత్తుకు ఇచ్చే ఒక నమ్మకమైన హామీ. రాబోయే తరాల కోసం పచ్చని, ఆరోగ్యకరమైన, సుస్థిర ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి" అని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, చెట్ల పెంపకం ద్వారా భూమికి జీవం పోయాలని ఆయన అన్నారు.

# కిడ్నీ మార్పిడిలో నిమ్స్ అరుదైన రికార్డు

## ఒకే ప్రభుత్వ ఆసుపత్రిలో 2 వేల కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్లు పూర్తి

**హైదరాబాద్ మే22( సమయం న్యూస్). :** హైదరాబాద్: నిమ్స్ ఆసుపత్రి మరో అరుదైన మైలురాయిని చేరుకుంది. దేశంలో ఒకే ప్రభుత్వ ఆసుపత్రిలో 2 వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు పూర్తి చేసిన ఘనతను సాధించింది. 1989లో తొలి కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ నిర్వహించిన నిమ్స్, తాజాగా 2000వ కిడ్నీ మార్పిడిని విజయవంతంగా పూర్తి చేసినట్లు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప తెలిపారు. నిమ్స్ యూరాలజీ, నెఫ్రాలజీ విభాగాల వైద్యులు, సిబ్బంది సమన్వయంతో ఈ అరుదైన ఘనత సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న 2 వేల మంది రోగులకు నిమ్స్ కొత్త జీవితం ప్రసాదించిందన్నారు. వీరిలో దాదాపు 95 శాతం మంది ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఉచితంగా చికిత్స పొందినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ రాహుల్‌రాజ్ సహా వైద్య బృందాన్ని డాక్టర్ బీరప్ప అభినందించారు. క్లిష్టమైన కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు, చిన్నారుల్లో ట్రాన్స్‌ప్లాంట్లు, రీ-ట్రాన్స్‌ప్లాంట్లు విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. దక్షిణ భారతదేశంలో ప్రభుత్వ ఆసుపత్రిలో తొలి రోబోటిక్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ కూడా నిమ్స్‌లోనే జరగడం విశేషమన్నారు. నిమ్స్ సాధించిన ఈ ఘనతపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వైద్య బృందాన్ని అభినందించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ అత్యాధునిక వైద్యం అందించగల సామర్థ్యం తెలంగాణకు ఉందని నిమ్స్ మరోసారి నిరూపించిందన్నారు. పేదలకు ఉచితంగా ఖరీదైన అవయవ మార్పిడి సేవలు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గాంధీ ఆసుపత్రిలో ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్, సనత్‌నగర్ టిమ్స్‌లో ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ ఎక్సలెన్స్ సెంటర్, రాష్ట్రవ్యాప్తంగా ఆర్గాన్ రిట్రైవల్ సెంటర్ల ఏర్పాటు ద్వారా ప్రభుత్వ రంగంలో అవయవ మార్పిడి సేవలను మరింత విస్తరించనున్నట్లు మంత్రి తెలిపారు.

# డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో తెలంగాణ రోల్ మోడల్

■ పౌర సేవలు మరింత చేరువయ్యేలా సమగ్ర రోడ్‌మ్యాప్




**హైదరాబాద్ మే22( సమయం న్యూస్). :** డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో తెలంగాణను దేశానికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. శుక్రవారం నోవాటెల్ హెచ్ఐసీసీలో ఐసీఏఐ ఆధ్వర్యంలో నిర్వహించిన 'డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఫైనాన్స్ సమ్మిట్ 2026'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వ పౌర సేవలను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా ప్రజల ముంగిటకు చేర్చేందుకు ప్రత్యేక సమగ్ర రోడ్‌మ్యాప్ సిద్ధం చేస్తున్నామని మంత్రి చెప్పారు. నెక్స్ట్ జనరేషన్ ఇన్నోవేషన్స్, టాలెంట్, ఎకనామిక్ గ్రోత్‌ను అనుసంధానించే బలమైన ఎకోసిస్టమ్‌ను తెలంగాణ అభివృద్ధి చేస్తోందన్నారు.

గ్లోబల్ ఎకానమీ వేగంగా డిజిటల్ దిశగా మారుతోందని, ఈ మార్పులను అందిపుచ్చుకునే దేశాలు, రాష్ట్రాలకే భవిష్యత్తు ఉంటుందని అన్నారు. డిజిటల్ పేమెంట్స్, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో భారత్ సాధిస్తున్న పురోగతికి తెలంగాణ గ్రోత్ ఇంజన్‌గా నిలుస్తోందని పేర్కొన్నారు. 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి చేర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తోందని తెలిపారు. ఏఐ, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ వంటి సాంకేతికతలతో ఫైనాన్స్ రంగంలో కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయని, అదే సమయంలో సైబర్ మోసాలు, డీప్‌ఫేక్స్, క్రిప్టో ఫ్రాడ్స్ వంటి సవాళ్లు కూడా పెరుగుతున్నాయని అన్నారు.

ఈ నేపథ్యంలో సీఏలు ఫైనాన్షియల్ ఆడిటింగ్‌తో పాటు సైబర్ అష్యూరెన్స్‌కూ ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి సూచించారు. మారుతున్న అవసరాలకు అనుగుణంగా స్కిల్లింగ్, అప్‌స్కిల్లింగ్, రీ-స్కిల్లింగ్‌పై దృష్టి పెట్టాలని, ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

# పిల్లలమర్రిలో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహణ



**మహబూబ్‌నగర్, మే 22( సమయం న్యూస్). :** ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పిల్లలమర్రి వద్ద జిల్లా పర్యాటక శాఖ, వారసత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలమర్రి పరిసర ప్రాంతాల్లో శుభ్రత కార్యక్రమాలు చేపట్టి, వారసత్వ కట్టడాల సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వారసత్వ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగలక్ష్మి, పిల్లలమర్రి మ్యూజియం సిబ్బంది, జిల్లా పర్యాటక శాఖ, టూరిజం శాఖ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వారసత్వ ప్రదేశాల పరిశుభ్రతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, పర్యాటక ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజల సహకారం అవసరమని తెలిపారు. పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు.

# ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక విజయవంతం



**కామారెడ్డి, మే 22( సమయం న్యూస్). :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ జిల్లాలో విజయవంతంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. ఇప్పటికే 75 రోజులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సత్య కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి కార్యక్రమాన్ని ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ, వ్యవసాయ శాఖ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మి కాంతం, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, రైతుల శ్రేయస్సు, ప్రజల సమస్యల పరిష్కారమే ప్రజా పాలన కార్యక్రమం లక్ష్యమన్నారు. మహమ్మద్ షబ్బీర్ అలీ మాట్లాడుతూ పారదర్శక పాలన అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ జిల్లాలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అన్ని శాఖల సమన్వయంతో ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. జూన్ 2న జిల్లాలో పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లకు గృహప్రవేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయిల్ పామ్ సాగు, పంట మార్పిడి, విద్యారంగ అభివృద్ధి, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం, వైద్య సేవల మెరుగుదలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్, మున్సిపల్ చైర్‌పర్సన్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భాగ్యరెడ్డి వర్మ ఆశయాలు యువతకు ఆదర్శం

● జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్




**సంగారెడ్డి, మే 22(సమయం న్యూస్) :** సామాజిక సమానత్వం, విద్యా విస్తరణ, అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేసిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ అని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. భాగ్యరెడ్డి వర్మ జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జయంతి వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో వెనుకబడిన వర్గాలకు విద్య, ఆత్మగౌరవం, సమాన హక్కుల కోసం భాగ్యరెడ్డి వర్మ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. యువత మహనీయుల ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని, సమానత్వ భావనతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి, జిల్లా అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# పోగుట్టుకున్న సెల్ ఫోన్ ను (సీఈఐఆర్) పోర్టల్ సహాయంతో అందజేత

■ పోలీస్ స్టేషన్ లో బాదితులకు సెల్ ఫోన్ అందజేసిన ఎస్సై సత్యనారాయణ రాజు



**కొడంగల్ మున్సిపల్,మే,22(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా,కొడంగల్ పట్టణం ఁ మండలం కు చెందిన బాధితుడు బాలరాజు తన (వన్ ప్లస్ సెల్ ఫోన్) మరియు శివ కుమార్ రెడ్డి తన (మోటారోలా నాడ్జ్ 60 ఫోన్ )పోయినట్లు కొడంగల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పోయిన సెల్ ఫోన్ ను (సీఈఐఆర్) పోర్టల్ సహాయంతో వన్ ప్లస్ ఫోన్ ను మహారాష్ట్ర రాష్ట్రం నుంచి, మోటారోలా ఫోన్ ను హైదరాబాద్ నుండి రికవరీ చేసి, బాదితులకు అందించినట్లు ఎస్సై సత్యనారాయణ రాజు తెలిపారు. ఫోన్ అందుకున్న బాధితులు ఎస్సై మరియు సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

# ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమావేశం



**భద్రాద్రి కొత్తగూడెం, మే 22( సమయం న్యూస్)** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా కొత్తగూడెం క్లబ్‌లో జిల్లా స్థాయి సమావేశం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన అవగాహన, సంక్షేమ, అభివృద్ధి స్టాల్స్‌ను ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. అనంతరం శాఖల వారీగా అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే జిల్లాను రోల్ మోడల్ జిల్లాగా తీర్చిదిద్దవచ్చన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువవుతోందన్నారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సంక్షేమ పథకాల అమలులో అధికారులు నిరంతర పర్యవేక్షణతో పని చేయాలని సూచించగా, ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమం అనంతరం సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

# ప్రధాని సంస్కృత సుభాషితం సందేశం

**న్యూఢిల్లీ, మే 22( సమయం న్యూస్). :** సమిష్టి శ్రేయస్సు, సర్వజన సంక్షేమం కోసం ప్రధాని నరేంద్ర మోదీ సంస్కృత సుభాషితాన్ని పంచుకున్నారు. వృక్షజీవులు వందల, వేల కొమ్మలతో విస్తరించి అభివృద్ధి చెందాలని, వాటితో పాటు మనమందరం కూడా సౌభాగ్యం, శ్రేయస్సుతో ముందుకు సాగాలని ఆ సుభాషితం సందేశమిస్తోంది. ప్రకృతి అభివృద్ధి, మానవ సంక్షేమం పరస్పరం అనుసంధానమై ఉన్నాయని ఈ సందేశం ద్వారా ప్రధాని స్పష్టం చేశారు.

# పెద్దపల్లి జిల్లాలో 2.67 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు



**పెద్దపల్లి, మే 22:( సమయం న్యూస్). :** జిల్లాలో రబీ 2025-26 సీజన్ ధాన్యం కొనుగోళ్లు సజావుగా కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. మే 21న ఒక్కరోజే 15,005 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో 311 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 30,690 మంది రైతుల నుంచి 2,67,929 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, దాని విలువ రూ. 634.82 కోట్లుగా ఉందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యంలో 2,65,824 మెట్రిక్ టన్నులు ఇప్పటికే రైస్ మిల్లులకు తరలించామని, కేంద్రాల్లో కేవలం 2,105 మెట్రిక్ టన్నులు మాత్రమే నిల్వలో ఉన్నాయని తెలిపారు. ఇప్పటివరకు 26,493 మంది రైతులకు సంబంధించిన రూ. 505.70 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశామని, రూ. 129.12 కోట్ల చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ధాన్యం తరలింపునకు 580 ట్రక్కులు, అవసరమైన ట్రాక్టర్లు వినియోగిస్తున్నామని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు 88.02 లక్షల గన్నీ బ్యాగులు పంపిణీ చేశామని, అదనంగా 4 లక్షల గన్నీలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ వివరించారు. సీఎంఆర్ బియ్యం సరఫరాలో పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉందని కలెక్టర్ తెలిపారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని స్పష్టం చేశారు.

# తెలంగాణ పర్యాటకాభివృద్ధిపై నేడు నిథమ్‌లో సదస్సు

**హైదరాబాద్, మే 22( సమయం న్యూస్).** తెలంగాణను ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో "డెస్టినేషన్ తెలంగాణ--రోడ్ అహెడ్" అనే అంశంపై మే 23న నిథమ్ క్యాంపస్, గచ్చిబౌలిలో పర్యాటక సదస్సు నిర్వహించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ సదస్సు జరగనుంది. పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ టూరిజం పోస్టర్ ప్రదర్శన, మొక్కల నాటకం, అవగాహన కార్యక్రమాలు, ఎంఓయూల సంతకాలు, తెలంగాణ టూరిజం "బ్రాండ్ కిట్" ఆవిష్కరణ ఉంటాయి. పర్యాటక రంగ అభివృద్ధి, వారసత్వ పరిరక్షణ, పర్యాటక అనుకూల నగరాలు, హరిత--సుస్థిర పర్యాటకంపై నిపుణులు చర్చించనున్నారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీ ప్రసాద్, టీజీటీడీసీ అధికారులు, పర్యాటక--ఆతిథ్య రంగ ప్రముఖులు, విధాన నిర్ణేతలు, భాగస్వాములు ఈ సదస్సులో పాల్గొననున్నారు. తెలంగాణ పర్యాటక రంగ భవిష్యత్ కార్యాచరణపై సమగ్ర చర్చలు జరగనున్నాయి.

# సమన్వయంతోనే జిల్లా అభివృద్ధి

- కలెక్టర్ దివాకర టీఎస్




**ఖమ్మం, మే 22( సమయం న్యూస్).** ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే జిల్లా అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఖమ్మం జిల్లా రాష్ట్రంలోనే ముందంజలో ఉందని తెలిపారు. జాబ్ మేళాల ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. వేసవి దృష్ట్యా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, వర్షాకాలంలో మొక్కలు నాటి పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంటర్ వరకు విస్తరించనున్నట్లు, విద్యార్థులకు అల్పాహారం, వికలాంగులకు బ్యాటరీ వాహనాల పంపిణీ త్వరలో చేపట్టనున్నట్లు వెల్లడించారు.

# ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక వేడుక ఘనంగా నిర్వహణ



**నిజామాబాద్, మే 22( సమయం న్యూస్).** : ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిజామాబాద్‌లో జిల్లా స్థాయి సమావేశం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, డాక్టర్ భూపతిరెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో రైతు భరోసా, రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పెన్షన్లు, రేషన్ కార్డులు వంటి సంక్షేమ పథకాల అమలుపై అధికారులు వివరాలు వెల్లడించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ చేరేలా కృషి చేయాలని నాయకులు సూచించారు.

స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు.



నూతన drdo గా దామోదర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ను మర్యాద పూర్వకంగా కలసి పూల మొక్క అందించారు

# ఉద్యోగ మేళా ద్వారా 51 వేల మందికి నియామక పత్రాలు

**న్యూఢిల్లీ, మే 22( సమయం న్యూస్).** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మే 23న ఉదయం 11 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 19వ రోజ్‌గార్ మేళాలో 51 వేలకు పైగా నూతనంగా నియమితులైన యువతకు నియామక పత్రాలు అందజేయనున్నారు. దేశవ్యాప్తంగా 47 ప్రాంతాల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. రైల్వే, హోం వ్యవహారాలు, ఆరోగ్యం, ఆర్థిక సేవలు, ఉన్నత విద్య తదితర కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు ఇవ్వనున్నారు. ఉపాధి కల్పనకు ప్రాధాన్యతనిస్తూ కేంద్ర ప్రభుత్వం రోజ్‌గార్ మేళాను నిర్వహిస్తోంది. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా నిర్వహించిన 18 రోజ్‌గార్ మేళాల ద్వారా సుమారు 12 లక్షల నియామక పత్రాలు అందజేశారు.

# అంతర్‌రాష్ట్ర దొంగలపై రైల్వే స్టేషన్లలో 24 గంటల పోలీసుల నిఘా

**హన్మకొండ మే22( సమయం న్యూస్) :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత కొద్ది రోజులుగా ఇతర రాష్ట్రాలు నుండి ముఖ్యంగా ఉత్తర భారతదేశానికి చెందిన నేరగాళ్ళు ఇండ్ల చోరీలతో పాటు, చైన్ స్నాచింగ్ చోరీలకు పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో నిర్ధారణ కావడం, ముఖ్యంగా దేశంలోని అన్ని రాష్ట్రాలను కలుపుతూ కేంద్ర బిందువుగా వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్లు మారడంతో నేరగాళ్ళు రైలు మార్గాల ద్వారా ఇక్కడికి చేరుకోని పలు చోరీలకు పాల్పడటం, అనంతరం నిందితులు ఇదే రైలు మార్గం ద్వారా తిరిగి వారి స్వస్థలాలకు చేరకుంటున్నారు. ఇలాంటి నేరాలపై ప్రత్యేక దృష్టి పెట్టిన వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అంతర్ రాష్ట్ర దొంగలకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించారు. ఇందులో భాగంగా అంతర్‌రాష్ట్ర దొంగలను ముందుగా గుర్తిండం అలాగే చోరీల కట్టడికై రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా క్రైమ్స్ అదనపు డిసిపి బాలస్వామి, సిసిఎస్ ఏసిపి సదయ్య అధ్వర్యంలో నాలుగు ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేయడం జరిగింది. రెండు బృందాలు చోప్పున వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్లలో ప్రభుత్వ రైల్వే పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సహకారంతో విధులు నిర్వహిస్తారు. దేశంలోని వివిధ మార్గాల ద్వారా ముఖ్యంగా ఉత్తర భారత దేశం నుండి వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్లలో అగే రైళ్ళలో ఇక్కడకి చేరుకున్న ప్రయాణికుల్లో ఈ ప్రత్యేక పోలీస్ బృందం సభ్యులు అనుమానిత ప్రయాణికులను గుర్తించి వారిని, వారి సామగ్రిని సైతం కుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు వారి నుండి పూర్తి వివరాలను సేకరించిన అనంతరం ఈ ప్రత్యేక పోలీస్ బృందం సభ్యులు అనుమానిత వ్యక్తుల సంబంధిత వ్రేలి ముద్రలు, ముఖాలను ఫేస్ రికగ్నిజేషన్‌తో పాటు పోలీసుల వద్ద వున్న అధునిక పరిజ్ఞానంతో దేశంలోని నేరస్థులకు



సంబంధించిన డాటా బెస్‌తో అనుసంధానం చేసి సంబంధిత అనుమానిత వ్యక్తులను పరీక్షంచడం జరుగుతుంది. ఈ తనిఖీల్లో ఒక వేళ తనిఖీ చేసిన వ్యక్తి గతంలో ఏదైన నేరానికి పాల్పడినట్లయితే క్షణాల్లో పోలీసులు వినియోగిస్తున్న టెక్నికల్ డివైజ్‌కు అనుమానితుడి పూర్తి వివరాలు చేరిపోతాయి. దీనితో తక్షణమే పోలీసులు అప్రమత్తమై సదరు అనుమానితులను అదుపులోకి తీసుకోని పోలీస్ స్టేషన్‌కు తరలించడం జరిగింది. ఇదే సమయంలో ఈ బృందాలు తనిఖీలు చేసే సయమంలో అనుమానిత పూర్తి వివరాలను సైతం రికార్డుల రూపం భద్రపర్చడం జరుగుతుంది. నలుగురు సభ్యులు వున్న ప్రత్యేక బృందంలో ప్రతి రైల్వే స్టేషన్‌ల్లో షిఫ్ట్‌ల వారిగా విధులు నిర్వహిస్తు నిరంతరం అనుమానితులను తనిఖీలు నిర్వహిస్తూ అంతరాష్ట్ర దొంగలకు చెక్ పెడుతున్నారు వరంగల్ కమిషనరేట్ పోలీసులు.

# పథకాల అమలులో మహబూబాబాద్ జిల్లా ముందంజ

- వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు సంక్షేమంపై ప్రత్యేక దృష్టి
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

**మహబూబాబాద్, మే 22( సమయం న్యూస్).:** ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో మహబూబాబాద్ జిల్లా ముందంజలో ఉందని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రజాపాలన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజాపాలనలో వచ్చిన అన్ని పెన్షన్ దరఖాస్తులను డిజిటలైజ్ చేసి సిద్ధంగా ఉంచామని, ప్రభుత్వం ఆదేశాలు వచ్చిన వెంటనే మంజూరు చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిలో జిల్లా రాష్ట్రంలో 6వ స్థానంలో నిలిచిందని చెప్పారు. డీఆర్‌డీఏ ద్వారా 6,931 మందికి రూ.562.11 కోట్లు, మెప్మా ద్వారా 609 సంఘాలకు రూ.97.33 కోట్ల వడ్డీ లేని రుణాలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. మెంత్తం 7,540 స్వయం సహాయక బృందాలకు వడ్డీ లేని రుణాల చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. రైతులకు పంట మార్పిడి విధానం, ఆయిల్ పామ్, పప్పుధాన్యాలు, ఉద్యాన పంటలు, సేంద్రీయ వ్యవసాయం ద్వారా అధిక లాభాలు వస్తాయని అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. నానో యూరియా, సేంద్రియ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. మక్కజొన్న, వరిధాన్యం కొనుగోలు, తరలింపులో జిల్లా రికార్డు స్థాయిలో పనిచేసిందన్నారు. రైతు భరోసా, మహాలక్ష్మి, గృహజ్యోతి, చేయూత, కల్యాణలక్ష్మి/షాదీ ముబారక్, రేషన్ కార్డులు తదితర పథకాలను అర్హులకు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయని, బాల్యవివాహాల నివారణకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో పరిశుభ్రత, ఆరోగ్య అవగాహన, రోడ్డు భద్రత, రైతు సంక్షేమం, విద్యా వారోత్సవాలు, యువత క్రీడోత్సవాలు, మహిళా సాధికారత, వనమహోత్సవం కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.





# శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం దక్షిణ కాశిగా ప్రసిద్ధి చెందిన పవిత్ర క్షేత్రం

**కాళేశ్వరం తెలంగాణ రాష్ట్రంలోని కాళేశ్వరంలో ఉన్న ప్రాచీన, ఆధ్యాత్మిక మరియు చారిత్రక ప్రాధాన్యమున్న పుణ్యక్షేత్రం.**

**భూపాల పల్లి/ కాళేశ్వరం మే22( సమయం న్యూస్).** : ఇది గోదావరి మరియు ప్రాణహిత నదుల సంగమలిలి ప్రాంతంలో విరాజిల్లుతూ, భక్తుల విశ్వాసం ప్రకారం అంతర్వాహినిగా సరస్వతి నది కూడా ఇక్కడే కలుస్తుందని చెబుతారు. అందువల్ల ఈ పవిత్ర సంగమాన్ని "దక్షిణ త్రివేణి సంగమం"గా, "దక్షిణ కాశి"గా భక్తులు గౌరవిస్తారు.

హైదరాబాద్‌కు సుమారు 277 కి.మీ., భూపాలపల్లికి సుమారు 53 కి.మీ. దూరంలో ఉన్న ఈ క్షేత్రం తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దులకు సమీపంలో ఉండటం వల్ల ప్రత్యేక భౌగోళిక ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. కరీంనగర్--మంథని, వరంగల్--పరకాల మార్గాల ద్వారా రహదారి సౌకర్యాలు కలవు. సమీప రైల్వే స్టేషన్ మంచిర్యాల. స్కంద పురాణంలోని "కాళేశ్వర ఖండం" ఈ క్షేత్ర మహిమను విశదీకరిస్తుంది. పురాణాల ప్రకారం, యమధర్మరాజు (కాలుడు) పరమశివుని ఆరాధిస్తూ ఇక్కడ ఘోర తపస్సు చేశాడు. ఆయన భక్తికి ప్రసన్నుడైన శివుడు, తనతో పాటు ఇక్కడే నిత్యం నివసించే వరాన్ని అనుగ్రహించాడని విశ్వాసం. అందుచేత ఈ ఆలయంలో ఒకే పానవట్టంపై "కాళేశ్వర" మరియు "ముక్తీశ్వర" అనే రెండు శివలింగాలు ప్రతిష్ఠించబడ్డాయి. తెలుగు రాష్ట్రాల్లో యముడు శివలింగ రూపంలో పరమశివునితో కలిసి ఆరాధించబడుతున్న ఏకైక ఆలయం ఇదేనని భక్తుల నమ్మకం. ఇక్కడి శివలింగాలలో ఒకదానిపై ఉన్న రెండు చిన్న రంధ్రాలను స్వామివారి "నాసికా రంధ్రాలు"గా భావిస్తారు. ఈ రంధ్రాలలో పోసిన పాలు లేదా నీరు గోదావరి నదిలో కలుస్తాయని స్థానిక విశ్వాసం.

కాళేశ్వరం గోదావరి తీరం వద్ద ఉన్న పవిత్ర స్నాన ఘాట్లకు కూడా ప్రసిద్ధి చెందింది. వీటిని "అష్ట తీర్థాలు" అని పిలుస్తారు. అవి --- బ్రహ్మ తీర్థం, పిచ్చుక తీర్థం, జ్ఞాన తీర్థం, వాయస తీర్థం, సంగమ తీర్థం, నరసింహ తీర్థం, హనుమత్ తీర్థం, వ్యాస తీర్థం. ముఖ్యమైన పుణ్యకాలాలు, మహాశివరాత్రి, కార్తీక మాసం వంటి సందర్భాల్లో వేలాది మంది భక్తులు ఇక్కడ పవిత్ర స్నానాలు ఆచరిస్తారు.

కాకతీయులు, చాళుక్యులు, రాష్ట్రకూటులు వంటి రాజవంశాల పాలనలో ఈ క్షేత్రం అభివృద్ధి చెందింది. విజయనగర సామ్రాజ్యానికి చెందిన దేవరాయల శాసనాలు కూడా కాళేశ్వర ప్రాశస్త్యాన్ని తెలియజేస్తున్నాయి. ఆలయ పరిసరాల్లోని శిల్ప సంపదలో విష్ణుమూర్తి దశావతారాలు, చతుర్ముఖ లింగం, అర్జునుడి శిల్పాలు, ద్వారపాలక విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1976లో ఆలయ పునరుద్ధరణ చేపట్టగా, 1982లో కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య స్వాములు ఆలయాన్ని పునఃప్రతిష్ఠ చేశారు.

గోదావరి తీరం మీద ఆధ్యాత్మికత, పురాణ వైభవం, చరిత్ర, శిల్పకళ మరియు ప్రకృతి సౌందర్యాల సమ్మేళనంగా నిలిచిన కాళేశ్వరం, నేటికీ భక్తులను మరియు పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్న పవిత్ర క్షేత్రంగా వెలుగొందుతోంది.

# పేకాట ఆడుతున్న ముగ్గురిని పట్టుకున్న పోలీసులు

### ...కేసు నమోదు యాలాల ఎస్సై విఠల్ రెడ్డి

**యాలాల మండలం, మే.22(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా యాలాల మండలం శివారులో ఫర్దేకుంట వద్ద ముగ్గురు వ్యక్తులు పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు యాలాల ఎస్సై విఠల్ రెడ్డి తన సిబ్బందితో కలిసి వెళ్లి అక్కడ పేకాట ఆడుతున్న ముగ్గురు సంఘం కూర్దు గ్రామానికి చెందిన వారు పేకాట ఆడుతుండగా పట్టుకొని వారి వద్ద నుండి రూపాయలు 2800/- సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఎవరైనా చట్ట వ్యతిరేకమైన పనులకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు ఉంటాయని యాలాల ఎస్సై విట్టల్ రెడ్డి తెలిపారు.

# అనారోగ్యంతో మాజీ వైస్ ఎంపీపీ మృతి



**రాయపోల్, మే 22:**రాయపోల్ మండలం రామారం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, ఉమ్మడి దౌల్తాబాద్ మండల మాజీ వైస్ ఎంపీపీ తలారి నర్సింలు అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మృతిచెందారు. గత కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. 2014లో టిఆర్ఎస్ పార్టీ నుండి ఉమ్మడి దౌల్తాబాద్ మండల వైస్ ఎంపీపీగా గెలుపొందిన నర్సింలు ప్రజలకు సేవలందించి ప్రత్యేక గుర్తింపు పొందారు. 2019 స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున జెడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం బీజేపీలో చేరి పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా కొనసాగుతున్నారు. ఆయన మృతి పట్ల గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, గ్రామస్థులు ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# కార్మికుల కష్టానికి గౌరవం.

- వేతనాల పెంపుతో సీఎం రేవంత్ రెడ్డికి పాలాభిషేకం



**రాయపోల్, మే 21:**తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మికుల వేతనాలను భారీగా పెంచినందుకు హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం మండల కేంద్రం రాయపోల్‌లో పాలాభిషేకం నిర్వహించారు. సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసి మిఠాయిలు పంచుతూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా తక్కువ వేతనాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఊరటనిచ్చిందన్నారు. కార్మికుల సంక్షేమానికి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయమని పేర్కొన్నారు. పెరిగిన వేతనాలతో కార్మిక కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రతి వర్గానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కనకయ్య యాదవ్, ఏఎంసీ డైరెక్టర్లు మల్లేశం,పట్నం యాదగిరి,సీనియర్ నాయకులు కిష్టారెడ్డి, మాజీ ఎంపీటీసీ స్వామి, దుర్గ ప్రసాద్, మహేష్ యాదవ్, డాక్టర్ చందు, యాదవరెడ్డి, వాలీబాల్ స్వామి, మల్లారెడ్డి, వెంకట్ రెడ్డి, నర్సారెడ్డి, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ కమిషనర్ లో భారీగా సిబ్బంది బదిలీలు

**హన్మకొండ మే22( సమయం న్యూస్). :** వరంగల్ పోలీస్ కమిషనర్ పరిధిలో వివిధ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తూ ప్రభుత్వ కాలపరిమితిని పూర్తి చేసిన 15 మంది ఏఎస్ఐలు, 160 మంది హెడ్ కానిస్టేబుళ్ళు, 47 మంది కానిస్టేబుళ్లకు అధికారులు చేపట్టిన కౌన్సిలింగ్ ద్వారా సిబ్బంది ఎంపిక చేసిన వివిధ పోలీస్ స్టేషన్లకు బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీతిసింగ్ ఉత్తర్వులు జారీ చేశారు.

# తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన “ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

- 99 రోజుల యాక్షన్ ప్లాన్” లో భాగంగా
- జిల్లా సంక్షేమ శాఖ మరియు తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ ఆధ్వర్యంలో...
- జిల్లాకు చెందిన దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమం...



**నారాయణపేట, మే.22(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా గాయత్రి ఫంక్షన్ హాల్, నారాయణపేటలో జిల్లా సంక్షేమ శాఖ మరియు తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లాకు చెందిన దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి, విశిష్ట అతిథిగా తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య, జిల్లా కలెక్టర్ సి. హెచ్. ప్రియాంక, అదనపు కలెక్టర్ ఎస్. శ్రీను, మక్తల్, నారాయణపేట, మద్దూర్, కోస్గి మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచులు మరియు దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సాధికారత కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను అతిథులు ప్రశంసించారు. ప్రత్యేకంగా దివ్యాంగుల స్వయం ఆధారిత జీవనానికి దోహదపడే విధంగా రిట్రోఫిటెడ్ మోటార్ వాహనాలు (34), బ్యాటరీ వీల్ చైర్ ట్రైసైకిల్ -- 10, టలాప్టాప్ (08) , చెవి వినికిడి యంత్రాలు (2 )లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా... శ్రీ వాకిటి శ్రీహరి మాట్లాడుతూ దివ్యాంగుల అభివృద్ధి మరియు సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. కొత్త ఆలోచనలు, కొత్త అవకాశాలు దివ్యాంగుల జీవితాల్లో మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తున్నాయని పేర్కొన్నారు. దివ్యాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్దన్నలా, ఆత్మీయ బంధువులా అండగా నిలుస్తున్నారని తెలిపారు. అలాగే తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ



చైర్మన్ ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం దివ్యాంగుల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇద్దరు దివ్యాంగులు వివాహం చేసుకుంటే కల్యాణ లక్ష్మి పథకంతో పాటు అదనంగా రూ. 2 లక్షల వివాహ ప్రోత్సాహక బహుమతి అందిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే ఐదు సంవత్సరాల లోపు దివ్యాంగ చిన్నారులకు శస్త్ర చికిత్సలు నిర్వహించి సాధారణ జీవితం గడిపేలా చేయడం కోసం “బాల భరోసా” కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. దివ్యాంగుల కోసం ప్రభుత్వం అందిస్తున్న సహాయ ఉపకరణాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులైన దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ సి. హెచ్. ప్రియాంక మాట్లాడుతూ... దివ్యాంగ మహిళలు ప్రభుత్వం అందిస్తున్న ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే దివ్యాంగులకు అవసరమైన సహాయ సహకారాలు ప్రభుత్వం తరఫున అందించబడతాయని తెలిపారు. దివ్యాంగ మహిళలు తప్పనిసరిగా సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌లలో చేరాలని కోరారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఎల్. రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ దివ్యాంగులకు అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అర్హులైన ప్రతి దివ్యాంగునికి సహాయ పరికరాలు అందజేస్తామని, ఇప్పటివరకు పొందని వారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎస్. శ్రీను, ఆర్డీఓ ఎల్. రమేష్ , డీపీవో సుధాకర్ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు మరియు ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ సాయి, లబ్ధిదారులు, దివ్యాంగులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు .జిల్లా సంక్షేమ అధికారి (ఐసిడిఎస్)నారాయణపేట జిల్లా

# OMIF ఆపరేషన్ మెర్సి ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలు సామాజిక అంశాలపై అవగాహన సదస్సు

**నర్వ మండలం, మే.22(సమయం న్యూస్) :** నర్వ మండలం పాతర్చేడు గ్రామంలో OMIF ఆపరేషన్ మెర్సి ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలు సామాజిక అంశాలు అనే అంశాల మీద అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ హాజమ్మ మాట్లాడుతూ మన జిల్లాలో 350 గ్రామాలలో మా సంస్థ పనిచేస్తుందని మూఢనమ్మకాలు జోగిని వ్యవస్థ బాల్యవివాహాలు మీద పనిచేస్తున్నామని తెలియజేయడం జరిగింది. నర్వ మండల కోఆర్డినేటర్ ఎస్ పౌలు మాట్లాడుతూ టెన్త్ పాస్ అయిన విద్యార్థులు ఉంటే వారికి టైలరింగ్ కంప్యూటర్ బ్యూటిషన్ మీద ట్రైనింగ్ ఇస్తామని తెలపడం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన నర్వ గవర్నమెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ మహిళలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు సరియైన పోషకాహారం లేక రక్తహీనతతో బాధపడుతున్నారు బిపి షుగర్ థైరాయిడ్ వ్యాధులతో బాధపడుతున్నారు. మహిళలందరూ ఆరోగ్యం పట్ల అవగాహన ఉండాలని సరైన ఆహారం తింటూ ఆరోగ్యం కాపాడుకోవాలని తెలియజేశారు. నర్వ హెడ్ కానిస్టేబుల్ నరసింహులు మాట్లాడుతూ.. మహిళలు జోగినీలుగా చేయరాదని చిన్న పిల్లలకు పెళ్లిళ్లు చేయరాదని అలా చేసిన వారికి శిక్షలు ఉంటాయని తెలియజేశారు. మండల



కోఆర్డినేటర్ నరసింహులు ఏ ఎన్.ఎం కే నరసమ్మ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ శ్రీకాంత్, మన్యం కానిస్టేబుల్ సారిక, సురేష్ పాల్గొన్నారు. OMIF సంస్థ హెల్త్ వర్కర్స్ వై లక్ష్మి, కళావతి జయమ్మ నిర్మల వెంకటేశ్వరమ్మ ప్రమీల అంజమ్మ నిర్మల అశ్విని, వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు

# “ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక” కార్యక్రమంలో భాగంగా...జిల్లా స్థాయి సమావేశం



**వికారాబాద్, మే.22(సమయం న్యూస్) :** జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ముందుగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ,జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, అధికారులు జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లాలో వివిధ శాఖలు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ...ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. ప్రభుత్వం రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ చేయడం జరుగుతుందని, జిల్లాలో ఆత్మ కమిటీలను వేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. పరిగి మండలంలో రైతు విజ్ఞాన కేంద్రం మంజూరు అయ్యిందని తెలిపినారు. జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ.. చిత్తశుద్ధి, శ్రద్ధ అంకితభావంతో అధికారులు పనిచేసినట్లైతే ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించడంలో విజయవంతం అవుతమఅన్నారు జిల్లాలో రాష్ట ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రైతు భరోసా, రైతు బీమా పథకాలను సమర్థవంతంగా చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ.. ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే అక్కడ శాంతిభద్రతలు (లా అండ్ ఆర్డర్) సక్రమంగా ఉండటం చాలా ముఖ్యమని, జిల్లా ప్రగతికి శాంతిభద్రతల విషయంలో ఎక్కడా రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. జిల్లాలో మహిళలు, చిన్న పిల్లల భద్రత కోసం షీ టీమ్స్, భరోసా కేంద్రాలు, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగాలు (ఏహెచ్‌టీయూ) చురుగ్గా పనిచేస్తున్నాయన్నారు.



అంతర్ జిల్లా చెక్‌పోస్టులను మరింత బలోపేతం చేస్తామని తెలిపినారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లు ఉమా శంకర్ ప్రసాద్ , కె.వెంకటాచారి, జడ్పీ సీఈఓ సుధీర్, గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు రాజేశ్వర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ లు పట్లోల నీరజ బాల్ రెడ్డి, కుందుమళ్ళ రజిత, జిల్లా, మండల సమాఖ్య అధ్యక్షులు పాల్గొన్నారు.

# శని ,ఆదివారాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ








**కాళేశ్వరం మే22( సమయం న్యూస్) :** సరస్వతి అంత్య పుష్కరాలు సందర్భంగా శని, ఆదివారాల్లో అధిక సంఖ్యలో భక్తులు పుష్కర స్నానాలు చేసేందుకు వచ్చే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. పుష్కర ఘాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, ఆరోగ్య సేవలు, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై కలెక్టర్ మాట్లాడుతూ అవసరమైన చోట అదనపు సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో వాహనాలు రద్దీ, ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. వాహనాలు క్రమబద్ధీకరణ, రద్దీ నియంత్రణకు పోలీసు, రవాణా, దేవాలయంలో భక్తులు క్యూ పాటించుట, వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతి రాజ్, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎండ దృష్ట్యా భక్తులు తెల్లవారుజాము నుండే వచ్చే అవకాశం ఉందని అన్ని శాఖల అధికారులు వారికి కేటాయించిన విధుల్లో అందుబాటులో ఉండాలని ఆయన స్పష్టం చేశారు

# ప్రభుత్వాసుపత్రులకు మందుల సరఫరా, వినియోగ వ్యవస్థలో సమూల మార్పులు

- మందుల లభ్యత గురించే ప్రజలే నేరుగా తెలుసుకునేలా 'క్యూ'ఆర్ కోడ్ సదుపాయం!
- మందుల వినియోగ కాల పరిమితికి తగ్గట్టు 'అలర్ట్' మెసేజ్ లు
- రాష్ట్ర ఇ-ఔషధి (సాఫ్ట్వేర్) కార్యకలాపాల పునర్వ్యవస్థీకరణ
- మంత్రి శ్రీ సత్య కుమార్ విజ్ఞప్తి మేరకు ఢిల్లీ నుంచి వచ్చిన ఉన్నతాధికారులు

-మంగళగిరిలోని ఏపీఎస్ఏశీఐడీసీ కార్యాలయంలో ప్రస్తుత విధానం అమలుతీరుపై ప్రత్యేక సమీక్ష

ప్రభుత్వాసుపత్రులకు మందుల సరఫరా, వినియోగ విధానంలో సమూల మార్పులు రాబోతున్నాయి. ప్రజలే నేరుగా సదరు ప్రభుత్వాసుపత్రుల్లో ఉన్న మందుల లభ్యత గురించి 'క్యూఆర్' కోడ్ ద్వార తెలుసుకునే విధానాన్ని తీసుకువచ్చే ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉంది అలాగే మందుల వ్యవహారంలో ప్రతి ప్రక్రియ ఆన్లైన్లో నమోదు జరిగేలా, సంబంధిత పర్యవేక్షణ అధికారులకు సంక్షిప్త సందేశాల రూపంలో 'అలర్ట్' వెళ్లే విధంగా చర్యలు తీసుకోబోతున్నారు. ఈ మేరకు రాష్ట్రశీలో 2014 నుంచి వినియోగిస్తున్న 'ఇ-ఔషధి' వ్యవస్థను పటిష్టం చేయ-ంబోతున్నారు. ఇందుకు సంబంధించిన కీలక సమావేశం మంగళగిరిలోని రాష్ట్ర వైద్య, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఇందులో ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు ఢిల్లీ నుంచి వచ్చిన సీ-డాక్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**మంత్రి శ్రీ సత్యకుమార్ ఆదేశాలతో కదిలిన అధికార యంత్రాంగం**

రాష్ట్ర వైద్య, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ద్వారా జరిగే కొనుగోళ్లకు అనుగుణంగా ప్రభుత్వాసుపత్రులకు మందుల సరఫరా 'ఇ-ఔషధి' (సాఫ్ట్వేర్) అప్లికేషన్ ఆధారంగా జరుగుతోంది. ప్రతి ఏటా మందులు సర్జికల్ కొనుగోళ్ల కోసం ప్రతి ఏటా సుమారు రూ.800 కోట్ల వరకు ప్రభుత్వం వ్యయం చేస్తుంది. ఇందులో రూ. 600 కోట్ల విలువైన మందులను ప్రభుత్వం ఉచితంగా పేద రోగుల కోసం ప్రభుత్వాసు త్రులకు సరఫరా చేస్తోంది. ప్రాథమిక, సామాజిక, ప్రాంతీయ, జిల్లా, బోధనాసుపత్రులు, ఇతర ప్రత్యేక ఆసుపత్రుల ఫార్మసిస్టులు, మెడికల్ ఆఫీసర్లు, సూపరింటెండెంట్ల నుంచి వచ్చే ఇండెంట్ల ఆధారంగా 'ఇ-ఔషధి' ద్వారా అవసరమైన మందుల కోసం ప్రతిపాదనలు తయారవుతున్నాయి. వీటిని పరిశీలించిన అనంతరం టెండర్ల ద్వారా ఎంపిక చేసిన సంస్థలు సదరు జిల్లాల్లోని సెంట్రల్ డ్రగ్ స్టోర్లకు మందులను పంపుతున్నాయి. అవి అక్కడి నుంచి సదరు ప్రభుత్వాసుపత్రులకు సరఫరా అవుతున్నాయి. ఈ క్రమంలో జరిగే ప్రభుత్వాసుపత్రులకు జరిగే మందుల సరఫరా, వినియోగం, కాల వ్యవధి గుర్తింపు వంటి అంశాల్లో రకరకాల సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ పరిస్థితుల్లో 'ఇ-ఔషధి' వ్యవస్థను ప్రస్తుత అవసరాలు, అందుబాటులో ఉన్న అత్యాధునిక సాంకేతికతకు తగ్గట్లు పటిష్టం చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు.

**ప్రస్తుత విధానం అమలు తీరు పై సమీక్ష**

కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ డెవలప్మెంట్ ఆఫ్ అడ్వాన్స్డ్ కంప్యూటింగ్ (సీ-డాక్) ద్వారా విడివిడిగా ఏపీతో సహా 26 రాష్ట్రాలు, ఐదు కేంద్ర పాలిత ప్రాంతాల్లో మందుల సరఫరా వ్యవస్థ పర్యవేక్షణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి చెందిన ఇ- సాఫ్ట్వేర్లో తీసుకురానున్న మార్పులపై ఢిల్లీ నుంచి వచ్చిన సి-డాక్ నేషనల్ అసోసియేట్ డైరెక్టర్ సంషాద్ అన్సారీ, ప్రిన్సిపల్ టెక్నికల్ ఆఫీసర్ పార్థ పి. చటరాజ్, ప్రాజెక్టు మేనేజర్ ముస్తాక్ అహ్మద్ మంగళగిరిలోని ఖజాంఎఅఎఎ కార్యాలయంలో రాష్ట్ర సీ-డాక్ ముఖ్య ప్రతినిధి, సీనియర్ ప్రాజెక్ట్ ఇంజినీర్ పి.అశ్విని, డ్రగ్ వింగ్ అధికారులు, జిల్లాల్లోని సెంట్రల్ డ్రగ్ స్టోర్ల పర్యవేక్షణ అధికారులు, సీనియర్ ఫార్మసిస్టుల్ష్తశీ సమావేశమై ప్రస్తుత విధానంలో ఉన్న సానుకూలతలు, ప్రతికూలతల గురించి అడిగి తెలుసుకున్నారు. తీసుకురానున్న మార్పులు, చేర్పులపై సలహాలు, సూచనలు స్వీకరించారు. మంత్రి శ్రీ సత్య కుమార్ చొరవ తో వీరు ఢిల్లీ నుంచి వచ్చారు

**కీలక మార్పులు...!**

-సదరు ప్రభుత్వాసుపత్రుల్లో ఉన్న మందుల నిల్వల గురించి అక్కడి పనిచేసే ఫార్మసిస్టులు, మెడికల్ ఆఫీసర్లు మాత్రమే కాకుండా ప్రజలు కూడా 'క్యూ 'ఆర్' కోడ్ ద్వారా నేరుగా తెలుసుకునే సదుపాయాన్ని కల్పిస్తారు.

-మందులను నిర్ణీత కాలవ్యవధిలోనే ఉపయోగించే విధంగా కూడా 'ఇ-ఔషధి'లో 'అలర్ట్' విధానాన్ని తేబోతున్నారు. మందులను వినియోగించే కాల పరిమితిలో ముఖ్యంగా ఆరునెలల సమయంలోగా వాడాల్సిన (ఎక్స్పైరీ) గురించి ముందుగానే తెలుసుకునే విధానాన్ని తెస్తారు.

- ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల (ఉప ఆరోగ్య కేంద్రాలు) నుంచి బోధనాసుపత్రుల వరకు సదరు ఆసుపత్రుల్లో మందుల నిల్వలు ఏ స్థాయిలో ఉన్నాయో ఎవరైనా తెలుసుకునే విధంగా 'డ్యాష్ బోర్డు'ను తయారు చేస్తారు. హోదా లు మందుల గురించి పూర్తి స్థాయిలో సమాచారాన్ని తెలుసుకునేందుకు 'గ్లోబల్ డ్యాష్ బోర్డు' తయారవుతుంది.

రోగుల అవసరాలకు తగ్గట్లు మాత్రమే మందుల కొనుగోళ్లు, సరఫరా జరిగేలా, పారదర్శకంగా ఈ ప్రక్రియ ఉండేలా కూడా 'ఇ-ఔషధి'లో అవసరమైన మార్పులు తేనున్నారు.

-ఆసుపత్రుల నుంచి అవసరాలకు తగ్గట్లు మాత్రమే మందుల డిమాండ్ (రిక్వైర్మెంట్) వచ్చే విధానానికి అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

-మందుల తయారీదారులు, పంపిణీదారులు టెండర్లలో ఒప్పుకున్న ప్రకారం మందులను ప్రభుత్వాసుత్రులకు తగిన సమయంలో పంపుతున్నారా? లేదా? అన్న వివరాలను రియల్ టైమ్ విధానంలో గమనించేలా 'ఇ-ఔషధి' వ్యవస్థను పటిష్టం చేయనున్నారు.

-ఆయుష్ (ఆయుర్వేద, హోమియో, యూనాని) మందుల సరఫరా విధానాన్ని ఇ-ఔషధి పరిధిలోనికి తెచ్చే విషయాన్ని పరిశీలిస్తున్నారు.

-మనమిత్ర యాప్ లోనూ ప్రతి మందు నిల్వ గురించి తెలుసుకునే సదుపాయాన్ని కల్పించబోతున్నారు.

మందుల తయారీదారులు, పంపిణీదారులు సదరు సీడీఎస్లకు సరఫరా చేసిన వెంటనే ఆ సమాచారం తక్షణమే జిల్లా అధికారులు, రాష్ట్ర అధికారులకు అలర్ట్ వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

# ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికతో ప్రజలకు మెరుగైన సేవలు

**హనుమకొండ, మే 22( సమయం న్యూస్) :** ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా హనుమకొండ కలెక్టరేట్లో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పాల్గొన్నారు. రైతులు పంటల మార్పిడి, ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని ఎమ్మెల్యే సూచించారు. జూన్ 2న భారీ స్థాయిలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి, మొక్కజొన్న కొనుగోళ్లు విజయవంతంగా కొనసాగుతున్నాయని చెప్పారు. ఇప్పటికే 2 వేలకుపైగా ఇందిరమ్మ ఇళ్లు పూర్తయ్యాయని వెల్లడించారు.

ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పత్రాలు, రైతులకు వ్యవసాయ పరికరాలు, దివ్యాంగులకు బ్యాటరీ వాహనాలు అందజేశారు. అనంతరం భాగ్యరెడ్డి వర్మ జయంతిని ఘనంగా నిర్వహించి నివాళులర్పించారు.



# సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా

● ప్రతి రోజు సాయంత్రం నిర్వహిస్తున్న సరస్వతి నవరత్నమాల హారతి సమాచార పౌర సంబంధాల శాఖ ద్వారా ప్రత్యక్ష ప్రసారం... జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**కాళేశ్వరం మీడియా సెంటర్ మే22( సమయం న్యూస్) :** కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి అంత్య పుష్కరాల్లో భాగంగా ప్రతి రోజు కాశి పండితులచే నిర్వహిస్తున్న సరస్వతి నవరత్న మాలా హారతి ప్రతి రోజు రాత్రి 7.30 గంటల నుండి దేశ, విదేశాల్లో నివసిస్తున్న భక్తులు వీక్షించడానికి వీలుగా సమాచార పౌర సంబంధాల శాఖ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సరస్వతి నవరత్న మాలా హారతి కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నట్లు తెలిపారు. ప్రతీ రోజు రాత్రి 7.30 గంటల నుండి నిర్వహించే సరస్వతి నవరత్న మాలా హారతి కాశీలో అత్యంత ప్రజాదరణ పొందిన గంగా హారతినిచ్చే పండితుల ద్వారా ఇచ్చేలా ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దాదాపు 45 నిమిషాల పాటు సాగే సరస్వతి నవరత్నమాల హారతిలో తొమ్మిది ప్రత్యేక హారతులను కాశీ పండితులు ఇస్తున్నారు.

**సరస్వతి నవరత్నమాల స్తోత్రం తొమ్మిది హారతులు.**

ఓంకార హారతి పాపాలు పోగొట్టి దీపంలా నిలబెడుతుంది.

నాగ హారతి – సర్పదోషాన్ని పోగొట్టి సంతానాన్ని, ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది

పంచ హారతి – దీర్ఘాయుష్షును ఇస్తుంది.

సూర్య హారతి రోగాలను మాపి యోగశక్తిని, ఆరోగ్యాన్ని ఇస్తుంది.

చంద్ర హారతి – పాడి పంటలను, దాంపత్య సౌఖ్యాన్ని, మన: శాంతినిస్తుంది.

నంది హారతి – ధర్మ బుద్ధిని, కీర్తిని, భక్తిని, యుక్తిని, శక్తిని, విద్యా బుద్ధినిస్తుంది.

సింహ హారతి. ధైర్య సాహసాన్ని, నాయకత్వాన్ని, విజయాన్నిస్తుంది.

కుంభ హారతి సంపదను, సంతుష్టిని, పుష్టిని కోటి సుఖాలను అందిస్తుంది.

నక్షత్ర హారతి – నిర్మలమైన మనస్సును, సౌందర్యాన్ని, కీర్తిని అందిస్తుంది.

# జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ హెచ్చరికల మేరకు మన పెద్దపల్లి జిల్లాలో తీవ్ర ఎండలు ,

వేడి గాలులు వీచే అవకాశం ఉన్నందున డాక్టర్ కే ప్రమోద్ కుమార్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి , పెద్దపల్లి గారు ప్రజలు వడ దెబ్బ బారిన పడకుండా తీసుకోవాలిసిన జాగ్రత్తల గురించి తెలియచేసారు.



**చేయకూడనివి**

ముఖ్యంగా మధ్యాహ్నం 12:00 నుండి 04:00 గంటల మధ్య ఎండలో బయటకు రాకుండా ఉండండి. ఎండ సమయంలో బయట ఉన్నప్పుడు అధిక శ్రమకు దూరంగా ఉండండి.

చెప్పులు లేకుండా బయటకు వెళ్లవద్దు, వేసవి ఎక్కువగా ఉండే సమయంలో వంట చేయడం మానుకోండి. వంట ప్రదేశాన్ని తగినంతగా గాలి వచ్చే విధంగా తలుపులు మరియు కిటికీలను తెరవండి.

ఆల్కహాల్, టీ, కాఫీ మరియు కూల్ డ్రింక్స్ లేదా తీపి పానీయాలను నివారించండి- ఇవి వాస్తవానికి, మరింత శరీర ద్రవాన్ని కోల్పోవడానికి లేదా కడుపులో ఇబ్బందికి కారణం కావచ్చు, ఎక్కువ ప్రోటీన్ కలిగిన ఆహారాన్ని మానుకోండి. మరియు నిల్వ ఆహారాన్ని తినవద్దు, ఎండలో ఆపి ఉంచినవాహనంలో పిల్లలను లేదా పెంపుడు జంతువులను వదిలివేయవద్దు. వాహనం లోపల అతి వేడిగా ఉండి వడదెబ్బ తాకవచ్చు.

**చేయవలసినవి**

శరీరం నుంచి నీరు కోల్పోకుండా ఉండండి

మీకు దాహం వేయకపోయినా, వీలైనప్పుడల్లా తగినంత నీరు త్రాగాలి. దాహం అవ్వడం మంచి సంకేతం కాదు.

ప్రయాణించేటప్పుడు తాగునీరు తీసుకెళ్లండి.

ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్ (ా=ా) ఉపయోగించండి మరియు నిమ్మరసం, వెన్న పాలు/లస్సీ వంటి ఇంట్లో తయారుచేసిన పానీయాలు, ఉప్పు కలిపిన పండ్ల రసాలను తీసుకోండి.

తర్బూజా, పుచ్చ (వాటర్ మెలోన్), ఆరెంజ్, ద్రాక్ష, పైనాపిల్, దోసకాయ లేదా ఇతర స్థానికంగా లభించే పండ్లు మరియు కూరగాయలు వంటి అధిక నీరు ఉన్న సీజనల్ పండ్లు మరియు కూరగాయలను తినండి.

వీలైనంత వరకు ఇంటి లోపల/నీడలో గాలి ప్రసరించే చల్లని ప్రదేశంలో ఉండండి

ప్రత్యక్షంగా ఎండ మరియు వేడి తరంగాలను నిరోధించండి: పగటిపూట ఎండా సమయంలో కిటికీలు మరియు కర్టెన్లను మూసి ఉంచండి. చల్లటి గాలిని లోపలికి అనుమతించడానికి రాత్రి వాటిని తెరవండి.

బయటికి వెళితే, మీ బహిరంగ కార్యకలాపాలను రోజులోని చల్లని సమయాలకు అంటే ఉదయం మరియు సాయంత్రం వరకు పరిమితం చేయండి

రోజులో చల్లని సమయాల్లో బయటి పనులు చేసుకోండి అలా ప్లాన్ చేయండి.

**వడ దెబ్బ లక్షణాలు**

మగత లేదా మూర్ఛ, వికారం లేదా వాంతులు, తలనొప్పి, విపరీతమైన దాహం, అసాధారణంగా ముదురు పసుపు రంగులో తక్కువ పరిమాణంలో మూత్రవిసర్జన, వేగవంతమైన శ్వాస మరియు హృదయ స్పందన, వేడిగాలులు మరియు వడ దెబ్బ నుంచి రక్షించుకోగలం .

విపరీతమైన వేడి సమయంలో మీరు లేదా ఇతరులు అనారోగ్యంగా మరియు పైన పేర్కొన్న ఏవైనా లక్షణాలను గుర్తిస్తే, వెంటనే చల్లని ప్రదేశానికి వెళ్లి ద్రవపదార్థాలు తాగాలి. నీరు తాగడం ఉత్తమం. వెంటనే వైద్య సహాయం పొందండి.

**అత్యవసర సమయం లో చేయవలసినవి**

మీకు వీలైతే వారిని చల్లని ప్రదేశానికి తరలించండి; దుస్తులు తొలగించి చర్మానికి చల్లని నీటితో లేదా తడి బట్టతో తుడవడం చేయండి. వ్యక్తికి వీలైనంతగా చల్లని గాలి తగిలేలా చూడండి, ఆ వ్యక్తి స్పృహలో ఉండి నీరు తాగే స్థితిలో ఉన్నట్లయితే చల్లటి మంచినీరు లేదా ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్ (ా=ా) , కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, మజ్జిగ వంటి ఇంట్లో తయారుచేసిన పానీయాలు తాగించండి.

ప్రజలు అధిక శరీర ఉష్ణోగ్రత ఉన్న వ్యక్తిని కనుగొంటే మరియు అపస్మారక స్థితిలో, గందరగోళంగా లేదా చెమట పట్టడం ఆగిపోయినట్లయితే వెంటనే 108కు కాల్ చేయాలి అని అన్నారు.

# పుష్కరాలలో ముమ్మరంగా పారిశుధ్యం

**కాళేశ్వరం మే22( సమయం న్యూస్) :** కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పుష్కరాలకు భారీ సంఖ్యలో తరలివస్తున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ప్రత్యేక చర్యలు చేపట్టారు. పుష్కర ఘాట్లు, నదీ తీర ప్రాంతాలు మరియు పరిసర ప్రాంతాల్లో నిరంతరం శుభ్రత నిర్వహణ జరుగుతోంది. నదిలో వేయబడుతున్న వ్యర్థాలను సైతం జల్లెడ పట్టి తొలగిస్తూ పరిశుభ్రతను కాపాడుతున్నారు. పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగిస్తూ పరిశుభ్రం చేస్తున్నారు. శుభ్రత నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను అమలు చేశారు. పారిశుధ్య కార్యక్రమాల పర్యవేక్షణ కోసం మె-ంత్తం 18 మంది ప్రత్యేక అధికారులను నియమించగా, సుమారు 300 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. కాళేశ్వరాన్ని 5 జోన్లుగా విభజించి, ప్రతి జోన్కు జోనల్ అధికారులను నియమించారు. జోనల్ అధికారులు, సూపర్వైజర్లు, పర్యవేక్షక సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేస్తూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నారు. భక్తులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే ప్రధాన లక్ష్యంగా జిల్లా యంత్రాగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ పుష్కరాలలో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు. అలాగే, నదీ తీర ప్రాంతాలు మరియు ప్రధాన కూడళ్ల వద్ద భక్తులు వ్యర్థాలు వేయడానికి ప్రత్యేక ఆకర్షణగా హృదయాకారంలో ఇనుప డస్ట్బిన్లు ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లా పరిపాలన తీసుకుంటున్న ఈ చర్యలతో పుష్కరాలకు విచ్చేస్తున్న భక్తులు పరిశుభ్రమైన, సౌకర్యవంతమైన వాతావరణంలో పుణ్యస్నానాలు ఆచరించగలుగుతున్నారు.




# గైక్వాడ్‌కు భారీ జరిమానా

## చెన్నై ప్లేఆఫ్స్ ఆశలకు ముగింపు

**అహ్మదాబాద్, మే 22 :** చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌కు ఐపీఎల్ నిర్వాహకులు భారీ జరిమానా విధించారు. గుజరాత్ టైటాన్స్‌తో గురువారం జరిగిన మ్యాచ్‌లో చెన్నై జట్టు నిర్ణీత సమయంలో ఓవర్లు పూర్తి చేయకపోవడంతో స్లో ఓవర్ రేట్ నేరం కింద ఈ చర్యలు తీసుకున్నారు. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 ప్రకారం ఇది చెన్నై జట్టుకు రెండో తప్పిదంగా పరిగణించబడింది. దీంతో రుతురాజ్ గైక్వాడ్‌పై రూ.24 లక్షల జరిమానా విధించినట్లు ఐపీఎల్ అధికారిక ప్రకటనలో తెలిపింది. అలాగే జట్టులోని మిగతా ఆటగాళ్లు, ఇంపాక్ట్ ప్లేయర్‌పై కూడా రూ.6 లక్షలు లేదా మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించనున్నట్లు వెల్లడించింది. ఇక మ్యాచ్ విషయానికి వస్తే, ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్‌కు ఈ సీజన్ నిరాశాజనకంగా ముగిసింది. గుజరాత్ టైటాన్స్ చేతిలో 89 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలైన చెన్నై ప్లేఆఫ్స్ ఆశలను పూర్తిగా కోల్పోయింది. లీగ్ దశలోనే టోర్నీ నుంచి నిష్క్రమించాల్సి వచ్చింది. ముందుగా బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 229 పరుగుల భారీ స్కోరు చేసింది. సాయి సుదర్శన్ 84 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్ ఆడగా, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 64 పరుగులతో జట్టుకు బలమైన ఆరంభం అందించాడు. చివర్లో జోస్ బట్లర్ 57 పరుగులతో మెరిపించాడు. అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన చెన్నై జట్టు గుజరాత్ బౌలర్ల ధాటికి కుప్పకూలింది. మహ్మద్ సిరాజ్, కగిసో రబాడ, రషీద్ ఖాన్ అద్భుత బౌలింగ్‌తో చెన్నై బ్యాటింగ్‌ను చీల్చిచెండాడారు. శివం దూబే 47 పరుగులతో కొంత పోరాడినప్పటికీ, మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. చెన్నై జట్టు కేవలం 13.4 ఓవర్లలోనే 140 పరుగులకు ఆలౌటైంది. ఈ విజయంతో గుజరాత్ టైటాన్స్ పాయింట్ల పట్టికలో రెండో స్థానాన్ని మరింత బలపరుచుకోగా, ప్లేఆఫ్స్‌కు ముందే తమ జోరును తిరిగి అందుకుంది. అద్భుత బౌలింగ్ ప్రదర్శన చేసిన మహ్మద్ సిరాజ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.




# కామెంటరీ బాక్స్‌లో స్వేచ్ఛ లేదన్న శివరామకృష్ణన్

**చెన్నై, మే 22 :** క్రికెట్ కామెంటరీ వెనుక ఉన్న కఠిన పరిస్థితులపై భారత మాజీ క్రికెటర్ లక్ష్మణ్ శివరామకృష్ణన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మ్యాచ్‌ల సమయంలో కామెంటరీ చెప్పేవారికి పూర్తి స్వేచ్ఛ ఉండదని, బయటకు కనిపించే పరిస్థితులకు భిన్నంగా కామెంటరీ బాక్స్‌లో తీవ్ర ఒత్తిడి ఉంటుందని ఆయన వెల్లడించారు. కామెంటరీ బాక్స్‌లో కూర్చొని స్వేచ్ఛగా మాట్లాడుతున్నారని చాలామంది అభిమానులు భావిస్తారని, కానీ వాస్తవానికి అక్కడ పరిస్థితి నరకంలా ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. మైక్ ఆన్ చేసే ముందు నుంచే ప్రసార సంస్థల ప్రతినిధులు, క్రికెట్ బోర్డు అధికారులు కొన్ని స్పష్టమైన మార్గదర్శకాలు ఇస్తారని తెలిపారు. కొంతమంది ఆటగాళ్లను ఎక్కువగా విమర్శించకూడదని, వివాదాస్పద నిర్ణయాలు లేదా మైదాన పరిస్థితులపై ప్రతికూల వ్యాఖ్యలు చేయవద్దని ముందుగానే హెచ్చరిస్తారని చెప్పారు. తాము అనుకున్నది స్వేచ్ఛగా చెప్పే పరిస్థితి ఉండదని, ప్రసార సంస్థలు కోరుకున్న అభిప్రాయాలనే ఎక్కువగా చెప్పాల్సి వస్తుందని శివరామకృష్ణన్ ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పెద్ద ఇరవై ఓవర్ల లీగ్‌లు, అంతర్జాతీయ ద్వైపాక్షిక సిరీస్‌ల సమయంలో ఈ నియంత్రణ మరింత ఎక్కువగా ఉంటోందని ఆరోపించారు. నిష్పక్షపాతంగా లోపాలను ఎత్తిచూపాలని ప్రయత్నిస్తే తదుపరి సిరీస్‌లలో అవకాశాలు తగ్గించేలా పరోక్ష హెచ్చరికలు వస్తాయని ఆయన పేర్కొన్నారు. కెరీర్, ఆర్థిక భద్రత కోసం చాలామంది కామెంటేటర్లు ప్రసార సంస్థలు చెప్పిన విధంగానే మాట్లాడాల్సి వస్తోందని విమర్శించారు.



# గెలిచినా నిరాశే!

### బెంగళూరు పై 55 పరుగుల తేడాతో హైదరాబాద్ ఘన విజయం

### ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ, క్లాసెన్ విధ్వంసకర బ్యాటింగ్

### రన్ రేట్ తో పాయింట్ల పట్టికలో మూడో స్థానానికే పరిమితం

### ప్లే ఆఫ్స్ లో భాగంగా ముందుగా ఎలిమినేటర్ మ్యాచ్ ఆడనున్న సన్ రైజర్స్

సొంత గడ్డపై సన్‌రైజర్స్ హైదరాబాద్ సింహంలా గర్జించింది. రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును చిత్తుగా ఓడించింది. బ్యాటింగ్, బౌలింగ్ లో సత్తా చాటిన హైదరాబాద్ 55 పరుగుల భారీ తేడాతో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. అయితే ఇంత భారీ విజయం సాధించినా నెట్ రన్ రేట్ లెక్కల్లో వెనుకబడటంతో పాయింట్ల పట్టికలో టాప్ 2 స్థానాల్లో నిలవలేకపోయింది. దీంతో ప్లే ఆఫ్స్ లో ఫైనల్ కు చేరేందుకు అదనపు అవకాశం కోల్పోయి ఎలిమినేటర్ మ్యాచ్ ఆడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

#### హైదరాబాద్ బ్యాటింగ్ విధ్వంసం..

హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో శుక్రవారం జరిగిన ఈ కీలక మ్యాచ్ లో సన్ రైజర్స్ హైదరాబాద్ టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. ఓపెనర్లు, మిడిలార్డర్ బ్యాటర్లు ఆది నుంచే బెంగళూరు బౌలర్లపై విరుచుకుపడ్డారు. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి ఏకంగా 255 పరుగుల భారీ స్కోరు సాధించింది. హైదరాబాద్ బ్యాటర్లలో ఇషాన్ కిషన్ 46 బంతుల్లో 79 పరుగులతో టాప్ స్కోరర్ గా నిలవగా.. అభిషేక్ శర్మ కేవలం 22 బంతుల్లో 56 పరుగులు చేసి మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ఆఖర్లో హెన్రిచ్ క్లాసెన్ 24 బంతుల్లోనే 51 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. బెంగళూరు బౌలర్లలో రసిఖ్ సలామ్ 4 ఓవర్లలో 52 పరుగులిచ్చి 2 వికెట్లు తీశాడు. కృనాల్ పాండ్యా 2 ఓవర్లలో 24 పరుగులిచ్చి 1 వికెట్, సుయాష్ శర్మ 3 ఓవర్లలో 36 పరుగులిచ్చి 1 వికెట్ పడగొట్టారు.

#### సాధారణ స్కోరుకే బెంగళూరు పరిమితం..

256 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 200 పరుగులకే పరిమితమైంది. బ్యాటర్లు రజత్ పాటిదార్ 39 బంతుల్లో 56 పరుగులు, వెంకటేష్ అయ్యర్ 19 బంతుల్లో 44 పరుగులు చేసి కాస్త పోరాడే ప్రయత్నం చేశారు. చివర్లో కృనాల్ పాండ్యా 31 బంతుల్లో 41 పరుగులు చేసి అజేయంగా నిలిచినా లాభం లేకపోయింది. భారీ లక్ష్య ఛేదనలో హైదరాబాద్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి బెంగళూరు బ్యాటర్లను కట్టడి చేశారు. ఈషాన్ మలింగ 4 ఓవర్లలో 33 పరుగులిచ్చి 2 వికెట్లు తీశాడు. ట్రావిస్ హెడ్ 1 ఓవర్లో 7 పరుగులిచ్చి 1 వికెట్, సాకిబ్ హుస్సేన్ 4 ఓవర్లలో 31 పరుగులిచ్చి 1 వికెట్ తీసి హైదరాబాద్ కు 55 పరుగుల భారీ విజయాన్ని అందించారు.

#### రన్ రేట్ దెబ్బ.. ఎలిమినేటర్ కష్టాలు..

లీగ్ దశలో తమ ఆఖరి మ్యాచ్ ఆడిన సన్ రైజర్స్ కు ఈ విజయం నిరాశనే మిగిల్చింది. పాయింట్ల పట్టికను పరిశీలిస్తే బెంగళూరు, గుజరాత్, హైదరాబాద్ జట్లు మూడూ చెరో 14 మ్యాచ్ లు ఆడి 9 విజయాలు, 5 ఓటములతో సమానంగా 18 పాయింట్లు సాధించాయి. కానీ పాయింట్లు సమానమైనప్పుడు నెట్ రన్ రేట్ ఇక్కడ కీలకంగా మారింది. బెంగళూరు ప్లస్ 0.783 రన్ రేట్ తో మొదటి స్థానంలో, గుజరాత్ ప్లస్ 0.695 రన్ రేట్ తో రెండో స్థానంలో నిలిచాయి. భారీ విజయం సాధించినా హైదరాబాద్ ప్లస్ 0.524 రన్ రేట్ తో మూడో స్థానానికే పరిమితమైంది. నిబంధనల ప్రకారం పాయింట్ల పట్టికలో మొదటి 2 స్థానాల్లో నిలిచిన జట్లకు



ఫైనల్ చేరేందుకు 2 అవకాశాలు ఉంటాయి. బెంగళూరు, గుజరాత్ జట్లు ఇప్పుడు నేరుగా క్వాలిఫయర్ 1 ఆడతాయి. అందులో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్ చేరుతుంది. మూడో స్థానంలో నిలిచిన సన్ రైజర్స్ హైదరాబాద్ ఇప్పుడు నాలుగో స్థానంలో నిలిచే జట్టుతో ఎలిమినేటర్ మ్యాచ్ ఆడాల్సి ఉంటుంది. ఈ ఎలిమినేటర్ మ్యాచ్ లో గెలిస్తేనే క్వాలిఫయర్ 2 ఆడే అవకాశం దక్కుతుంది. ఒకవేళ ఓడిపోతే మాత్రం నేరుగా టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది. పట్టికలో టాప్ 2 లో నిలిచేందుకు సన్ రైజర్స్ మరింత భారీ తేడాతో గెలవాల్సి ఉండగా.. ఆ అవకాశం త్రుటిలో చేజారిపోయింది.

# పాక్ హాకీ జట్టుకు ఆర్థిక కష్టాలు

**ఇస్లామాబాద్, మే 22 :** పాకిస్థాన్ హాకీ జట్టు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంది. ఆటగాళ్లకు సరైన నిధులు అందించడంలో పాకిస్థాన్ హాకీ సమాఖ్య విఫలమవుతుండటంతో ప్లేయర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పెండింగ్ బకాయిల కోసం ఎదురుచూస్తున్న సమయంలో శిక్షణ శిబిరంలో ఇచ్చే రోజువారీ భత్యాన్ని భారీగా తగ్గించడం వివాదాస్పదంగా మారింది. ప్రాక్టీస్ శిబిరాల సమయంలో ఆటగాళ్లకు అందించే రోజువారీ భత్యాన్ని మూడు వేల పాకిస్థాన్ రూపాయిల నుంచి వెయ్యి పాకిస్థాన్ రూపాయిలకు తగ్గించినట్లు సమాచారం. భారత కరెన్సీలో ఇది సుమారు మూడు వందల ముప్పై ఐదు రూపాయలు మాత్రమే కావడంతో ప్లేయర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న తమకు ఇది అవమానకరమని అభిప్రాయపడుతున్నారు. అంతర్జాతీయ పర్యటనల సమయంలో ఆటగాళ్లు, సహాయక సిబ్బందికి రోజుకు నూట పది డాలర్లు చెల్లిస్తామని పాకిస్థాన్ హాకీ సమాఖ్య ప్రకటించింది. అయితే గతంలో కూడా ఇలాంటి హామీలు ఇచ్చి అమలు చేయలేదని ప్లేయర్లు ఆరోపిస్తున్నారు. తమకు రావాల్సిన బకాయిలు ఇంకా చెల్లించలేదని, ముందుగా పెండింగ్ డబ్బులు ఇచ్చిన తర్వాతే సమాఖ్య మాటలను నమ్ముతామని వారు వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఆగస్టు 15 నుంచి హాకీ ప్రపంచకప్ 2026 ప్రారంభం కానుంది. అందుకు ముందు జూన్ 13 నుంచి 27 వరకు జరిగే హాకీ ప్రో లీగ్ పోటీల్లో పాకిస్థాన్ జట్టు పాల్గొననుంది. ఈ టోర్నీలో బెల్జియం, స్పెయిన్, ఇంగ్లండ్, భారత్ జట్లతో పాకిస్థాన్ తలపడాల్సి ఉంది. ప్రపంచకప్‌కు ముందు జట్టు సన్నద్ధం కావాల్సిన సమయంలో ఆటగాళ్లు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవడం ఆ దేశ హాకీ పరిస్థితిని ప్రతిబింబిస్తోందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# సీఎస్కే వైఫల్యాలపై సెహ్వాగ్ వ్యాఖ్యలు

**చెన్నై, మే 22 :** ఐపీఎల్ 2026లో చెన్నై జట్టు ప్రయాణం ప్లే ఆఫ్స్‌కు ముందే ముగియడంపై భారత మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ తీవ్రంగా స్పందించాడు. గుజరాత్ చేతిలో కీలక మ్యాచ్‌లో ఘోర పరాజయం పాలవడంతో చెన్నై వరుసగా మూడోసారి తొలి నాలుగు స్థానాల్లో నిలవలేకపోయింది. ఈ సీజన్‌లో జట్టు ప్రదర్శనపై అభిమానులు, మాజీ ఆటగాళ్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చెన్నై జట్టు ఈసారి ఎదుర్కొన్న అతిపెద్ద సమస్య బ్యాటింగ్ విభాగమని సెహ్వాగ్ అభిప్రాయపడ్డాడు. మహేంద్ర సింగ్ ధోని, డేవాల్డ్ బ్రెవిస్, ఆయుష్ మాత్రే, ఖలీల్ అహ్మద్ వంటి కీలక ఆటగాళ్లు గాయాల కారణంగా జట్టుకు దూరమవడం ప్రభావం చూపిందని పేర్కొన్నాడు. ముఖ్యంగా ధోని లేకపోవడం జట్టులో స్పష్టంగా కనిపించిందని వ్యాఖ్యానించాడు. అయితే ప్రధాన సమస్య మాత్రం బ్యాటర్లలో నిలకడ లేకపోవడమేనని సెహ్వాగ్ తెలిపాడు. ఇతర జట్లతో పోలిస్తే చెన్నై బ్యాటర్లు స్థిరంగా పరుగులు



చేయలేకపోయారని, 180 నుంచి 190 పరుగుల లక్ష్యాలను ఛేదించడంలో విఫలమయ్యారని పేర్కొన్నాడు. తొలుత బ్యాటింగ్ చేసిన సందర్భాల్లో కూడా జట్టు 160 పరుగుల వద్దే ఆగిపోయిందని గుర్తు చేశాడు. ముఖ్యంగా మధ్య వరుస బ్యాటర్లు పూర్తిగా నిరాశపరిచారని సెహ్వాగ్ విమర్శించాడు. గత సీజన్‌లో ఆకట్టుకున్న డేవాల్డ్ బ్రెవిస్ ఈసారి అంచనాలకు తగ్గట్టు రాణించలేకపోయాడని అన్నాడు. సర్ఫరాజ్ ఖాన్, ఆయుష్ మాత్రే, ఉర్విల్ పటేల్ వంటి ఆటగాళ్లు కూడా నిలకడగా ఆడలేకపోయారని వివరించాడు. బౌలింగ్ విభాగం కూడా ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేదని అభిప్రాయపడ్డాడు. ఐదుసార్లు టైటిల్ గెలిచిన చెన్నై జట్టు చివరిసారిగా 2023లో మహేంద్ర సింగ్ ధోని నాయకత్వంలో ట్రోఫీని అందుకుంది. అయితే ఈ సీజన్‌లో ధోని ఒక్క మ్యాచ్ కూడా ఆడకపోవడం జట్టుకు పెద్ద దెబ్బగా మారింది. ప్రస్తుతం జట్టు మార్పుల దశలో ఉందని, కొత్త ఆటగాళ్లు నిలకడ సాధించేందుకు సమయం అవసరమని కోచ్ ఇప్పటికే వెల్లడించిన విషయం తెలిసిందే.

# 'పెద్ది' పాట ప్రోమోకు భారీ స్పందన



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న భారీ చిత్రం 'పెద్ది'పై రోజురోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. గ్రామీణ నేపథ్యంలో రూపొందుతున్న ఈ క్రీడా ప్రధాన కథా చిత్రం కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార కార్యక్రమాలను చిత్రబృందం మరింత వేగవంతం చేసింది. రేపు భోపాల్‌లో భారీ స్థాయిలో సంగీత వేడుక నిర్వహించనున్న నేపథ్యంలో చిత్రబృందం అభిమానులకు ప్రత్యేక సర్‌ప్రైజ్ ఇచ్చింది. సినిమాలోని ప్రత్యేక గీతం "హెల్లల్లలో" పాటకు సంబంధించిన ప్రోమోను విడుదల చేసింది. ఈ ప్రోమోలో రామ్ చరణ్, శృతి హాసన్ వేసిన ఉత్సాహభరితమైన స్టెప్పులు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. విడుదలైన కొద్ది సేపటికే ఈ ప్రోమో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. పూర్తి పాటను మార్చి 23న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ ప్రత్యేక గీతానికి ప్రముఖ గేయరచయిత అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా, ప్రపంచ ప్రఖ్యాత సంగీత దర్శకుడు ఏ.ఆర్. రెహమాన్ సంగీతాన్ని సమకూర్చారు. రెహమాన్ సంగీతం అంటేనే ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన ఆసక్తి ఉంటుంది. అందులోనూ ఇది ప్రత్యేక గీతం కావడంతో ఈ పాటపై భారీ అంచనాలు నెలకొన్నాయి. రేపు జరగనున్న సంగీత వేడుకలో ఈ పాటను అధికారికంగా విడుదల చేయనున్నారు. ఇక ఈ పాటలో మరో కథానాయిక కూడా కనిపించనున్నట్లు సామాజిక మాధ్యమాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే ఆమె ఎవరు అన్న విషయాన్ని మాత్రం చిత్రబృందం గోప్యంగా ఉంచింది. దీంతో అభిమానుల్లో ఆసక్తి, ఉత్కంఠ మరింత పెరిగింది. భారీ నిర్మాణ విలువలతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో శివరాజ్ కుమార్, జగపతి బాబు, బొమన్ ఇరానీ, దివ్యేందు శర్మ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వృద్ధి సినిమాస్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. వచ్చే ఏడాది జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొనగా, ఇప్పుడు "హెల్లల్లలో" పాటతో మరింత చర్చనీయాంశంగా మారింది.



# వినాయక చవితికి జైలర్-2?

'టైగర్ కా హుకుం'.. అంటూ ముత్తువేల్ పాండియన్‌గా మరోమారు బాక్సాఫీస్ బరిలో సందడి చేయనున్నారు కథానాయకుడు రజనీకాంత్. ఆయన 'జైలర్'లో ఇదే పాత్రతో అందర్నీ అలరించిన సంగతి తెలిసిందే. ఇప్పుడీ విజయవంతమైన సినిమాకి కొనసాగింపుగా 'జైలర్ 2' సిద్ధమైంది. నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కించిన ఈ పాన్ ఇండియా చిత్రాన్ని సన్‌పిక్చర్స్ సంస్థ నిర్మించింది. మోహన్‌లాల్, శివ రాజ్‌కుమార్ తదితరులు ప్రత్యేక పాత్రలు పోషించారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమాని వినాయక చవితి సందర్భంగా సెప్టెంబరు రెండో వారంలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. దీని కోసం రెండు తేదీల్ని పరిశీలిస్తున్నట్లు తెలిసింది. దీనికి తగ్గట్లే ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్ని వేగవంతం చేసినట్లు తెలుస్తోంది. త్వరలోనే విడుదల తేదీపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది. ఈ యాక్షన్ థ్రిల్లర్ చిత్రానికి అనిరుధ్ సంగీతమందిస్తుండగా.. విజయ్ కార్తిక్ కన్నన్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరించారు.



# దిశా పఠాని ఫిట్‌నెస్ సీక్రెట్స్ ఇవే..

బాలీవుడ్ నటి దిశా పఠాని తన ఫిట్‌నెస్, కండరాల దృఢత్వం కోసం అనుసరించే వ్యాయామాల గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించింది. తక్కువ బరువులతో ఎక్కువ రెప్స్ చేయడం కంటే, ఎక్కువ బరువులతో తక్కువ రెప్స్ చేయడం వల్ల కండరాల బలం వేగంగా పెరుగుతుందని ఆమె తెలిపింది. కేవలం బరువు తగ్గడానికే కాదు, శారీరకంగా మరియు మానసికంగా ఆరోగ్యంగా ఉండేందుకు కూడా క్రమం తప్పకుండా వర్కవుట్స్ చేయడం ఎంతో అవసరమని పేర్కొంది. దిశా ప్రకారం, కండరాల పెరుగుదల మరియు అప్పర్ బాడీ బలం కోసం "షోల్డర్ ప్రెస్" అత్యుత్తమ వ్యాయామాల్లో ఒకటి. ఈ వ్యాయామాన్ని నిల్చుని లేదా కూర్చుని చేయవచ్చని ఆమె చెప్పింది. రెండు చేతుల్లో డంబెల్స్ పట్టుకుని చేతులను పైకి ఎత్తి మళ్లీ కిందికి దించుతూ చేసే ఈ వ్యాయామం భుజాలు, చేతులు, కోర్ మజిల్స్‌పై మంచి ప్రభావం చూపిస్తుందని వివరించింది. అలాగే, హెవీ వర్కవుట్స్‌కు ముందు వామప్ చేయడం తప్పనిసరి అని దిశా సూచించింది. ఏరోబిక్ వ్యాయామాలు, స్ట్రెచింగ్‌లతో శరీరాన్ని ముందుగా సిద్ధం చేయడం వల్ల గుండె వేగం, శరీర ఉష్ణోగ్రత సరిగ్గా నియంత్రణలో ఉంటాయని తెలిపింది. దీంతో గాయాల ప్రమాదం కూడా తగ్గుతుందని పేర్కొంది. పర్ఫెక్ట్ యాబ్స్ కోసం "క్రంచెస్" ఎంతో ఉపయోగపడతాయని ఆమె చెప్పింది. మ్యాట్‌పై పడుకుని మోకాళ్లను పైకి ఎత్తి, చేతులను తల వెనుక ఉంచుకుని నెమ్మదిగా పైకి లేస్తూ చేసే ఈ వ్యాయామం పొట్ట చుట్టూ ఉన్న కొవ్వును తగ్గించడంలో సహాయపడుతుందని వివరించింది. క్రమం తప్పకుండా ఈ వ్యాయామం చేయడం వల్ల కడుపు భాగం దృఢంగా మారుతుందని తెలిపింది. ఫిట్‌నెస్ ప్రయాణంలో "సెల్ఫ్ మోటివేషన్" చాలా ముఖ్యమని దిశా పఠాని అభిప్రాయపడింది. ప్రతి రోజు చేసే వ్యాయామాలను ఫోటోలు లేదా వీడియోల రూపంలో రికార్డ్ చేసుకుంటే, కాలక్రమంలో శరీరంలో వచ్చిన మార్పులు స్పష్టంగా కనిపిస్తాయని చెప్పింది. అవే మరింత కష్టపడేందుకు ప్రేరణ ఇస్తాయని తెలిపింది. మహిళలు బరువులు ఎత్తితే మగవారిలా మారిపోతారనేది పూర్తిగా అపోహ మాత్రమేనని దిశా స్పష్టం చేసింది. సరైన శిక్షణ, సరైన ఆహారంతో హెవీ వర్కవుట్స్ చేయడం వల్ల మహిళలు మరింత ఫిట్‌గా, బలంగా మారతారని పేర్కొంది. క్రమశిక్షణతో వ్యాయామం చేస్తే ఆరోగ్యకరమైన జీవనశైలిని సులభంగా సాధించవచ్చని సూచించింది.

# '1 నేనొక్కడినే'

## రీ-రిలీజ్‌కు భారీ రెస్పాన్స్

సమ్మర్ సీజన్‌లో పెద్ద సినిమాల విడుదలలు లేకపోవడంతో టాలీవుడ్‌లో రీ-రిలీజ్‌ల ట్రెండ్ మరింత ఊపందుకుంది. స్టార్ హీరోల పాత సూపర్ హిట్ చిత్రాలను మళ్లీ థియేటర్లలో చూసేందుకు అభిమానులు ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో, సూపర్ స్టార్ మహేశ్ బాబు కెరీర్‌లో ప్రత్యేక గుర్తింపు పొందిన '1 నేనొక్కడినే' చిత్రం మరోసారి వెండితెరపై సందడి చేయడానికి సిద్ధమవుతోంది. ఈ సినిమాను అత్యాధునిక 4కే అల్ట్రా హెచ్‌డీ ఫార్మాట్‌లో, మెరుగైన సౌండ్ క్వాలిటీతో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రీ-రిలీజ్ చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. లెజెండరీ నటుడు సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా మే 31న ఈ చిత్రాన్ని మళ్లీ ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన స్పెషల్ 4కే ట్రైలర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ట్రైలర్ చూసిన అభిమానులు థియేటర్లలో మరోసారి మహేశ్ మ్యాజిక్ చూడబోతున్నామని ఉత్సాహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గౌతమ్ ఘట్టమనేని పాత్రకు సంబంధించిన సన్నివేశాలు అభిమానులను మరింత ఆకట్టుకుంటున్నాయి. క్రియేటివ్ దర్శకుడు సుకుమార్ తెరకెక్కించిన ఈ చిత్రం 2014 సంక్రాంతి కానుకగా విడుదలైంది. అప్పట్లో తెలుగు సినీ ప్రేక్షకులకు సరికొత్త సైకాలజికల్ థ్రిల్లర్ అనుభూతిని అందించిన ఈ సినిమా విడుదల సమయంలో ఆశించిన స్థాయిలో వాణిజ్య విజయం సాధించకపోయినా, కాలక్రమేణా కల్ట్ క్లాసిక్‌గా గుర్తింపు తెచ్చుకుంది. మైండ్ గేమ్ థ్రిల్లర్ కథనం, క్లిష్టమైన స్క్రీన్‌ప్లే, మహేశ్ బాబు నటన ఈ చిత్రాన్ని ప్రత్యేక స్థాయికి తీసుకెళ్లాయి.సినిమాలో మహేశ్ బాబు సరసన బాలీవుడ్ నటి కృతి సనన్ కథానాయికగా నటించగా, ఆమెకు ఇదే తొలి తెలుగు చిత్రం. అలాగే మహేశ్ బాబు తనయుడు గౌతమ్ ఘట్టమనేని చిన్నప్పటి మహేశ్ పాత్రలో కనిపించి ప్రేక్షకులను మెప్పించాడు. 14 రీల్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట, అనిల్ సుంకర ఈ చిత్రాన్ని నిర్మించారు. ప్రస్తుతం టాలీవుడ్‌లో రీ-రిలీజ్ సినిమాలకు వస్తున్న స్పందన దృష్ట్యా '1 నేనొక్కడినే' కూడా మరోసారి థియేటర్లలో భారీ హంగామా సృష్టించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా మహేశ్ అభిమానులు ఈ చిత్రాన్ని పెద్ద ఎత్తున సెలబ్రేట్ చేసేందుకు సిద్ధమవుతున్నారు.



# కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఐశ్వర్యారాయ్

సందడిగా జరిగే కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఐశ్వర్యారాయ్ ఎప్పుడూ హైలైట్‌గా నిలుస్తుంటారు. అయితే ఈసారి ఆమె ఈ వేడుకకు హాజరుకావడం లేదంటూ కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. వీటికి చెక్ పెడుతూ ఈ బ్యూటీ తన కుమార్తెతో కలిసి ఫ్రాన్స్‌కు బయల్దేరారు. దీంతో కేన్స్‌లో చివరిరోజు ఐశ్వర్య సందడి చేయనున్నట్లు తెలుస్తోంది. ఒక ప్రముఖ బ్రాండ్ తరఫున ప్రతి ఏటా కేన్స్ రెడ్ కార్పెట్‌పై హొయలొలికించే ఐశ్వర్య ఈసారి ప్రచార చిత్రాల్లో కనిపించకపోవడంతో రూమర్స్ మొదలయ్యాయి. ఆమెకు బదులుగా ఈసారి బాలీవుడ్ నటి అలియా వెళ్లారంటూ కథనాలు వచ్చాయి. దీంతో అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. తాజాగా ఆమె ముంబయి ఎయిర్‌పోర్ట్‌లో కనిపించడంతో వాళ్లు సంబరపడుతున్నారు. ఈసారి ఈ కేన్స్ క్వీన్ ఎలాంటి లుక్స్‌తో మెస్మరైజ్ చేయనున్నారో అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మొదటిసారి 2002లో కేన్స్‌కు వెళ్లిన ఐష్.. అప్పటినుంచి ప్రతి ఏడాది తన ప్రత్యేకమైన దుస్తులతో మెరుస్తూనే ఉన్నారు. గతేడాది కూడా భారతీయత ఉట్టిపడేలా చీరతో వచ్చిన ఆమె.. నుదుటిన సింధూరంతో అందరి దృష్టిని ఆకర్షించారు. పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు కేన్స్ వేదికగా తన లుక్‌తో మద్దతు ఇచ్చి సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్‌గా నిలిచారు.



Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 7036644111, 9490140565

# ఆస్కార్ స్థాయి నటుడు జగన్

- తల్లిని, చెల్లిని గెంటేసిన మహానుభావుడు
- రాజకీయం కోసం కుట్రలు, నాటకాలు అలవాటు
- మంత్రి లోకేశ్ ఘాటు విమర్శలు



**అమరావతి, మే 22:** మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అద్భుత నటుడని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. సినిమాల్లో నటిస్తే జగన్‌కు కచ్చితంగా ఆస్కార్ అవార్డ్ వస్తుందని ఎద్దేవా చేశారు. ఆస్తి కోసం



సొంత తల్లి, చెల్లిని బయటకు గెంటేశారని.. ఇంకో చెల్లి తండ్రిని చంపి అన్యాయం చేశారంటూ మంత్రి ఆరోపించారు. సొంత జిల్లా ప్రజలను మోసం చేశారని.. సొంత బాబాయిని లేపేసి నెపం టీడీపీపై నెట్టారని మండిపడ్డారు. వైఎస్ఆర్ కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నేతలతో లోకేశ్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. వైఎస్ వివేకాది గుండెపోటు కాదని.. గొడ్డలి పోటు అంటూ ఆరోపణలు గుప్పించారు. గతంలో జగన్ కోడికత్తి, గులకరాయి డ్రామాలు చూశామని.. మొన్న కడపలోనూ అలాంటి కుట్రే జరిగిందన్నారు. మతాల మధ్య చిచ్చుపెట్టాలని చూశారని.. తప్పు చేసిన ఎవరినీ వదిలిపెట్టేది లేదని మంత్రి లోకేశ్ హెచ్చరించారు. రప్పా, రప్పా అంటే భయపడేవారు ఎవరూ లేరని.. మీ నాయకుడిని, వారి తండ్రినీ చూశామని వైసీపీ కార్యకర్తలకు చురకలు అంటించారు. ప్పా, రప్పాకు ఎండ్ కార్డ్ వేసే బాధ్యత తనదంటూ మంత్రి లోకేశ్ తేల్చి చెప్పారు. రెడ్ బుక్ అంటేనే భయపడుతున్నారని.. చివరకు ఎర్ర కారు చూసినా బెదిరిపోతున్నారని వైసీపీ నేతలపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. జగన్ రెడ్డి వారంలో ఒక రోజు మాత్రమే ఏపీలో ఉంటున్నారని.. మూడు రోజులు బెంగళూరులో, మరో మూడు రోజులు హైదరాబాద్‌లో ఉంటున్నారని లోకేశ్ తెలిపారు. జగన్‌కు సీసీడీ (క్రెడిట్ చోరీ డిజార్డర్) వ్యాధి ఉందని.. వైసీపీ కుట్రలపై అందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. సందర్భంగా గండికోట నిర్వాసితులకు న్యాయం చేస్తామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు. రాబోయే రోజుల్లో జమ్మలమడుగుకు అనేక పరిశ్రమలు వస్తాయని తెలిపారు. రాయలసీమ స్టీల్ ఎ÷-లాంట్‌ను 2029 నాటికి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కష్టకాలంలో పసుపుజెండాకు అండగా నిలబడిన వ్యక్తి భూపేశ్ రెడ్డి అని మంత్రి ప్రశంసించారు. ఆయనకు మాటలు తక్కువ.. చేతలు ఎక్కువని కొనియాడారు. జమ్మలమడుగు జోష్ అదిరిపోయిందని.. గండికోటను, టీడీపీని ఎవరూ టచ్ చేయలేరని మంత్రి లోకేశ్ తేల్చి చెప్పారు.

# హత్యారాజకీయాలు జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య

- జగన్ చరిత్ర తెలిసిన వారికి ఇవన్నీ అర్థం అవుతాయి
- వైఎస్ మరణం, వివేకా మరణంపై జగన్‌వైపే అనుమానాలు
- జగన్ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించిన మంత్రి అచ్చన్నాయుడు



**అమరావతి, మే 22:** హత్యా రాజకీయాలు, అక్రమాల్లో ఆరితేరిన ఘనుడు జగన్ అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయన చరిత్ర చూస్తే ఇదే కనిపిస్తుందని అన్నారు. ఇటీవల వైఎస్ జగన్ ఇమీడియా సమావేశంలో చేసిన కొన్ని సంచలన వ్యాఖ్యలపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయి-ంలో విరుచుకుపడ్డారు. తమ కుటుంబంలో జరిగిన మరణాలకు సీఎం చంద్రబాబు నాయుడే కారణమంటూ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ప్రవర్తన చూస్తుంటే 'అపరిచితుడు' సినిమా పాత్ర గుర్తుకొస్తోందని ఎద్దేవా చేశారు. వైఎస్ జగన్ తాత వైఎస్ రాజారెడ్డిని ఎందుకు హత్య చేశారో ఈ రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరికీ తెలుసని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. వైఎస్ కుటుంబం నడిపిన దమనకాండను, అరాచకాలను ఆనాటి బాధితుడు పార్థసారథిరెడ్డి స్వయంగా వివరించారని గుర్తుచేశారు. రాజారెడ్డి హత్య కేసులో నిందితులుగా ఉన్న వారందరినీ కాలక్రమేణా తుదముట్టించారు. అయితే, రాజారెడ్డి హత్యకేసులో ఉన్న వ్యక్తి ఇవాళ వైసీపీలోనే కొనసాగుతుండటం.. జగన్ ద్వంద్వ నీతికి నిదర్శనమని విమర్శించారు. వైఎస్ కుటుంబానికి ఉన్న క్రూరత్వం, అరాచకాల చరిత్ర ప్రస్తుత తరానికి పూర్తిగా తెలియాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అసెంబ్లీలో చంద్రబాబు నాయుడు మాట్లాడిన రెండు రోజులకే వైఎస్ రాజశేఖరరెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో చనిపోయారంటూ జగన్ చేస్తున్న ప్రచారం సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించారు. ఆనాడు అసెంబ్లీలో చంద్రబాబు మాట్లాడిన మాటల అసలు సందర్భాన్ని వివరిస్తూ.. తిరుమల వేంకటేశ్వర స్వామికి ఎవరైనా కీడు తలపెడితే వారికి ఎప్పటికీ మంచి జరగదు అని మాత్రమే చంద్రబాబు అన్నారని గుర్తు చేశారు. ఆ మాటలను జగన్ ఇవాళ తన స్వార్థం కోసం వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. గతంలో వైఎస్సార్ మరణం వెనుక 'రిలయన్స్' సంస్థ పాత్ర ఉందంటూ నానా హంగామా చేసి.. ఇప్పుడు చంద్రబాబును లాగడంలో అర్థం లేదన్నారు. ఇప్పటికైనా జగన్ ఇలాంటి వక్రీకరణలు మానుకోవాలని హితవు పలికారు. జగన్ బాబాయ్, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి ఎలా చనిపోయారో, ఆ హత్య వెనుక ఎవరున్నారో రాష్ట్ర ప్రజలందరికీ స్పష్టంగా తెలుసని అచ్చెన్నాయుడు అన్నారు. మొదట గుండెపోటు అని నమ్మించే ప్రయత్నం చేసి, ఆపై గొడ్డలితో నరికి చంపిన చరిత్ర వారిదేనని, అందుకే వైసీపీని తాము 'గొడ్డలి పార్టీ' అని పిలుస్తున్నామని స్పష్టం చేశారు. ఐదేళ్లు అధికారంలో ఉండి కూడా వివేకా హంతకులను ఎందుకు పట్టుకోలేకపోయారో జగన్ సమాధానం చెప్పాలని నిలదీశారు. వివేకానంద కూతురు సునీతను అడిగితే నిజాలు చెబుతుందన్నారు. హత్యారాజకీయాల్లో ఆరితేరిన జగన్ వైఎస్ మరణంలోనూ పాత్ర ఉందని ఆనాడు లోకం కోడై కూసిందన్నారు.

## గోమాతను జాతీయ జంతువుగా ప్రకటించాలి

**మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు**



**అమరావతి, మే 22** : మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫరూక్ షిబ్లీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోసంరక్షణ పేరుతో జరుగుతున్న హింస ఆగాలి అన్న, దేశంలో మతసామ-రస్యం పెరగాలన్న ఆవును (గోమాతను) జాతీయ జంతువుగా ప్రకటించాలి అని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ముస్లిం సోదరులు మన మెజారిటీ హిందూ సోదరుల మనోభావాలను గౌరవిస్తూ ఆవు వధను పూర్తిగా మానుకోవాలని అలాగే ఎవరైతే రైతులు ఆవులను అమ్మకానికి తరలిస్తున్నారో వారిలో అత్యధిక శాతం రైతులు హిందూ మతస్తులు ఉంటారని అలా అమ్మకానికి తీసుకుని వచ్చిన రైతుల వీడియోలను ముస్లిం సోదరులు వీడియో రికార్డు చేసి చట్టానికి పట్టించాలని షిబ్లీ పిలుపునిచ్చారు. "బక్రీద్ పండగ సందర్భంగా ఖుర్బానీ కోసం జంతువుల కొనుగోలు, అమ్మకాల రూపంలో ముస్లిం సమాజం తరపున వేల కోట్ల రూపాయల ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నాయి. అయితే గోసంరక్షణ పేరుతో జంతువులను లాక్కోవడం, ముస్లిం సమాజంపై చిత్రహింసలు చేయడం పరిపాటిగా మారింది. కావున ఆవును కొనడం గానీ, అమ్మడం గానీ పూర్తిగా నిరోధించాలంటే, ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు."

# నీచ రాజకీయాలు జగన్‌కు అలవాటే..

**తండ్రి శవం ఉండానే సిఎం కోసం పైరవీ**

**ఐదేళ్ల పాలనలో ఎపిని భ్రష్టు పట్టించిన ఘనుడు**

**విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శలు**

**అమరావతి, మే 22:** వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాజకీయ లబ్ది కోసం ఎంతటి నీచానికైనా దిగుతారని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సొంత తండ్రి మరణాన్ని సైతం రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం జగన్‌కే చెల్లిందని, ఆయన వైఖరి అత్యంత బాధాకరమని విమర్శించారు. అమరావతిలో మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. జగన్ గత ఐదేళ్ల పాలనపై, ఆయన రాజకీయ శైలిపై నిప్పులు చెరిగారు. తండ్రి చావును కూడా రాజకీయ ప్రయోజనాలకు జగన్ వాడుకోవటం బాధాకరం. 5ఏళ్లు సీఎంగా ఉండి తండ్రి, బాబాయ్ హత్యపై అనుమానాలు ఎందుకు నివృత్తి చేయలేదు. అధికాకంలో ఉన్నప్పుడు అహంకారంతో వ్యవహరించి, ఇప్పుడు అధికారం పోయేసరికి ప్రజల్లో సానుభూతి కోసం 'బీద ఏడుపులు' ఏడవడం జగన్‌కే చెల్లిందన్నారు. ప్రజల్లో సానుభూతి పొందే ఆలోచనలు విరమించుకుని, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యమైతే జగన్ కే మంచిది. జగన్ పరిపాలన, అరాచకాలను అసహ్యించుకునే.. 2024 ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పారు. చంద్రబాబు నిర్ణయాలు నేటి తరంతో పాటు భవిష్యత్తు తరాలకూ ఉపయోగపడేలా ఉంటాయి. మూడు రాజధానులంటూ ప్రజల్లో తిరస్కరణకు గురయ్యారు.. ఇప్పుడు అమరావతి అభివృద్ధి చూసి



ఓర్వలేక మావిగన్ అంటూ వితండవాదం చేస్తున్నారు. రాష్ట్రానికి, రాష్ట్రప్రజలకూ నష్టం చేసే నిలకడలేని జగన్ మాటలను ఎవరూ విశ్వసించరని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అమరావతి నిర్మాణంతో జగన్ తట్టుకోలేక పోతున్నారని మండిపడ్డారు.



# జూలై నుంచే అందుబాటులోకి భోగాపురం ఎయిర్‌పోర్ట్

**అక్కడి నుంచే విమాన సర్వీసుల రాకపోకలు**

**అమరావతి, మే 22:** జులై 8వ తేదీ నుంచి భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు విమానాశ్రయం అందుబాటులోకి రానుంది. జులై 5వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ భోగాపురం విమానాశ్రయాన్ని ప్రారంభించే అవకాశం ఉంది. జులై 8వ తేదీ నుంచి తమ విమానాలన్నీ భోగాపురం నుంచే నడుస్తాయని పలు విమానయాన సంస్థలు ఇప్పటికే ప్రకటించాయి. జులై 8వ తేదీ నుంచి అల్లూరి సీతారామరాజు విమానాశ్రయానికి రావాలని ఇప్పటికే తమ ప్రయాణికులకు సర్క్యులర్లు జారీ చేశాయి. 2026 జూలై 8వ తేదీ నుంచి స్కూట్ ఎయిర్‌లైన్స్‌కు సంబంధించిన అన్ని విమానాలు విశాఖపట్నం విమానాశ్రయం నుంచి కాకుండా.. కొత్తగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి నడుస్తాయని స్కూట్ ఎయిర్‌లైన్స్ సర్క్యులర్ జారీ చేసింది. విమానాశ్రయం మారినప్పటికీ, ఎయిర్‌పోర్ట్ కోడ్ '÷జి' గానే కొనసాగుతుందని తెలిపింది. చెక్-ఇన్ కౌంటర్లు, స్కూట్ ఎయిర్‌లైన్స్ కౌంటర్లు కొత్త విమానాశ్రయంలోని టెర్మినల్ 1 లోపల ఉంటాయని విమానయాన సంస్థ వెల్లడించింది. విమానం బయలుదేరే సమయానికి 2.5 గంటల (150 నిమిషాలు) ముందే చెక్-ఇన్ కౌంటర్లు తెరవబడతాయని తెలిపింది. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం (భోగాపురం) విశాఖపట్నం సిటీ సెంటర్ నుంచి సుమారు 50 కిలోమీటర్ల దూరంలో ఉంది. ప్రయాణికులు ఎలాంటి ఆలస్యం లేకుండా చెక్-ఇన్ పక్రియలను పూర్తి చేసుకోవడానికి.. విమానం టైం కంటే కనీసం 120 నిమిషాల ముందే ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోవాలని స్కూట్ ఎయిర్ లైన్స్ సంస్థ సూచించింది.

# రెండో వారం నో వెహికల్ డే పాటించిన నిమ్మల

**పాలకొల్లు నుంచి రైలులో విజయవాడకు రాక**

**అక్కడి నుంచి సైకిల్‌పై పార్టీ కార్యాలయానికి చేరిక**



**పాలకొల్లు, మే 22:** రెండో వారం నో వెహికల్ డే సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు రైలులో ప్రయాణించారు. శుక్రవారం పాలకొల్లు నుంచి ట్రైన్‌లో సాధారణ ప్రయాణికులతో కలిసి విజయవాడకు మంత్రి చేరుకున్నారు. రామవరప్పాడు రైల్వే స్టేషన్ నుంచి మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయం వరకు సైకిల్‌పై వెళ్లారు. వరుసగా రెండో వారం కూడా నో వెహికల్ డే సందర్భంగా సుమారు 18 కిలోమీటర్ల మేర మంత్రి నిమ్మల సైకిల్ తొక్కారు. తాడేపల్లి దగ్గర నిమ్మలకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ స్వాగతం పలికారు. ఒకే సైకిల్‌పై ఇద్దరూ కూడా పార్టీ కార్యాలయానికి వెళ్లారు. జగన్ ఒక పిచ్చి తుగ్లక్ అంటూ మంత్రి నిమ్మల రామానాయుడు వ్యాఖ్యానించారు. పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. జగన్ మావిగన్ అంటే కూటమి భయపడటం లేదని.. ప్రజలే భయపడు తున్నారని తెలిపారు. అధికారం కోసం జగన్ ఎంతకైనా తెగిస్తారని మండిపడ్డారు. హత్యా రాజకీయాలు జగన్‌కు అలవాటన్నారు. అమరావతిలో జరుగుతున్న పనులు చూసి వైసీపీ అధినేతకు భయం మొదలైందని.. అందుకే అమరావతిపై విషం కక్కుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ మళ్లీ సీఎం అయితే పొట్టేలు తలల స్థానంలో ప్రజల తలలు నరుకుతారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌కు 11 సీట్లు కూడా రావని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.

# తిరుమలలో భక్తుల రద్దీ

**అభిషేకసేవలో సామాన్యులకు దర్శనం**

**తిరుమల, మే 22:** తిరుమలలో రద్దీ కారణంగా సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇచ్చేందుకు టైం మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించినట్లు అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. గురువారం రికార్డు స్థాయిలో 79 వేల మంది భక్తులకు దర్శన భాగ్యం కల్పించినట్లు ఆయన చెప్పారు. శుక్రవారం అభిషేక సేవ సమయంలో సామాన్య భక్తులను దర్శనానికి అనుమతించామన్నారు. అభిషేక సేవ సమయంలో 5850 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా తితిదే కీలక నిర్ణయం తీసుకుంది. శ్రీవారి అభిషేక సేవ సమయంలో సామాన్య భక్తులను శ్రీవారి దర్శనానికి అనుమతించింది. గతేడాది వేసవిలోనూ అభిషేక సమయంలో భక్తులకు స్వామివారి దర్శనభాగ్యం కల్పించింది.



## తగ్గిన బంగారం ధరలు.. మళ్లీ పెరిగిన వెండి

**హైదరాబాద్, మే 22 :** గత కొన్ని రోజులుగా వరుసగా పెరుగుతున్న బంగారం ధరలు నేడు కాస్త తగ్గుముఖం పట్టాయి. అయితే వెండి ధరలు మాత్రం మరోసారి భారీగా పెరిగాయి. దేశవ్యాప్తంగా ఆభరణాల కొనుగోలుదారులు, పెట్టుబడిదారులు మార్కెట్ ధరలపై ఆసక్తిగా గమనిస్తున్నారు. హైదరాబాద్‌లో నేడు ఉదయం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.440 తగ్గి రూ.1,59,490కు చేరుకుంది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.400 తగ్గి రూ.1,46,200 వద్ద కొనసాగుతోంది. మరోవైపు వెండి ధర మాత్రం భారీగా పెరిగింది. కిలో వెండి ధర ఒక్కరోజులోనే రూ.5 వేల మేర ఎగబాకి రూ.2.95 లక్షలకు చేరుకుంది. విజయవాడ మార్కెట్‌లో కూడా దాదాపు ఇదే స్థాయి ధరలు నమోదయ్యాయి. దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో కూడా బంగారం ధరల్లో స్వల్ప మార్పులు కనిపించాయి. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,61,240గా ఉండగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,47,800 వద్ద కొనసాగుతోంది. ముంబైలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,59,490గా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,46,200గా ఉంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,59,640గా ఉండగా, 22 క్యారెట్ల ధర రూ.1,46,250 వద్ద కొనసాగుతోంది. వెండి ధరలు దేశవ్యాప్తంగా మరింత బలంగా కొనసాగుతున్నాయి. పలు నగరాల్లో కిలో వెండి ధర రూ.2.85 లక్షల నుంచి రూ.2.95 లక్షల మధ్య ట్రేడ్ అవుతోంది. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావం, డిమాండ్ పెరగడం, డాలర్ మారకపు విలువల మార్పులు వంటి అంశాలు ధరలపై ప్రభావం చూపుతున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, మే 22 :** భారతీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం నాటి ట్రేడింగ్‌ను లాభాలతో ముగించాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాలు, బ్యాంకింగ్ రంగ షేర్లలో కనిపించిన కొనుగోళ్ల మద్దతుతో మార్కెట్లు రోజంతా పాజిటివ్ ధోరణిలో కొనసాగాయి. నేటి ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 231.99 పాయింట్లు లాభపడి 75,415.35 వద్ద స్థిరపడింది. అలాగే ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 సూచీ 64.60 పాయింట్లు పెరిగి 23,719.30 వద్ద ముగిసింది. ట్రేడింగ్ సమయంలో సెన్సెక్స్ 75,810.97 గరిష్ఠ స్థాయిని తాకగా, నిఫ్టీ 23,835.65 వరకు ఎగసింది. బ్యాంకింగ్ రంగ షేర్లు మార్కెట్‌కు ప్రధాన బలంగా నిలిచాయి. బ్యాంక్ నిఫ్టీ ఈ వారంలో 52,800 స్థాయిల వద్ద బలమైన మద్దతు పొందడంతో బ్యాంకింగ్ రంగంలో కరెక్షన్ దశ ముగిసినట్లు సంకేతాలు కనిపిస్తున్నాయని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల అమ్మకాలు కూడా మార్కెట్‌ను ప్రభావితం చేసే స్థాయిలో లేకపోవడం పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని పెంచింది. ఈరోజు ట్రేడింగ్‌లో బ్యాంకింగ్, ఆటోమొబైల్, బ్యాంకేతర ఆర్థిక సంస్థల రంగాలకు చెందిన షేర్లలో కొనుగోళ్లు బలంగా కనిపించాయి. మరోవైపు ఔషధ, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో స్వల్ప లాభాల స్వీకరణ చోటుచేసుకుంది. సమాచార సాంకేతిక రంగ షేర్లలో వరుసగా మూడో రోజు కూడా లాభాల స్వీకరణ కొనసాగింది. పెద్ద కంపెనీల షేర్లతో పోలిస్తే మధ్య తరహా, చిన్న తరహా కంపెనీల సూచీలు మాత్రం కొంత వెనుకంజలో కనిపించాయి. మొత్తం మీద దేశీయ మార్కెట్లు స్థిరమైన కొనుగోళ్ల మద్దతుతో వారాంతాన్ని సానుకూలంగా ముగించాయని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## అరబిందోకు లాభాల జోష్

**న్యూఢిల్లీ, మే 22 :** దేశీయ ప్రముఖ ఔషధ తయారీ సంస్థ అరబిందో ఫార్మా 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన నాలుగో త్రైమాసిక ఫలితాల్లో ఆశాజనక ప్రదర్శన కనబరిచింది. మార్చితో ముగిసిన మూడు నెలల కాలానికి కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం రూ.920.84 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన రూ.902.83 కోట్ల లాభంతో పోలిస్తే ఈసారి సుమారు రెండు శాతం వృద్ధి నమోదైంది. కంపెనీ తన ఆర్థిక ఫలితాలను బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు వెల్లడించింది. సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం ఆదాయం రూ.8,853.34 కోట్లకు పెరిగినట్లు తెలిపింది. అంతర్జాతీయ మార్కెట్లలో ఔషధాల అమ్మకాలు పెరగడం, కీలక విభాగాల్లో స్థిరమైన డిమాండ్ కొనసాగడం కంపెనీ ఆదాయ వృద్ధికి దోహదపడినట్లు తెలుస్తోంది. అదే సమయంలో నిర్వహణ వ్యయాలు కూడా పెరిగాయి. సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం ఖర్చులు రూ.7,677.34 కోట్లకు చేరుకున్నాయి. ముడి పదార్థాల ధరలు, తయారీ వ్యయాలు, సరఫరా సంబంధిత ఖర్చులు పెరగడం ఇందుకు ప్రధాన కారణాలుగా భావిస్తున్నారు. అయితే పెరిగిన ఖర్చుల మధ్య కూడా సంస్థ లాభదాయకతను కొనసాగించడం పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పెంచుతోంది. ఔషధ రంగంలో గ్లోబల్ మార్కెట్లపై మరింత దృష్టి సారిస్తూ అరబిందో ఫార్మా తన వ్యాపార విస్తరణను కొనసాగిస్తున్నట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.





# మోదీ గిఫ్ట్‌తో 'మెలోడీ'కి భారీ క్రేజ్

**న్యూఢిల్లీ, మే 22 :** ప్రముఖ బిస్కెట్, కన్ఫెక్షనరీ తయారీ సంస్థ పార్లే ప్రొడక్ట్స్ తయారు చేస్తున్న 'మెలోడీ' టోఫీ చాక్లెట్లకు ఇప్పుడు దేశవ్యాప్తంగా విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఇటీవల విదేశీ పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీకి 'మెలోడీ' చాక్లెట్ల ప్యాకెట్‌ను బహుమతిగా అందజేయడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియో పెద్ద ఎత్తున చర్చనీయాంశం కావడంతో మార్కెట్‌లో మెలోడీ చాక్లెట్ల అమ్మకాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ఈ అనూహ్య స్పందనతో పార్లే ప్రొడక్ట్స్ సంస్థ మెలోడీ చాక్లెట్ల ఉత్పత్తిని పెంచినట్లు సమాచారం. ఇప్పటికే పలు ప్రాంతాల్లో రిటైల్ దుకాణాల్లో మెలోడీ స్టాక్ వేగంగా అమ్ముడవుతుండటంతో కంపెనీ అదనపు సరఫరాపై దృష్టి పెట్టింది. ఇక ఈ చాక్లెట్




పేరు వెనుక ఉన్న ఆసక్తికర అంశం కూడా ఇప్పుడు వైరల్ అవుతోంది. ఇటలీ ప్రధాని మెలోనీ, ప్రధాని మోదీ పేర్లను కలిపితే 'మెలోడీ' అనే పదం రావడంతోనే ప్రధాని మోదీ సరదాగా ఈ గిఫ్ట్ ఇచ్చారని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. దీంతో 'మెలోడీ' పేరు మరోసారి దేశవ్యాప్తంగా ట్రెండింగ్‌గా మారింది. ఈ వ్యవహారం స్టాక్ మార్కెట్‌లో కూడా ఆసక్తికర పరిణామాలకు దారితీసింది. 'మెలోడీ' చాక్లెట్లను తయారు చేస్తున్నది పార్లే ప్రొడక్ట్స్ అనే విషయం తెలియక, కొంతమంది మదుపర్లు పొరపాటున 'పార్లే ఇండస్ట్రీస్ లిమిటెడ్' షేర్లను భారీగా కొనుగోలు చేశారు. దీంతో బుధవారం ఆ కంపెనీ షేర్లలో అనూహ్యమైన కదలికలు కనిపించాయి. సోషల్ మీడియా ప్రభావం మార్కెట్‌పై ఎంత వేగంగా పడుతుందో ఈ ఘటన మరోసారి చూపించింది.



## ఐపీఓకు జెప్టో సిద్ధం

**బెంగళూరు, మే 22 :** దేశంలో వేగంగా ఎదుగుతున్న క్విక్ కామర్స్ రంగానికి చెందిన ప్రముఖ స్టార్టప్ జెప్టో త్వరలో భారతీయ స్టాక్ మార్కెట్లో అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది. ప్రారంభ పబ్లిక్ ఆఫర్ ద్వారా సుమారు రూ.11 వేల కోట్ల నిధులను సమీకరించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. ఈ ఐపీఓ విజయవంతమైతే ఇప్పటికే మార్కెట్లో నమోదైన జొమాటో, స్విగ్గీ సరసన జెప్టో కూడా చేరనుంది. సమాచారం ప్రకారం పబ్లిక్ ఆఫర్‌కు అవసరమైన అనుమతులను కంపెనీ ఇప్పటికే భారతీయ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నుంచి పొందినట్లు తెలుస్తోంది. అలాగే అప్‌డేటెడ్ డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్‌ను కూడా దాఖలు చేసినట్లు సమాచారం. జూలై 31లోపు స్టాక్ మార్కెట్లో లిస్టింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని కంపెనీ యాజమాన్యం భావిస్తున్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. క్విక్ కామర్స్ రంగంలో జెప్టో వ్యూహం ఇతర కంపెనీలతో పోలిస్తే భిన్నంగా ఉందని ప్రముఖ బ్రోకరేజ్ సంస్థ బెర్న్‌స్టీన్ విశ్లేషించింది. ప్రస్తుతం జెప్టో దేశవ్యాప్తంగా 61 నగరాల్లో 1,255 డార్క్ స్టోర్లను నిర్వహిస్తోంది. ఒక్కో నగరంలో సగటున 21 స్టోర్ల సాంద్రత కలిగి ఉండటం సంస్థ ప్రత్యేకతగా మారింది. పోటీ సంస్థలు సగటున తొమ్మిది స్టోర్ల వరకే పరిమితమవుతున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. యువ పారిశ్రామికవేత్తలు ఆదిత్ పలిచా, కైవల్య వోహ్రా స్థాపించిన ఈ సంస్థ మొదట 'కిరాణాకార్ట్' పేరుతో కార్యకలాపాలు ప్రారంభించింది. ప్రారంభ దశలో 45 నిమిషాల్లో సరుకుల డెలివరీ లక్ష్యంగా పనిచేసిన సంస్థ, తర్వాత సొంత డార్క్ స్టోర్ల మోడల్‌ను అభివృద్ధి చేసి కేవలం 10 నిమిషాల్లోనే సరుకుల డెలివరీ చేసే సేవలను ప్రారంభించింది. వేగవంతమైన సేవలను ప్రధాన బలంగా మార్చుకుని సంస్థ 'జెప్టో'గా పేరు మార్చుకుంది. భారతదేశంలో ఆన్‌లైన్ గ్రోసరీ, తక్షణ డెలివరీ సేవల వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో జెప్టో ఐపీఓ మార్కెట్లో మంచి ఆసక్తిని రేకెత్తించే అవకాశాలు కనిపిస్తున్నాయని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# పీఎఫ్ ఖాతాల విలీనం తప్పనిసరి

**న్యూఢిల్లీ, మే 22 :** ఉద్యోగాలు మారే సమయంలో చాలామంది ఉద్యోగులు కొత్త కంపెనీలో చేరిన తర్వాత పాత భవిష్యనిధి ఖాతాలను కొత్త ఖాతాలో విలీనం చేయకుండా వదిలేస్తుంటారు. దీంతో ఒకే యూఏఎన్ నంబర్‌కు అనేక పీఎఫ్ ఖాతాలు నమోదై ఉండే పరిస్థితి ఏర్పడుతుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం ఇలా పాత ఖాతాలను విలీనం చేయకుండా ఉంచితే భవిష్యత్తులో పీఎఫ్ క్లెయిమ్, డబ్బుల ఉపసంహరణ, పెన్షన్ సేవల విషయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముంది. అందుకే ఉద్యోగం మారిన వెంటనే పాత పీఎఫ్ ఖాతాలను కొత్త ఖాతాలో విలీనం చేసుకోవడం అత్యవసరమని చెబుతున్నారు. కొత్త కంపెనీలో చేరిన తర్వాత అదే యూఏఎన్ నంబర్‌తో మరో కొత్త మెంబర్ ఐడీ సృష్టించబడుతుంది. ఈ కొత్త ఐడీకి పాత పీఎఫ్ ఖాతాలను బదిలీ చేయడం వల్ల వడ్డీ నిరంతరంగా జమ అవుతూ ఉంటుంది. అలాగే ఉద్యోగ సేవల చరిత్ర కూడా ఒకే ఖాతాలో నమోదు కావడంతో భవిష్యత్తులో పెన్షన్ ప్రయోజనాలు పొందడంలో సౌలభ్యం కలుగుతుంది. ముఖ్యంగా పీఎఫ్ డబ్బులు ఉపసంహరించుకునే సమయంలో ఆలస్యం తగ్గుతుంది. పీఎఫ్ ఖాతాలను విలీనం చేసుకోవడానికి ఉద్యోగులు ముందుగా యూఏఎన్ పోర్టల్‌లోకి వెళ్లి తమ యూఏఎన్ నంబర్, పాస్‌వర్డ్‌తో లాగిన్ అవ్వాలి. అనంతరం ఆన్‌లైన్ సేవల విభాగంలోకి వెళ్లి "ఒక సభ్యుడు-ఒకే పీఎఫ్ ఖాతా" అనే ఎంపికను ఎంచుకోవాలి. అక్కడ వ్యక్తిగత



వివరాలు, పాత పీఎఫ్ ఖాతాల వివరాలను ధృవీకరించాల్సి ఉంటుంది. పాత యాజమాని వివరాలను పొందడానికి 'గెట్ డీటైల్స్'పై క్లిక్ చేసి, ప్రస్తుత లేదా పాత యాజమానిని ధృవీకరణ కోసం ఎంచుకోవాలి. తర్వాత సభ్యుని ఐడీ లేదా యూఏఎన్ నంబర్ నమోదు చేసి, మొబైల్‌కు వచ్చే ఓటీపీని నమోదు చేస్తే విలీనం ప్రక్రియ పూర్తవుతుంది. ఇక ఈ ప్రక్రియను ఈమెయిల్ ద్వారా కూడా చేయవచ్చు. ఇందుకోసం ఉద్యోగులు తమ వివరాలను యూఏఎన్‌కు సంబంధించిన అధికారిక ఈమెయిల్ చిరునామాకు పంపించి పాత యూఏఎన్ ఖాతాను మూసివేయాలని కోరవచ్చు. అనంతరం పీఎఫ్ సంస్థ పాత ఖాతాను నిలిపివేసి సమాచారం అందిస్తుంది. అలాగే పీఎఫ్ విలీనం అభ్యర్థన స్థితిని ఈపీఎఫ్‌వో పోర్టల్‌లో 'ట్రాక్ క్లెయిమ్ స్టేటస్' ద్వారా తెలుసుకోవచ్చు. అక్కడ పెండింగ్‌లో ఉన్నవి, ఆమోదించబడిన అభ్యర్థనల వివరాలు కనిపిస్తాయి. ఇదిలా ఉండగా భవిష్యత్తులో ఉద్యోగులు ప్రత్యేకంగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేకుండా పీఎఫ్ ఖాతాలు ఆటోమేటిక్‌గా బదిలీ అయ్యే విధంగా కొత్త వ్యవస్థను ఈపీఎఫ్‌వో రూపొందిస్తున్నట్లు సమాచారం. త్వరలోనే ఈ కొత్త విధానం అమల్లోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

# భాష హద్దులు దాటితే.. భవిష్యత్తు శూన్యం!



ప్రజాస్వామ్య వ్యవస్థలో విమర్శలు, ప్రతివిమర్శలు సహజం. అయితే, వాటికి ఒక గౌరవప్రదమైన పరిమితి, సంస్కారం ఉండాలి. లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలను ఉద్దేశించి "ద్రోహులు" అని వ్యాఖ్యానించడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. రాజ్యాంగ పరిరక్షణ పేరుతో ఆయన చేస్తున్న ఇటువంటి ఘాటు వ్యాఖ్యలు, విమర్శల స్థాయిని దిగజార్చేలా ఉన్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది.

గతంలో కూడా "చౌకీదార్ చోర్ హై" వంటి నినాదాలు, సైనికుల రక్తాన్ని వ్యాపారంగా మార్చుకున్నారనే తరహా ఆరోపణలు రాహుల్ రాజకీయ ప్రసంగాలలో భాగమయ్యాయి. ప్రజా సమస్యలను గట్టిగా వినిపించా ల్సిన వేదికలపై, ఇలాంటి వ్యక్తిగత విమర్శలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల అసలు సమస్యలు పక్కదారి పట్టే ప్రమాదం ఉంది. తరచూ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం, వాటిని సమర్థించు కోవడం ఆయనకు ఒక వ్యూహాత్మక అలవాటుగా మారిందన్న విమర్శలు వస్తున్నాయి. నిరంతర రాజకీయ పరాజయాలు, పార్టీని ఆశించిన స్థాయిలో ముందుకు తీసుకెళ్లలేకపోతున్నామనే ఆవేదన విపక్షంలో కన్పిస్తోంది. కేవలం ప్రధానిని లేదా ప్రభుత్వ పెద్దలను దూషించడం వల్లే ప్రజాదరణ పెరుగుతుందనే తప్పుడు అంచనాలో కాంగ్రెస్ నాయకత్వం ఉన్నట్లు అనిపిస్తోంది. కానీ, నిరూపించలేని నిందలు, చౌకబారు విమర్శలు ఎప్పటికీ నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్రను భర్తీ చేయలేవు.

రాజకీయ విమర్శలకు ఒక హుందాతనం ఉంటుంది. పదునైన పదజాలంతో కూడా ప్రభుత్వాన్ని బోనులో నిలబెట్టవచ్చు. అదే పార్టీకి చెందిన ప్రియాంక గాంధీ వాద్రా వంటి నేతలు పరిమితులు దాటకుండా, నిలకడైన శైలిలో విమర్శలు చేస్తుండటాన్ని ఇక్కడ గమనించవచ్చు. రాజకీయంగా ఎదగడానికి ఆవేశం కంటే ఆలోచన, పదాల సంయమనం ఎంతైనా అవసరం. "ఒక నాయకుడు తప్పుదోవ పడుతున్నప్పుడు సరిదిద్దాల్సిన అనుచరులు, మరింత ఉత్సాహపరుస్తూ పోటీ పడటం ప్రజాస్వామ్యానికి చేటు చేస్తుంది." రాహుల్ చుట్టూ ఉన్న కొందరు నాయకులు ఆయన ప్రతి అసంబద్ధ ప్రకటనను సమర్థించడమే కాకుండా, తాము కూడా అంతకంటే ఘాటైన వ్యాఖ్యలు చేయడానికి పోటీ పడుతున్నారు. ఇది తాత్కాలికంగా మీడియా దృష్టిని ఆకర్షించవచ్చేమో కానీ, దీర్ఘకాలంలో ప్రజల్లో నమ్మకాన్ని పోగొడుతుంది. అహంకారపూరిత ధోరణి వీడి, ప్రజా సమస్యలపై నిర్మాణాత్మక పోరాటం చేసినప్పుడే ప్రతిపక్షానికి అసలైన గౌరవం లభిస్తుంది. ఇప్పటికైనా కాంగ్రెస్ శ్రేణులు విమర్శల స్థాయిని పెంచి, రాజకీయ భాషా సంస్కారాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆకుల సత్తిరాజు
సీనియర్ జర్నలిస్ట్

